ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ — సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి

సంపుటి 12 - సంచిక 2
**జులై 2010**
**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

Please send drafts in favour of
**SRI VEDAMATA GAYATRI TRUST BUSINESS DIVISION, HYDERABAD**


## సేవాధర్మం

మనలో సేవ చేయాలని చాలా మందికి ఉంటుంది. కాని జాగ్రత్తగా పరిశీలించి చూస్తే సేవకన్నా, దాన్ని ఆధారం చేసుకునే ఉన్న కీర్తి కాంక్షయే ఎక్కువ. ప్రేమ మార్గమే సేవా ధర్మం. ప్రేమతో వ్యాపారం చెయ్యలేం. నిజానికి ప్రేమకి లోబడి సేవ చేయడంలేదు. ఏ కొద్ది పాటి సేవ చేసినా దానికి రెట్టింపు అహంకారాన్ని పెంచుకుంటున్నాం. సేవా సాధనలో మనల్ని సమాజంలో ఒక అంగంగా భావించుకోవాలి, అప్పుడే కర్తవ్యాన్ని నిర్వహించు కోగలుగుతాం.

సేవా కార్యక్రమంలో ఎంతో కొంత త్యాగం చేస్తూ ఉంటాం. కాని ఆ త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ అహంకరిస్తూ ఉంటాం. ఆ అహంకారాన్ని వదులుకోలేకపోతుంటాం. అహంకార కారణంగా అనేక అనర్థాలు పుట్టుకొస్తూ ఉంటాయి. అందుకే అహంకారాన్ని దూరంగా ఉంచాలి. అప్పుడే సేవాధర్మాన్ని పాటించగలుగుతాం.

సమాజంలో సంస్థలు, ఆశ్రమాలు మొదలైనవన్నీ సేవారంగంలో తమవంతు కృషి చేస్తూఉన్నాయి. అవి ఏ రూపంలో చేసినా సమాజానికి మేలు చేకూరుస్తాయి. అయితే దీనులను, దుఃఖితులను, పీడిత వర్గాన్ని ఆదుకోవాలి అనుకునే వారి సంఖ్య తక్కువగా ఉంటుంది. అలాంటివారికి నిజమైన సానుభూతితో సేవలను అందించాల్సి ఉంటుంది. మన చేత సేవలు పొందుతున్నవారిని హీనులుగా భావించరాదు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మన బాధ్యతగా భావించి చెయ్యాలి. అప్పుడే మనం చేసిన సేవకు సార్థకత లభిస్తుంది.

కొంతమంది ఆధ్యాత్మిక జీవితంలో లీనమైపోతారు. కానీ, పేదవారిని, నిస్సహాయులను కన్నెత్తి కూడా చూడరు. సుజలగా, సుఫలగా, సస్యశ్యామలగా పేరు గాంచిన భారతభూమి పై కడుపునిండా తిండికి, ఒంటినిండా బట్టకు నోచుకోనివారు లక్షల సంఖ్యలో ఉన్నారు. నిలువ నీడ లేక చెట్ల క్రింద, పుట్టల క్రింద జీవితాలను వెళ్లదీస్తున్నారు. దీనదుఃఖితులకు దానం, ఆర్తులకు సేవ చేయగలిగిన వ్యక్తులు కావాలి. పరమాత్మ ప్రేమను పొందాలనుకున్నవారు పేదల ముఖాలపై చిరునవ్వును తెప్పించగలగాలి. అహంకారంతో విర్ర వీగకుండా సేవలను అందిస్తూ ఉండాలి. కలియుగంలో ప్రముఖ స్థానం సేవదే అని గుర్తించాలి. అందరూ సేవా ధర్మాన్ని పాటించాలి. మానవ సేవే మాధవ సేవ.


పత్రిక అందనివారు ఈ క్రింది నంబర్లనుసంప్రదించగలరు.
**9032674117, 9603509900**

పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. **9989659905**


**దుష్ట శిక్షణ కాదు - దుష్టత్వ శిక్షణ కావాలి.**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** సేవాధర్మం 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :** ఇలాంటి భయంకరమైన పొరపాట్లు చెయ్యవద్దు 2
3. **వేదమంత్రం :** మనం ఎలా ప్రవర్తించాలి? 3
4. **వర్తమాన భారతం :** ఏమయింది భారతీయులకు? 4
5. **ఉపాసనకు రెండు పాదాలు : జపం-ధ్యానం** ధ్యానం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా? 7
6. **బాలల భవితకు బంగారు బాట-9 :** అమ్మకోసం 8
7. **ధారావాహిక : ప్రజ్ఞోపనిషద్** ద్వితీయ అధ్యాయం - 8 9
8. **తత్వచింతన :** ప్రార్థనయొక్క స్వరూపము-స్థాయి-ప్రభావము 10
9. **ధారావాహిక : పరమేశ్వరుని చిరునామా-14** ప్రకృతినుండి పాఠాలు 13
10. **మనం-మన ఆరోగ్యం :** సృష్టికర్త అమూల్యవరం-వనౌషధీ విజ్ఞానం 15
11. **ధారావాహిక : హనుమత్ కథామృతం-27** ఇంద్రునికి క్షమ-హనుమాన్‌కు వరాలు లభించాయి 18
12. **సాధనా విజ్ఞానం :** గురుదీక్ష - దేవదక్షిణ 20
13. **ధారావాహిక : భక్తిగాథ - 32** ఒక మహర్షి రాజభవనానికి వచ్చి భోజనం స్వీకరించడంలోని అంతరార్థం 23
14. **ప్రత్యేక వ్యాసం : 25-7-2010 గురుపౌర్ణమి సందర్భంగా** మహాకాలుని మహాయోజన 25
15. **పూజ్య గురుదేవుల అమృతవాణి** దేవత్వమును వికసింపచేసుకోండి-కాలనేములు కాకండి 27
16. **వైజ్ఞానిక ఆధ్యాత్మికత :** శక్తియొక్క చేతన స్వరూపాల అనుభూతి 31
17. **జీవించేకళ :** గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి 33
18. **ఆదిశక్తి యొక్క లీలా కథలు -1** 34
19. **గాయత్రీమాత-24 శక్తిధారలు 14 :** సరస్వతి 37
20. **మహిళాజాగరణ :** ఈనాటి ఆదర్శ మహిళలు అర్చన నవనీత వనవనాభివృద్ధి 38
21. **దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం-4** తక్షశిలా విశ్వవిద్యాలయం 39
22. **నా వారితో నా మాట : 2011-2012 (శతాబ్ది సం॥)** జన్మశతాబ్దికి ఇంకా 222 రోజులు మాత్రమే ఉన్నాయి 40
23. **యుగనిర్మాణ ప్రణాళిక - యుగఋషి దృష్టికోణంలో** 43
24. **వార్తలు** 45


# సద్గురు వచనామృతం



## ఇలాంటి భయంకరమైన పొరపాట్లు చెయ్యవద్దు

ఇతరులు మన బాధలకు కారణం అని భావించకూడదు. మన పనులు కాకపోవటానికి, మన దుర్బలతలకు ఇతరులను నిందించకూడదు. ఇతరుల హక్కులను కాలరాయడం వల్ల వారికి అనవసరంగా హాని కలుగుతుంది. మనకు ఏమీ లాభం ఉండదు. ఇలా బాధపడేవారిలో మీ మేలుకోరే మిత్రులెవరైనా ఉంటే వారు మీ అనుచిత ప్రవర్తన వల్ల కోపగించి మీకు బాధలు కష్టాలు కలిగించవచ్చు. వ్యక్తిగత పురోభివృద్ధికి శారీరిక మానసిక పరిస్థితులే పునాది రాళ్ళు. ఇతరులను నిందించడం, అణచివేయడం, కాలరాయడం అనేది మీలో ఉన్న ఈర్ష్య, క్రోధ, ఆవేశాల ప్రతిక్రియలు. ఇటువంటి తుచ్ఛకార్యములు చేసే వ్యక్తిలోని శక్తులు క్రమక్రమంగా నశించిపోతాయి. ఈర్ష్యఅనే అగ్ని లోపల లోపలనే రగులుతూ ఉత్సాహాన్ని, సహనాన్ని, మానవత్వాన్నే చంపివేస్తుంది. మన మంచి చెడు పరిస్థితులకు మనమే కారణం. ఇతరులను అనవసరంగా నిందించే పొరపాటు చేయవద్దు. మీరు ఔన్నత్యాన్ని పొందండి. కాని ఇతరులను మీ మార్గంలో అడ్డంకులుగా భావించవద్దు. జరిగిపోయిన పొరపాట్లు, ప్రతికూలతలు, హాని గురించి పదే పదే చింతించడం, బాధపడటం వంటివి చేయటం ఆత్మకు హాని కలిగించటమే. ఇలా చింతించే అలవాటును వదిలించుకోవడం ఉత్తమం. ప్రస్తుతం ఏం చేయాలో ఆలోచించడం సవ్యమైన పద్ధతి.

## పండుగలు

**జూలై 2010**

| | |
|---|---|
| 25-07-2010 | గురుపౌర్ణమి |

**ఆగష్టు 2010**

| | |
|---|---|
| 14-08-2010 | నాగపంచమి |
| 15-08-2010 | స్వాతంత్ర్య దినోత్సవం |
| 20-08-2010 | వరలక్ష్మి వ్రతం |
| 24-08-2010 | రాఖీ పౌర్ణమి |

**ఆకలిగొన్న వారికి అన్నం పెట్టడమే కాదు, అన్నాన్ని సంపాదించుకునే మార్గం చూపించాలి.**

వేద మంత్రం

# మనం ఎలా ప్రవర్తించాలి?

అక్రన్ కర్మా కర్మకృతః సహవాచామయోభువా ।
దేవేభ్యః కర్మకృత్వాస్తం ప్రేత సచాభువః ॥

*(యజుర్వేద 3/47)*

**భావార్థం :** సోమరితనం వదలి పురుషార్థివికావాలి, మూర్ఖత్వం వదలి వేద జ్ఞానాన్ని పొందు, మధురంగా మాట్లాడు. పరస్పరం కలసి మెలసి, ఒకరికొకరు సహాయం చేసుకోవాలి. దీనితో ఇహలోక, పరలోక సుఖాలు రెండూ ప్రాప్తిస్తాయి.

**సందేశం :** అంతులేని జ్ఞాన విజ్ఞానాల రాశి వేదాలలో నిండి ఉంది. వేదజ్ఞానంవల్ల మేలు జరుగుతుంది. వేదాల ద్వారా ప్రపంచంలోని అతి రహస్యతత్త్వాలు తెలిసివస్తాయి. ఈ లభించిన జ్ఞానం ఎలా సదుపయోగం చెయ్యాలో కూడా అదే మార్గం చూపిస్తుంది. సంస్కారాల ద్వారా అజ్ఞానానికి విముక్తి కలిగించాలి. పడిపోయిన వారిని పైకి లేపే ప్రయత్నం చెయ్యాలి. సత్‌జ్ఞానం ప్రచారం చెయ్యాలి. ఇదే మానవధర్మం. మానవులు తమ తమ స్వార్థం, కోరికలు తీర్చుకోవడం అనే మూర్ఖత్వంలో మునిగి ఉన్నారు. ఇందుకోసం ఉచితానుచితాల విచక్షణ వదలి నీచత్వపు పరాకాష్ఠ వరకు చేరుకుంటున్నారు.

సజ్జనులు పయనిస్తున్న మార్గంలో మనం ఎల్లప్పుడూ పయనిస్తూ ఉండాలి. “ఓం దేవానామపి పన్థామగన్మ” మనం పరస్పరం సజ్జనత్వంతో వ్యవహరించాలి. సజ్జనుల వ్యవహారం ఉదారత, సహాయత, ప్రేమలతో నిండి ఉంటుంది. ఇదే దేవోపమ వ్యవహారం. మనం కూడా పరస్పరం ఇలానే వ్యవహరించాలి. వేదజ్ఞానంతో అందరి ఉన్నతికి రాచబాట వేయాలి. మన స్వార్థం కంటే, ఇతరుల మేలు ముందు గుర్తుంచుకోవాలి. పరస్పరం మధురంగా మాట్లాడుకోవాలి. మధురమైన మాటతో కలహం దరిచేరదు. ప్రేమ పెరుగుతుంది. మాట తేనెవలె తియ్యగా ఉండాలి. నెయ్యివలె లాభదాయకంగా ఉండాలి. తియ్యగా మాట్లాడే వారికి ప్రతీ విషయంలోనూ విజయం లభిస్తుంది. ఇతరులకు తప్పుడు మార్గంలో వెళ్లే సలహాలు ఇవ్వవద్దు. ఏ పని చేసినా అందరికీ హితం కలగాలి.

జీవితం అశాశ్వతమైనది అంటే దాని అర్థం సమయాన్ని వృథా చేసుకోమని కాదు. సోమరితనంతోనూ, అక్కరలేని కబుర్లతోనూ కాలం గడిపివేయమని కాదు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న ప్రేరణను పొందాలి. సమయాన్ని అమూల్యంగా భావించి వృథా చేయకుండా ఉండాలి. అలా ప్రవర్తించినప్పుడే మనకు సమయం మిగుల్తుంది. పరమాత్మ సమయాన్ని ఇవ్వడంలో ఏ మాత్రం పక్షపాతం చూపించలేదు. ధనవంతునికి, పేదవానికి, జ్ఞానికి, మూర్ఖునికి, స్త్రీకి, పురుషునికి, పిల్లలకు, పెద్దలకు అందరికీ సమయ సంపదను సమానంగానే ఇచ్చాడు. కాలవ్యవధిని మనం తగ్గించలేము, పెంచలేము. తెలివిగా దాన్ని సద్వినియోగం చేసుకుంటే విజయం మనదే.

నిష్క్రియత జడత్వం యొక్క లక్షణం. మృత్యువు యొక్క లక్షణం. సోమరులు, మూర్ఖులు, అజ్ఞానులు, దరిద్రులు జీవన్మృతులు అవుతారు. జ్ఞానులైనవారు శాంతంగా సంతులనంతో ఉండి జీవితంలోని ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకుంటారు.

సోమరి ఎప్పుడూ ఆనందంగా ఉండలేడు. జ్ఞానులు, పురుషార్థులు శ్రేయస్సును పొందుతారు. అందువలన కోరువారికే ఆత్మానందం లభిస్తుంది. వారు జీవితంలో అన్ని విధాలైన సుఖాలు, సంతోషం పొందగలుగుతారు. అందుకే మనం మన ప్రవర్తనను సరిదిద్దుకోవాలి.

★★★

**ఆనంద సౌధానికి ఆధ్యాత్మికతే పునాది - స్వామి వివేకానంద.**

వర్తమాన భారతం

# ఏమయింది భారతీయులకు?

మనము ఈ రోజులలో ఒక విశేషమైన సమయంలో ఉన్నాము. వంద సంవత్సరాల క్రితం ఉన్న పరిస్థితులకన్నా ఈనాటి పరిస్థితులు ఇంకా ఎక్కువ బాధాకరంగా ఉన్నాయి. ఆ రోజులలో వనరులు తక్కువయినా, సైన్సు ఇంతగా ఎదుగకపోయినా, ప్రతికూలతలు ఉన్నప్పటికి ప్రజలు సంతోషంగా ఉండేవారు. వ్యవసాయం వరుణ దేవుని కృపమీద ఆధారపడి ఉండేది, కాని బంగారం లాంటి పంటలు పండేవి. పళ్ళు తియ్యగా ఉండేవి. అన్నంలో రుచి ఉండేది, ఖాళీ స్థలం చాలా ఉండేది. మనుష్యులు తక్కువగా ఉండేవారు. బీదవారు ఉండేవారు. కాని లేమిలో కూడా తృప్తిగా జీవించేవారు. ఒకరికొకరు సహకరించుకునేవారు. ఎక్కువ పల్లెలే ఉండేవి. పట్టణాలు, మహా నగరాలు ఇంకా రాలేదు. కాలుష్యం ఉండేది కాదు. అందువల్ల శ్వాస తీసుకునేందుకు ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. రోగాలు కూడా తక్కువగా ఉండేవి. మనో వికారాలు ఉండేవి కావు. ప్రజలు కలసి కష్టించి పనిచేసేవారు, దొరికిన దానితో తృప్తిగా జీవించేవారు.

### ఈనాటి పరిస్థితి

చాలా వేగముగా వైజ్ఞానిక ప్రగతి జరుగుతున్నది. ప్రతి క్షేత్రంలోను నిత్యనూతన అవిష్కారం, ప్రతిభలు వెల్లివిరిశాయి. రకరకాల గృహోపకరణాలు, ఇతర యంత్రాలు లభ్యమయ్యాయి. కాని గుణముల దృష్టిలో, ఆదర్శముల దృష్టిలో మనం చాల చౌకబారుగా జీవిస్తున్నాం. స్వతంత్ర భారతదేశంలో సుఖంగా, తృప్తిగా ఉండాలి కాని మనను బాధలు, కష్టాలు, దుఃఖాలు మనోరోగాలు పీడిస్తున్నాయి. ఎందువలన? అశ్లీలత, యవ్వనంలో చేసే అపరాధాలు విపరీతంగా పెరిగిపోయాయి. గందరగోళ పరిస్థితులవైపు వెళ్తున్నాం. కుటుంబాలు విచ్ఛిన్న మవుతున్నాయి. యువశక్తి కొన్ని కూడని అలవాట్లతో మజా చేస్తున్నది. సుఖ సంతోషాలతో ఉండాలనుకుంటూ సమయాన్ని ఆరోగ్యాన్ని, ధనాన్ని, జీవితాన్ని పాడుచేసుకుంటున్నారు.

అన్ని సమస్యలను, ఈనాటి పరిస్థితులను వివేచన చేసినట్లయితే వీటన్నింటికి ఒకే కారణం కనిపిస్తుంది. ఈనాటి మనిషికి – భారతదేశ వాసులు కావచ్చు, ఇతర దేశస్థులు కావచ్చు ధన సంపాదనే ముఖ్యమయింది. ఎలాగో అలాగా డబ్బు సంపాయించాలి. కాని గుణముల దృష్టిలో, స్వభావ వ్యక్తిత్వ దృష్టిలో జీవితం అధమ స్థాయికి దిగజారింది. మీడియా ప్రపంచమంతా అతి వేగంగా విస్తరించింది. అన్ని ప్రాంతాలలో జరుగుతున్న విషయాలు మరుక్షణంలో తెలుస్తున్నాయి. హైస్పీడ్ ఇంటర్‌నెట్ ప్రపంచాన్ని ఒక్కటి చేసింది. కాని దీని ఉపయోగం సవ్యంగా చేస్తున్నామా? తీవ్రవాదులను నిర్మూలించేందుకు కావలసిన ఆలోచనా వికాసం చేయగలిగే సార్వభౌమిక, సార్వజనీన, సర్వకాలీన ఆధ్యాత్మిక విద్యను అందరికి అందించే ప్రయత్నం కొంచం అయినా చేస్తున్నామా? లేనట్లే ఉన్నది. ఆలోచనలు సవ్యంగా లేకపోవడం వల్ల గ్రహించేశక్తిలో లోటు ఉన్నది. నలువైపులా బజార్ల హడావిడి కనుపిస్తుంది. ప్రతీ వస్తువు అమ్మకానికి సిద్ధంగా ఉన్నది. బట్టలు, దైనందిన అవసరాలు అమ్మబడుతున్నాయి. డబ్బులున్న వారు కొనుక్కుంటారు.

### ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు

ఈ మధ్య ముంబయి మహానగరంలో 8 ఎకరాల స్థలం 4000 కోట్ల రూపాయలకు అమ్మబడింది. వస్తువిలువను బట్టి దాని ఖరీదు నిర్ణయించబడుతుంది. ఈ నియమం అన్ని సందర్భాలలో కనిపిస్తుంది. కాని మనిషి ఖరీదెంత? మనం ప్రజా ప్రతినిధులను ఎన్నుకుంటాం. ఎన్నిక అవగానే వారు అమ్మకానికి సిద్ధంగా ఉంటారు. ఇది మన దేశంలోనే కాదు ఇతర దేశాలలో కూడా ఉన్నది. గ్రేట్ బ్రిటన్ కూడా ఉన్నది. ప్రతి అధికారి ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్, ప్రజాప్రతినిధి కావాలనో అనుకుంటారు, లక్షల రూపాయల డోనేషన్ ఇచ్చి డాక్టర్ చదువు చదువు కుంటున్నారు. ఎందుకు? డబ్బు సంపాదనే

బానిసకు బాధ లెక్కువ. స్వతంత్రుడికి బాధ్యతలెక్కువ.

ముఖ్యమయింది. డబ్బుఆకర్షణ జీవన మూల్యాలను ఈనాడు ప్రభావితం చేస్తున్నట్లు ముందు ఎప్పుడూ చూడలేదు.

### ఇది మనం ఆలోచించామా ?

ఏ త్యాగ మూర్తులు మనకు స్వాతంత్ర్యం సంపాదించి పెట్టారో, వారు ఎన్నడు ఇలాంటి చౌకబారు మనుష్యులు తమ వారసులవుతారని ఊహించలేదు. ఏ కార్యక్షేత్రం చూచిన ఇలాంటి పరిస్థితే కనుపిస్తుంది. మరి దీనిని సవరించేందుకు మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇచ్చేవారు, పాజిటివ్‌గా ఆలోచించేవారు ఏమయినా చేయగలరా? ఒంటరి ప్రయత్నాలు ఉన్నాయి కాని వ్యర్థమవుతున్నాయి. ఇటువంటి వ్యక్తుల సామూహిక ప్రయత్నం అవసరమవుతుంది. కొంతమంది చేసిన ప్రయత్నాలు మంచి ఫలితాలను ఇస్తున్నది. కాని వీటి ప్రస్థావన మీడియాలో ప్రత్యేకంగా ఉండదు. మీడియాకు రాజకీయ నాయకుల గురించి, సినిమా కళాకారుల గురించి, ఆచార వ్యవహారాల గురించి తప్పితే మిగిలిన వాటికి సమయం లేదు. మీడియా అభిరుచి ఈ దిశలో లేదు.

ధర్మతంత్రం వైపు చూస్తే పరిస్థితి ఇంకా నిరాశాజనకంగా ఉన్నది. ప్రజల శ్రద్ధను పిండుకుని ఇది కోట్లాది రూపాయల సామ్రాజ్యం అయింది. ఇది కనుక తలచుకుంటే దేశానికి కాలకల్పం జరుగుతుంది. లెక్కలేనన్ని ఆశ్రమాలు, సాధువులు, మహంతులు, మహామండలేశ్వరులు, హరికథలు చెప్పేవారు ఉన్నారు. కాని ఎక్కడా ఏ మార్పు కనిపించడంలేదు. చెప్పేదొకటి చేసేదొకటి అయినప్పుడు ఏ మార్పు వస్తుంది? ఆదిశంకరాచార్యుల వారు (క్రీ.శ. 800) భారతదేశంలో సాంస్కృతిక దిగ్విజయ యాత్ర చేసి దేశమంతటిని అఖండం చేసి, శాశ్వత ఆధ్యాత్మిక ఆలోచనా సరళి అందించారు. ఎలా జీవించాలో నేర్పారు. ఈనాడు అనేక శంకరాచార్యులు ఉన్నారు, మహా మండలేశ్వరులు ఉన్నారు. కాని వీరి ఆలోచనా సరళి ఒకటిగా ఉండదు. జన మానసం ధర్మతంత్రం యొక్క విశ్వాసనీయమైన భాష అర్థం చేసుకుంటుంది. మరి జన బాహుళ్యానికి సరియైన దిశ ఇవ్వగలమా?

### భారతీయులు ఎక్కడో దారి తప్పారు

భా అంటే వెలుగు. రతి అంటే ప్రేమించేవారు. వెలుగును ప్రేమించేవారు భారతీయులు ఎక్కడో దారి తప్పారు, అంధకారాన్ని స్వీకరించారు. జీవితాన్ని తమస్సుతో నింపుకున్నారు. దానిని సవరించేందుకు మంగళ విజయ్ అనే కవీశ్వరుడు 35 సంవత్సరాల క్రితం ఒక కావ్యం రచించారు. అది ఈనాటి పరిస్థితులకు, అన్ని వర్గాల వారికి సరిపోతుంది. స్వామి వివేకానంద ఉపనిషద్ వాక్యం ఆధారం చేసుకుని అందరిని అమృత పుత్రులని ఘోషించారు. (శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రః) అమృత పుత్రులు భారతీయులు ఎక్కడో గడబిడ అయ్యారు. ఎప్పుడో ఎక్కడో తమ బాధ్యతలనుండి విముఖులయ్యారు. అంధకారం నచ్చటం మొదలుపెట్టింది. ఎవరైతే యుగధర్మాన్ని విస్మరిస్తారో, తమ సుఖ సంతోషాల గురించే ఆలోచిస్తారో వారిని పరమ స్వార్థపరులు అని అనవచ్చు. వీరిని మహాకాలుడు విడిచిపెట్టడు, సామూహిక దండ వ్యవస్థలో వీరికి దండన తప్పదు.

### ఆధ్యాత్మిక వికాసం మన లక్ష్యం కావాలి

మానవీయ విలువలకు, సంస్కృతికి ప్రాధాన్యత ఇచ్చే జీవనమే అన్ని సమస్యలకు సమాధానం. ఈనాడు తరిగిపోయిన మానవ విలువలను ఆధ్యాత్మిక జీవనం జీవించేవారు మాత్రమే యథాస్థితికి తీసుకురాగలరు. వీటిని పెంపొందించే అవసరం ఎంతైనా ఉన్నది. ఫానటిజమ్ (ధర్మ విషయాలలో మొండి తనం, మతఛాందసులు) వైపు తీసుకువెళ్ళే ధర్మతంత్ర దిగ్గజాల పెద్ద పెద్ద మాటలు కాదు కావలసినది, ఈ పని విశుద్ధ ఆధ్యాత్మ పక్షం వహించేవారే చేస్తారు. ఎప్పుడయితే సార్వభౌమ విజ్ఞాన సమ్మతమైన ఆధ్యాత్మిక సందేశం మన దేశంలోనే గాక విశ్వమంతా వెళ్ళినపుడు మత ఛాందసులు, తీవ్రవాదులు, నక్సలైట్లు అందరూ సహజంగా రూపుమాపబడతారు. ఒక అహింసాత్మక క్రాంతి జరుగుతుంది. మనకు స్వతంత్రం సంపాదించి ఇచ్చిన మహనీయుల ఇచ్ఛానుసారం స్వరాజ్యం స్థాపించబడుతుంది.

**ఆత్మానందం పొందినవారు బాహ్య దుఃఖానికి చలించరు.**

### ఈనాటి మహాభారతం

గాయత్రీ పరివార్ గురుసత్తా మార్గదర్శనంలో ఆలోచనల క్రాంతిని అదృశ్యంగా మేలుకొల్పింది. దుర్మతి వల్ల జనించిన దుర్గతి నుండి శ్రేష్ఠమైన ఆలోచనలు మాత్రమే రక్షించగలవు. ఆలోచనలను ఆలోచనల ద్వారా నిలువరించే ప్రక్రియతో, జ్ఞానయజ్ఞంతో నిశ్చయంగా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. జీవనం పారదర్శకమవుతుంది. మానవ విలువల ప్రాముఖ్యత అర్థం అవుతుంది. ఈ పని యుద్ధ ప్రాతిపదికపై చెయ్యాలి. ఇదే ఈనాటి అతిపెద్ద మహాభారతం. ఈ సంవత్సరం, రాబోయే రెండు సంవత్సరాలు మానవజాతికి అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి. ఎందుకంటే ఈ రోజులలో ప్రపంచంలోని మానవుల భాగ్యం తిరిగి వ్రాయబడుతుంది. దైవీసత్తా మనతోనే పరోక్షంగా ఉన్నది. మనము తుఫాన్ వేగంతో పోగలిగే వాతావరణాన్ని తయారు చేయగలమా?

### గాయత్రీ పరివార్ ప్రకాశపుత్రులు

ఇది ప్రకాశ పుత్రులే చేయాలి. వీరిని గాయత్రీ పరివార్‌తో పాటు కొన్ని సమాజ సేవ సంస్థలలో చూడవచ్చు. గురుపూర్ణిమ (25.07.2010) పుణ్య సమయాన ధర్మ సంస్కృతి – మానవత్వం కొరకు కృత సంకల్పం తీసుకున్న వారు కొన్ని గట్టి నిర్ణయాలు తీసుకోగలుగుతారు. కాని కాల ప్రవాహంలో వారిపై కూడా బద్దకం, పొరపాట్లు అనే నల్లని నీడ కనిపిస్తుంది. సౌకర్యాలు, వసతులు సంపాదించే పరుగుపందెంలో వీరు కూడా భాగస్వామ్యులవుతారు. వీరు ఆత్మచింతన చెయ్యగలుగుతారా? వారి అంతరాత్మ వారిని కుదుపుతుందా?

తప్పనిసరిగా జరుగుతుంది. శ్రేష్ఠులైన, వరిష్ఠులైన ప్రాణవంతులు కూడా నిద్రపోతే విశ్వమానవత కష్టాలు, పతనం, పరాభవం నుండి ఎవరు రక్షిస్తారు? ఇది గాయత్రీ పరివార్ యొక్క సభ్యుల ద్వారా, ఆత్మీయుల ద్వారా, పాఠకుల ద్వారా సత్యయుగ పునరాగమనం జరుగుతుంది.

మనలను మనం గుర్తించడానికి, మన శక్తులను తెలుసుకొని సరియైన కార్యముల కొరకు వినియోగించడానికి ఇదే సరియైన సమయం. రాబోయే మూడు సంవత్సరాలు మహాకాలునితో పాటు ఈ ఉద్యమంలో పాలుపంచుకుంటే 1013 తరువాత ఇతిహాసం అతి శ్రేష్ఠంగా, అద్భుతంగా ఉంటుంది. యుగపరివర్తన చిహ్నాలు కనుపిస్తాయి. రండి ప్రకాశపుత్రులను (వెలుగును ప్రేమించేవారు –భారతీయులు) తయారుచేయండి. మేముకూడా ముందుకు వస్తాము. అందరికి ప్రకాశసత్తా యొక్క భావనాత్మక ఆహ్వానం.

★★★

## లాల్ బహదూర్ శాస్త్రి

*లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాన మంత్రి కాక మునుపు 14 వివిధ రంగాలలో ఉత్తరప్రదేశ్ మంత్రి వర్గంలోను, కేంద్ర ప్రభుత్వంలోను మంత్రి పదవులు నిర్వహించారు. భారతదేశంలో గాంధీజీ తరువాత అలాంటి నిష్కలంక దేశభక్తుడు, జాతీయ నాయకుడు లేడంటే అతిశయోక్తి కాదు. అధికారంలో ఉన్నా, లేకున్నా ఒకే తీరున నడిచిన మహనీయుడు, ఆయన రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఎక్కడో తమిళనాడులో రైలు ప్రమాదం జరిగితే ఆ పదవికి న్యాయం చేయలేకపోయా నని రాజీనామా చేశారు.*

*ఒకసారి 'కామరాజ్ పథకం' క్రింద 10 ఏండ్ల పైబడి పదవిలో ఉన్న వారందరు రాజీనామా చేశారు. కేంద్ర మంత్రులందరు రాజీనామా చేసి పార్లమెంటు భవనం నుండి బయటకు వస్తుంటే తన కారు డ్రైవరు "ఎక్కండి సార్" ఇంటికి తీసుకు వెళ్తాను అన్నాడు. కాని ఆయన ఏమన్నారు "నేను ఇప్పుడు మంత్రిని కాదు. కాబట్టి ప్రభుత్వపు కారు ఎక్కడానికి వీలులేదు" అని చెప్పి సిటీబస్‌లో ఇంటికి చేరారు. ఆయన నియమ బద్ధత అలాంటిది.*

*కేంద్ర పరిశ్రమల మంత్రిగా ఉన్నప్పుడు ఆయన భార్య లలితాశాస్త్రికి చీరలు కొనాలని ఢిల్లీలో ఒక దుకాణానికి వెళ్ళారు. షాపు యజమాని మంత్రిగారు వచ్చారని చాల ఖరీదుగల చీరలు వారి ముందుంచారు. అవి వద్దని ఖద్దరు చీరలు అడిగి వాటిలో 64 రూపాయలు వెల గల మూడు చీరలు తీసుకుని 'నా తాహతుకు ఇవి చాలు' అన్నారట. దుకాణదారు అవాక్కయి ముక్కుమీద వ్రేలు వేసుకున్నాడట. అందుకే ఆయనను గుర్తుంచుకునేది.*

**ఉచ్ఛ్వాస నిశ్వాసాలను క్రమబద్ధం చేస్తే ఆలోచనలలో అలజడి తగ్గుతుంది.**

ఉపాసన - రెండు పాదాలు : జపం-ధ్యానం

# ధ్యానం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా?

ధ్యాన ధారణలో ఒకే బిందువుపై మనస్సును ఏకాగ్రం చెయ్యడం అనేది తర్వాత వస్తుంది. మొదట సాకార ధ్యానంలో ప్రతిమలను ఉపయోగించుకోవాలి. నిరాకారవాది కూడా సూర్యుడు మొదలైన వాటిలో ఏదోఒక రూపాన్ని నిర్ణయించుకుని చేస్తారు. లేకపోతే నాదయోగంలో వేరు వేరు శబ్దాలను వింటారు. రూపమును కానీ, శబ్దాన్ని కానీ ఆధారంగా చేసుకుని ధ్యానం చేస్తే ఏకాగ్రత కుదురుతుంది. బాగా గమనించి చూచినట్లైతే ఏకాగ్రత చెదిరిపోవడం కూడా కనిపిస్తుంది. ఇష్టదైవం యొక్క అంగప్రత్యంగాలు, వేషభూషలు, ఆయుధాలు, వాహనం మొదలైన వాటి గొప్ప ఆవరణ ఉంటుంది. ఈవిస్తృత క్షేత్రంలో ఇటునుంచి అటువైపు, అటునుంచి ఇటువైపు ఎగరడానికి మనస్సుకు అవకాశం ఉంది. శివుని ఇష్టదైవంగా ధ్యానించే వ్యక్తికి ఆయన శిరస్సుపై ప్రకాశించే చంద్రుని, క్రిందికి దిగే గంగమ్మను, మెడలో పడగలెత్తి ఆడే సర్పాలను, నంది వాహనాన్ని తలచుకుంటూ మనస్సు పరుగులు తీస్తూనే ఉంటుంది. ఇక ఏకాగ్రత కుదిరేది ఎక్కడ?

నిరాకార వాది తరచుగా సూర్యకిరణాలు తన రోమ రోమంలో ప్రవేశిస్తూ ఉన్నట్లు, చిత్ర విచిత్ర ధ్వనులు వినవస్తున్నట్లు అభ్యాసం చేస్తాడు. దీనిలో కూడా ఆలోచనా పరిధి సాకారం వైపుకే మొగ్గు చూపుతూ ఉంటుంది. మనస్సు చెదిరిపోతూ స్వేచ్ఛగా పరుగులు దీస్తున్నప్పుడు ఏకాగ్రత ఎట్లా కుదురుతుంది?

నిజానికి మనం ఏకాగ్రత గురించి చెప్పాలంటే మనస్సు యొక్క విచ్చలవిడి పరుగుల్ని నిలుపుచేసి, ఒక పరిమిత క్షేత్రంలో బంధించి ఉంచడం అని అర్థం చేసుకోవాలి. మనస్సు మాటి మాటికీ పరుగులు తీస్తూనే ఉంటుంది. అయినా ఓపికతో దాన్ని బంధించి ధ్యాన పరిధిలోనికి తెచ్చుకోవాలి. దీనినే ప్రయోగం అంటారు. ఏకాగ్రత సమాధి స్థితికి చేరగానే పూర్ణత్వం సిద్ధిస్తుంది. కాబట్టి ఎవ్వరూ అధైర్యపడరాదు. నిరాశకు లోనుకారాదు.

పూర్తి ఏకాగ్రత, సాధనా కాలం యొక్క ప్రారంభ ప్రక్రియ ప్రత్యేక దృష్టితో కాదు అన్న విషయాన్ని మరచిపోరాదు. ప్రత్యేక ప్రయోజనం కోసం ఉవ్విళ్లూరకూడదు. కేవలం సాధన చేస్తూ పోవాలి. మీరాబాయి, సూరదాసు, చైతన్య ప్రభు, రామకృష్ణ పరమహంస మొదలైన భక్తుల భావస్థితిని సూక్ష్మంగా అధ్యయనం చేసినట్లైతే వారు ఏకాగ్రతలో లీనం కాలేదనీ, తన్మయత చెందారనీ అర్థం అవుతూ ఉంది. తన్మయతలోనే తమలక్ష్యాన్ని చేరుకోగలగాలి. భక్తి సంప్రదాయంలో ప్రణయం, వినియోగం, కన్నీళ్ళు, సమర్పణ, ఆలింగనం మొదలైన భావోన్మాద మేఘాలు వెల్లువెత్తుతూ ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో ఏకాగ్రత సాధ్యపడదు. భక్తులకు ఏకాగ్రతయే సర్వశ్రేష్ఠం అనుకున్నట్లైతే వారిని ఆవరించి ఉన్న భావోన్మాదాలు లక్ష్య సాధనకు పెద్ద అవరోధాలుగా నిలిచిపోయేవి. కానీ అలా జరుగలేదు.

ఇక్కడ ఏకాగ్రతయొక్క విలువను తగ్గించడంగానీ, దానిని విడచి పెట్టుమనిగానీ చెప్పడం లేదు. ఏకాగ్రత యొక్క ఉపయోగాన్ని ఎవ్వరూ కాదనలేరు. కానీ సామాన్యుల మనస్సులలో గూడుకట్టుకుని ఉన్న భ్రమలను తొలగించడం చాలా అవసరం అనిపించి చెప్పడం జరుగుతోంది. అంటే ఏకాగ్రతకు కావలసింది చిత్త నిరోధం కాదు. చిత్త వృత్తుల నిరోధం అని తెలియచెయ్యాలి. భక్తులు ఏకాగ్రతను ఏక దిశలోనికి మార్చుకోవాలి. ఆ విధంగా చేయగలిగిననాడు ధ్యానసాధనకు సరిఅయిన మార్గం లభిస్తుంది. సరిఅయిన మార్గంలో పయనిస్తే నేరుగా లక్ష్యాన్ని చేరుకుంటాం. అనుకున్న లక్ష్యం సిద్ధించిన నాడు ఇతరులకు మార్గదర్శకులుగా నిలువగలుగుతాం.

*– అనువాదం : ఊటుకూరి సత్యనారాయణ గుప్త*

**సంతోషానికి సత్సంగానికి మించిన మార్గం లేదు.**



## బాలల భవితకు బంగారు బాట-9

# అమ్మకోసం

కేరళలోని 'కాలడి' అనే గ్రామం జగద్గురువు ఆదిశంకరాచార్యులకు జన్మస్థలం. శివభక్తులైన ఆర్యాంబ – శివగురు దంపతులకు వైశాఖ శుద్ధ పంచమి నాడు జన్మించాడు. క్రీ॥శ॥788–820కి చెందినవాడు.

ఈశ్వరుని వరప్రసాదంగా ఆర్యాంబ శివగురువులకు అల్పాయువు గల బాలుడు జన్మించాడు. అతనికి శంకరుడు అని పేరు పెట్టుకున్నాడు. పాపం 5 సంవత్సరాల వయస్సుకే తండ్రి దూరమయ్యాడు. తల్లి విద్యనేర్పించడానికై గురుకులంలో చేర్పించింది. శంకరుడు మహామేధావి. అమితమైన వేగంతో వేదాలు శాస్త్రాలు అభ్యసించాడు. అతని మేధాశక్తికి గురువుగారు ముక్కుపై వ్రేలు వేసుకునేవారు.

ఒకసారి శంకరుడు భిక్షకై వెళ్ళి "భవతీ భిక్షాందేహి" అన్నాడు. ఆ ఇంటి గృహిణి దీనవదనంతో వచ్చి నిలబడింది. శంకరునికి విషయం అర్థం అయింది. "అమ్మా! నీ చేత్తో ఏది ఇచ్చినా పుచ్చుకుంటాను." అన్నాడు. ఆమె కొన్ని ఉసిరిక పండ్లు ఇచ్చింది. వెంటనే శంకరుడు లక్ష్మీదేవిని స్తోత్రం చేశాడు. ఆమె కృపవల్ల ఆ ఇంటిలో బంగారు ఉసిరిక పండ్లు వర్షించాయి. ఆమె పేదరికం దూరం అయింది.

8 సంవత్సరాల వయస్సులోనే గురుకులాన్ని వదిలేసి అమ్మకోసం ఇంటికి వచ్చాడు. అమ్మకు స్వయంగా సేవలు చేసుకుంటూ కొంతమంది విద్యార్థులకు చదువు చెప్పడం మొదలుపెట్టాడు. మండువేసవికాలం పూర్ణానది ఒడ్డునే వీరిఇల్లు. ఎండలకు నదిలో నీరు తగ్గిపోయింది. అమ్మకు రోజూ నదిలో స్నానం చేయడం అలవాటు. నీరు దూరంగా ఉంది. ఒకరోజు స్నానం చేసి తిరిగివస్తూ అమ్మ నడవలేక సొమ్మసిల్లి పడిపోయింది. శంకరుడు పరుగున బోయి అమ్మను ఇంటికి తీసుకుని వచ్చాడు. పరుండబెట్టి సేవలు చేశాడు. చేతులు జోడించి పూర్ణానదిని ప్రార్థించాడు. విచిత్రంగా ఆ రోజు రాత్రి జోరున వర్షంకురిసింది. నది నీటితో నిండిపోయింది. అమ్మకష్టం తీరిపోయింది.

ఒకసారి ఇద్దరు వృద్ధ బ్రాహ్మణులు ఆర్యాంబ ఇంటికి వచ్చారు. బాలుని తేజస్సును గమనించి జగద్గురువు అవుతాడని దీవించారు. అతని అల్పాయువుని గుర్తుచేసుకుని అమ్మ చాటుగా కళ్ళు తుడుచుకుంది. మరునాడు శంకరుడు నదిలో స్నానం చేస్తుండగా మొసలి కాలుపట్టుకుంది. బాలుడు గిలగిలలాడుతూ అమ్మను కేకలు పెట్టాడు. తనకుమారుని ఆయువు తీరిపోయిందని అమ్మ బావురుమంది. శంకరుడు శరవేగంతో ఆలోచించాడు. "అమ్మా! నేను సన్యాసం స్వీకరిస్తాను. అనుమతి ఇవ్వు అని వేడుకున్నాడు. అమ్మ అయోమయంలో బొమ్మలాగా అయిపోయింది." త్వరగా సరే అనమ్మా! సన్యాసం తీసుకుంటే రెండవ జన్మ అవుతుంది. నా గండం తీరిపోతుంది. అన్నాడు. అమ్మ వెంటనే అనుమతి ఇచ్చింది. శంకరుడు మానసికంగా సన్యాసి అయ్యాడు. మొసలి కాలును విడిచిపెట్టింది. ఇద్దరూ ఆనందంగా ఇంటికి వచ్చారు.

సన్యాసి అయిన శంకరుడు తన లక్ష్యం నెరవేర్చుకోవడానికి దేశాటనం చేస్తానన్నాడు. అమ్మ "నన్నేం చేసిపోతావు?" అంది "అమ్మా! నిన్ను నా మిత్రులు కంటికి రెప్పలా చూచుకుంటారు. దైవ ధ్యానంలో కాలం గడుపు. మరణ సమయంలో నన్ను గుర్తుచేసుకో. ఎక్కడ ఉన్నా వచ్చివాలుతాను" అన్నాడు. అమ్మకు ఒప్పుకోక తప్పలేదు. గురువును వెదుక్కొంటూ ఉత్తరం వైపుకు సాగిపోయాడు.

ప్రయాణంలో అనేకమంది సన్యాసులను కలుసుకున్నాడు. అనేకమైన శాస్త్రచర్చలు చేశాడు. నర్మదా నదీతీరాన శ్రీశ్రీ గోవింద భగవత్పాదుల వారిని గురువుగా స్వీకరించాడు. దేశం నలుమూలలా నాలుగు ధామాలు ఏర్పాటుచేశాడు. భారతీయ సంస్కృతిని ప్రచారం చేశాడు. అమ్మకు అవసాన దశ వచ్చిందని తెలుసుకున్నాడు. కాలడి చేరుకున్నాడు. శివభుజంగ స్తోత్రం విష్ణుస్తోత్రం పఠిస్తూ అమ్మకు ఆనందమయ మరణాన్ని ప్రసాదించాడు. అంత్యక్రియలు తానే జరుపుతానన్నాడు. సన్యాసులు తల్లిదండ్రులకు అంత్యక్రియలు జరుపరాదని బంధువులు ఎదురు తిరిగారు. వారి మాటను కాదని, అమ్మ శవాన్ని భుజాన మోసుకుని వెళ్లాడు. అంత్యక్రియ తానే చేశాడు. అమ్మ కోరిక తీర్చాడు. అమ్మ ఋణం తీర్చుకున్నాడు.

చూశారుగా బాలలూ! అమ్మకోసం, అమ్మ కోరిక తీర్చడంకోసం జగద్గురువు ఆదిశంకరాచార్యులే శాస్త్రానికి క్రొత్త నిర్వచనం చెప్పారు. అమ్మను మించిన దైవం అవనిలో లేదు కదూ!

**అమ్మయెయిలపై దైవము**
**అమ్మయే లోకాలలోన అద్భుత మంత్రం**
**అమ్మయే సృష్టికి మూలము**
**అమ్మయే ఆధారమంచునరయుముబాలా !**

★★★

**ఏడుస్తూ అనుభవించేవాడు నవ్వుతూ అనుభవించేవాడి దగ్గరకు సలహాకు వస్తాడు.**

## ప్రశ్నోపనిషద్ : ద్వితీయ అధ్యాయం

# ఆధ్యాత్మ దర్శన ప్రకరణం-8

**ఆత్మనస్తు వికాసం యః కర్తుంశక్తః స ఏవహి**
**సు సంస్కృతశ్చ సఫలస్తథ్యస్యాస్య మహామునే** (64)

**ప్రత్యక్షాయై క్రియన్తేను భూత్యై చ సాధనాత్మకాః**
**పరాక్రమావయం నైవమృషయో హే మనీషిణః** (65)

**ఆధ్యాత్మా మృత పానస్య సీమ్ని బద్ధా భవేమతు**
**ఉపలబ్ధి భిరేతాభిర్భోధ్యాః సర్వేజనాః సదా** (66)

**జిజ్ఞాసూనాం న చైసూ సంభవేదని వార్యతాతేషాం**
**సమర్థోన కథం దీనహీనవద్ వివధా ఇమాః** (67)

**యాతనాః పతనస్యాథ పరాభూతేశ్చ సన్తతిమ్**
**సహతే పాతగర్తాచ్చ బహిర్గంతుం నహి క్షమః** (68)

**టీకా:–** హే మహర్షి ! ఆత్మవికాసం చేసుకోగలిగిన వారు సుసంస్కృతులవుతారు. ఈ తథ్యమును అనుభూతి చెందటానికి సాధనాత్మక పరాక్రమం చేయవలసివస్తుంది. హే ఋషి మనీషులారా! మనం ఈ ఆధ్యాత్మిక అమృతమును పానం చెయ్యడమే కాకుండా మనము పొందిన దానిని జనులందరికి అవగతం చెయ్యాలి. సమర్థవంతులైన మనుష్యులు దీనులవలె, హీనులవలె రకరకాల పరాభవాలు, యాతనలు ఎందుకు సహిస్తున్నారు? పతనం అనే గొయ్యిలోనుంచి ఎందుకు బయటకు రాలేకపోతున్నారు?

సాధన పరాక్రమంలో సాధకుడు తన దుష్ప్రవృత్తులతోనే యుద్ధం చేయవలసివస్తుంది. ఈ సంగ్రామం ఎంత సఫలవంతము అవుతుందో అతడు బహిరంగంలో అంతే సుసంస్కృతుడై అంతరంగ దృష్టిలో గొప్పవాడవుతాడు.

సర్కసులో అడవి జంతువులను ఎలా ట్రైనింగ్ ఇచ్చి తీర్చిదిద్దబడతాయో అదే విధముగా సాధనాత్మక అనుశాసనంలో మామూలు మనిషి మేధావిగా సుసంస్కృతునిగా తీర్చిదిద్దబడతాడు

**యథార్థ జ్ఞాన సంయుక్తం శ్రుత్వాతు ప్రతిపాదనమ్**
**అరణ్యా కాస్థితాః సర్వే తుష్టాస్తే తు మహర్షయః** (69)

**సమాధానం చ లబ్ధుం తత్సన్దర్భోధికం తతః**
**జ్ఞాతుమన్యా చ జిజ్ఞాసా ప్రచండా వేగతోవహత్** (70)

**ఆరణ్యా కాస్థితా స్సర్వే ఋషయో యే మనీషిణః**
**సందర్భే ప్రష్టుమన్యచ్చ యద్యప్యాసన్ సముత్సుకాః** (71)

**సాయంకాలే సమాయాతే సంధ్యావందన కర్మచ**
**సమ్ముఖే ప్రస్తుతం సత్రం సమాప్తం దైనికం తతః** (72)

**మహాప్రజ్ఞాః పిప్పలాదో జాగద హే మహర్షయః**
**భవన్తోధికముత్సుకాజ్ఞాతుం ప్రత్యక్షమస్తిహి** (73)

**సత్రమద్యతనం యాతు విశ్రమం శ్వః పునశ్చరేత్**
**సమాధాస్యామ్యలం జ్ఞానత్రే జిజ్ఞాసితం భృశమ్** (74)

**ఉస్థితాస్తే ప్రసన్నాయాం ముద్రాయాం తు మహర్షయః**
**నత్వాతం తు మహాప్రాజ్ఞాం పరస్పరమథాపిచ** (75)

**ఋషయో దైనికం కర్తుంసాధనాకృత్యముస్థితాః**
**ద్వితీయేహ్నితతోప్యుగ్రాజాతోత్కణఠాతు బోధితమ్** (76)

**చలతాం హృదయే తేషాం సర్వేషామేవ యాభృశమ్**
**ఝంఝూవాత మహావేగ విజృంభణ పరాభవత్** (77)

**టీకా :–** ఈ యదార్థతతో నిండిన ప్రతిపాదన విని ఆరణ్యంలో ఉపస్థితులైన ఋషులకు సంతోషం కలిగింది, సమాధానం లభించింది. దీనితోపాటు ఇంకా ఎక్కువ తెలుసుకోవాలనే జిజ్ఞాస ప్రచండవేగంతో కలిగింది. అక్కడ ఉపస్థితులైన ఋషి మనీషులకు ఈ సందర్భంలో ఇంకా ఏదో అడగాలని ఉన్నది. కానీ సాయంకాలం అయింది. సంధ్యావందనం అనే అనివార్య నియమం నిర్వహించవలసి ఉన్నది. అందువలన ఆ రోజు సత్రం సమాప్తం అయింది. పిప్పలాద ఋషి ఇలా అన్నారు. "మీకు ఇంకా తెలుసుకోవాలని ఉన్నదని మాకు స్పష్టంగా కనిపిస్తుంది. ఈనాటి సత్సంగానికి విరామం ఇవ్వండి. రేపు తిరిగి ఈ జ్ఞాన సత్రం నడుస్తుంది. అప్పుడు మీ జిజ్ఞాసలకు వివరంగా సమాధానం ఇస్తాము. అందరూ సంతోషంగా లేచి నుంచున్నారు. పిప్పలాద మహర్షికి అభినందనతో నమస్కరించి ఋషిగణం తమ నియమిత సాధనా కృత్యానికి బయలుదేరారు. రెండోరోజు ఇంకా ఎక్కువగా తెలుసుకోవాలనే ఉత్కంఠతో వెళుతున్న వారి మనస్సులలో తుఫాన్ వంటి ఝంఝూమారుతం విజృంభించింది.

– అనువాదం : శ్రీ మారెళ్ళ కామరాజు

**అహంకారాన్ని జయించడమే ఆధ్యాత్మికత.**

తత్వ చింతన

# ప్రార్థన యొక్క స్వరూపము, స్థాయి, ప్రభావము

ప్రార్థన అన్నది పరమాత్మ పేరుతో తనను గురించి తాను చేసుకోవడమే అవుతుంది. పరమాత్మ అంతటా వ్యాపించి ఉన్నాడు. ఎంతో దయామయుడు. ఆయనతో అందరికీ అవసరముంది. అందుకే ఆయనను తెలుసుకోవాలన్న కోరిక ఉంటుంది. ఆయన పరమపిత, పరమదయాళుడు. కావున మనకోరికను తీరుస్తాడు. తీర్చడానికి ముందుకు వస్తాడు. తండ్రే ఎంతో దయతో తన పిల్లల కోరికలు తీర్చడానికి వారి అవసరాలు తీర్చడానికి ఉత్సాహపడతాడు, తాపత్రయపడతాడుగదా! పరమదయగల పరమపిత మన అవసరాలను ఎందుకు తెలుసుకోడు? ఆయన మనము చెప్పగానే మనమాటలను అర్థం చేసుకుంటాడు. ప్రార్థించగానే మన బాధలను తెలుసుకుంటాడు. ఇదే పరమాత్మ స్థాయికి చెందినవిశేషము. పరమాత్మ క్రిమికీటకాదులు, పశుపక్ష్యాదులకు అడగకుండానే అవసరాలను తీరుస్తాడు. అటువంటివాడు తనకు యువరాజు వంటివాడైన మనిషిని ఎందుకు పట్టించుకోడు? నిజానికి 'ప్రార్థన' అన్నదానికి అర్థము యాచించడమనికాదు. యాచించడమంటే అతిహేయమైనపని. దానిలో దైన్యము, చేతకానితనము, ఇతరులమీద ఆధారపడడము అన్నవి నిండి ఉంటాయి. అవి ఆత్మగౌరవాన్ని తగ్గిస్తాయి. సాటివానిముందు చేయిచాపినా దేవునియందు జోలెవిప్పినా రెండూ ఒక్కటే. ఇతరులఇంట్లో దొంగతనం చేసినా దేవాలయంలో చేసినా దొంగతనం దొంగతనమే. ఇది ఇవ్వు, ఇది ఇవ్వు అని భగవంతుని అడిగినా, మనిషిని అడిగినా యాచనయాచనే. స్వావలంబనకు, స్వాభిమానానికి దెబ్బ తగిలేపని వల్ల అది ప్రార్థన ఐనా సరే మనిషివంటి సమర్థజీవికి అందాన్నియ్యదు.

నిజానికి ప్రార్థనవల్ల కలుగవలసిన ప్రయోజనమేమిటంటే ఆత్మను పరమాత్మ ప్రతీకగా భావించి, తనను పరమాత్మలో గల దివ్యవిభూతులతో నింపుకొనుట. ఆ దివ్యశక్తులు ప్రార్థించే వాని యోగ్యతకు తగినట్లుగా లభిస్తాయి. ప్రార్థన మనస్సుకు మంచి బలాన్నిస్తుంది. మనస్సును శాంతపరచుకోవాలి. శుద్ధిచేసుకోవాలి. దీనివల్ల ఆత్మ జాగృతమౌతుంది. ప్రార్థనలో ఆత్మ "ఓశక్తిపుంజమా! నీవెందుకు మేలుకోవు? నీగుణ, కర్మ, స్వభావాలను ప్రగతి పథంలో ఎందుకు ముందుకు సాగించవు? నీవు సక్రమంగా ఉంటే ఈ జగత్తు అంతా సక్రమంగా నడుస్తుంది. నీవు నిర్మలమైతే ఈ జగమంతా నిర్మలమై నిన్ను జేరుకుంటుంది. తన సమర్థతను పెంచుకునేటందుకు తాపత్రయపడి తద్వారా లభించిన ఫలితాలను సదుపయోగపరిచే పనిలో నిమగ్నులైనవారు దీనులు, హీనులు, దరిద్రుల వరుసలో ఎందుకు కూర్చోవలసివస్తుంది? సమర్థులు, ధానధర్మాలు చేసేవారు దేవతలకన్న తక్కువ స్థాయిలో ఎందుకు ఉండవలసి వస్తుంది?

ప్రార్థన ద్వారా మనం విశ్వమంతా వ్యాపించిఉన్న గొప్ప తత్వంతో సంబంధము కలవారమౌతాం. మన ఆదర్శాలను పరమాత్మయొక్క దివ్యమైన అభివ్యక్తుల రూపంలో అనుభవిస్తాం. వాటితో కలిసిపోవడానికి నిరంతరము ప్రయత్నిస్తాం. అంధకార మనోభూమిలో అజ్ఞానం, సోమరితనం వ్రేళ్లు పాతుకుని ఉన్నాయి. వాటిని పెకిలించి పారెయ్యాలంటే, ఈ దుష్టరోగాలను పోగొట్టుకోవాలంటే భావ సంవేదనలతో ప్రార్థన చేయాలి. దానివల్ల నిద్ర, మూర్ఛలను విడనాడి మేలు కోవడం జరుగుతుంది. అప్పుడు మనిషి దేనిని గురించి ఆలోచించాలో దానిని గురించే ఆలోచిస్తాడు. ఏది చేయదగినదో దానినే చేస్తాడు. దానివల్ల తరిస్తాడు. అంతరంగంలో వెలిగే ఆత్మజ్యోతియొక్క ఒక్క కిరణం ప్రసరించినా అడుగడుగునా బాధలు కలిగించే చీకట్లు పూర్తిగా మాయమైపోతాయి. దానివలన శోకసంతాపాలు సంపూర్ణంగా అంతరించిపోతాయి.

పరమాత్మయే సాక్షి. పుట్టించేవాడు, నియమించేవాడు, నడిపించేవాడు అన్నీ ఆయనే. ఐతే ఆయనలో ఏ అంశము మనం ఉపాసిస్తామో, ప్రార్థిస్తామో దానిని సర్వాత్మగానూ, పవిత్రాత్మగాను తెలుసుకోవాలి. వ్యక్తిగత పరిధిని ఎంతో చిన్నదిగా మార్చుకుని కడుపునింపుకోవడానికి, పిల్లలను కనడానికి మాత్రమే ఆలోచించే వాసన, తృష్ణలతో కూడిన మూఢతనే 'మాయ' అని పిలుస్తారు. ఈ భవబంధాలనుంచి, మోహం, మమకారాలను నుంచి బైటపడి

**శీలనిర్మాణం చేసి, మనిషికి ఉన్నతిని కలిగించేదే నిజమైన విద్య.**

ఆత్మను విశాలం చేసుకుంటేనే తనను తాను ఉద్ధరించుకోవడం కుదురుతుంది. దీనినే ఆత్మ సాక్షాత్కారం అని పిలుస్తారు. ప్రార్థనలో తన ఉన్నత ఆత్మస్థాయి ద్వారా తనకు దివ్య ప్రకాశ కిరణాన్ని అనుగ్రహించమని పరమాత్మను కోరుకోవడము జరుగుతుంది. దానిద్వారా మనస్సులో అలుముకున్న చీకటి దివ్యప్రకాశంగా మారిపోతుంది.

తక్కువను ఎక్కువగాను, నీచమైనదానిని గొప్పదానిగాను మార్చవలెనన్న ఉత్కంఠకే ప్రార్థన అని పేరు. నరుని నారాయణుడుగాను, పురుషుని పురుషోత్తముడుగాను మార్చవలెనన్న సంకల్పానికే ప్రార్థన అని పేరు. ఆత్మను విషయవాంఛలలో కట్టిపడవేసే నీచభావం ఉన్నతం, విశాలం అయిన స్వరూపాన్ని పొంది పరమాత్మ రూపంలో దర్శనం ఇచ్చినప్పుడు ప్రార్థనయొక్క ప్రభావం కనబడిందని తలంచాలి. మనిషి పశుస్థాయి నుండి మానవత్వం వైపుకు, మానవత్వం నుండి దేవత్వం వైపుకు నడవడం జరిగితే అది ప్రార్థన యొక్క లోతైన స్వరూపానికి చిహ్నంగాను, అలౌకిక చమత్కార స్థితిగాను భావించాలి. ఆత్మ సమర్పణ ప్రార్థనలోని ప్రధానమైన అంగంగా తలుపబడింది. మనం ఎవరికైనా దగ్గరవారమైతేనే వారినుంచి ఏదైనా పొందగలుగుతాం. ఆత్మ సమర్పణ ఒక్కటే పరమాత్మ యొక్క అనుగ్రహాన్ని పొందడానికి సాధనం. 'శరణాగతి' భక్తి యొక్క ప్రధాన లక్షణంగా భావింపబడింది. భగవద్గీతలో కృష్ణపరమాత్మ ఎవరైతే మనస్ఫూర్తిగా తనకు శరణాగతి చేస్తారో వారికి సంబంధించిన యోగక్షేమాలు సుఖశాంతులకు, అభివృద్ధులకు సంబంధించిన బాధ్యత తాను స్వయంగా స్వీకరిస్తానని వాగ్దానము చేశాడు. నిష్కల్మషమైన మనస్సుతో చేసిన శరణాగతికి, కల్మషంతో కూడిన మనస్సుతో చేసిన శరణాగతికి గల తేడా స్పష్టముగా కనబడుతూనే ఉంటుంది. ప్రార్థన చేసే సమయంలో తనువును, మనస్సును, ధనాలనన్నింటినీ పరమాత్మకు సమర్పిస్తున్నట్లు ఖచ్చితమైన మాటలలో తెలుపుతూ తీరావాటిని సమర్పించే సమయం రాగానే వెనకాడే పద్ధతి కల్మష మనస్సుల లక్షణం. అది నిజమైన ప్రార్థన కాదు. ఈనాడు ఇదే ఫ్యాషనయింది. కల్మష మనస్సులతో చేసే ప్రార్థన దైవాన్ని మోసగించడానికి చేసే ప్రార్థన అవుతుంది. 'సమర్పణ' 'శరణాగతి' వంటి దివ్యమైన పదాలకు అర్థమేమిటో తెలుసుకున్న వ్యక్తి కోరికలను, పనిపాటలను పరమాత్మ యొక్క ఇచ్ఛానుసారముగా నిర్వహిస్తూ ఆదర్శ వ్యక్తిగా రూపొందుతాడు. ఆ విధంగా తయారయి సమర్పణను, శరణాగతిని చేసిన వ్యక్తి చేసే ప్రార్థన నిర్మలమైన మనస్సుతో చేసిన ప్రార్థన అనబడుతుంది.

మన ప్రార్థనలో పరమాత్మ మనను అందుకు తగిన యోగ్యత కలవారుగాను, నిజమైన భక్తులుగాను, దైవాన్ని అనుసరించేవారు గానూ తయారుచేయాలన్న కోరిక ఉండాలి.

ప్రార్థన వలన పరమాత్మ మనకు భయ ప్రలోభాలనుంచి విముక్తిని కలిగించి కర్తవ్య నిర్వహణలో వివేకము, సాహసములతో ముందుకు సాగునట్లుగా చేయాలి. అందులో ఎన్ని అడ్డంకులు ఏర్పడినా వాటిని పట్టించుకోని లక్షణాన్ని కలిగించాలి. చేసిన కర్మకు తగిన ఫలం రాక తప్పదు. ప్రారబ్ధ కర్మయొక్క ఫలితము ఎదురైనప్పుడు దానిని ధైర్యంతో ఎదుర్కొని పరమపురుషార్థాన్ని నిర్వహించాలి. దానిలో ప్రగతిని సాధించాలి. ఎప్పుడూ నిరాశ పడకూడదు అటువంటి మనో ధైర్యాన్ని కలిగియుండాలి. పరమాత్మ మన మనస్సును చెడు కర్మలవైపు మళ్లించడు. ఉన్నత భావాలు కలుగునట్లు చేస్తాడు. అందువలన మన వర్తమాన స్థితి పూర్తిగా మారిపోతుంది. ఎవరైతే అందుకు సిద్ధమై సమర్పణతో కూడిన శరణాగతి చేస్తారో అట్టివారు నిజమైన మనస్సుతో ప్రార్థన చేసేవారని పిలువబడతారు.

దైవ ప్రార్థనలో పరమాత్మ మనలను తనయొక్క నిజమైన భక్తులుగాను, తనను అనుసరించే వాళ్లనుగాను, తన పుత్రులుగా పిలవబడే గౌరవాన్ని పొందేవారుగాను తయారు చేయాలన్న కోరిక ఉండాలి. మనం భయ, ప్రలోభాలనుంచి విముక్తులం కావడానికి, వివేకంతో కూడిన కర్తవ్య మార్గంలో సాహసంతో ముందుకు సాగడానికి కావలసిన శక్తిని ప్రసాదించమని, ఆ మార్గంలో ఎదురయే అడ్డంకులను పట్టించుకోకుండా ముందుకు నడిచే శక్తినివ్వమని ప్రార్థించాలి. చేసిన కర్మకు తగిన ఫలితము రావడం తప్పదు. మన ప్రారబ్ధకర్మ యొక్క ఫలితాన్ని ధైర్యంతో అనుభవించగలగాలి. ప్రగతిని సాధించడానికి పురుషార్థాన్ని నిర్వహించడంలో నిరాశకు తావీయరాదు. అటువంటి ధైర్యముతో కూడిన మనస్థితి కలిగియుండాలి. పరమాత్మ మన మనస్సు చెడ్డ పనుల వెంట పడకుండా వుండేటట్లు లేక అటువంటి పనులు

**మనస్సును జయించిన వాడే ప్రపంచాన్ని జయించగలుగుతాడు.**

ఫలించని స్థితి కలుగునట్లు చేయాలి. మానవజన్మ సఫలత చెందడానికి కావలసిన మార్గంలో ముందుకు సాగడానికి కావలసిన శక్తి కావాలి అని చేసే ప్రార్థనయే ఉత్తమమైన ప్రార్థన. దానిలో ఆ విధంగా కాకుండా ధనం కోసం, సంతానం, ఆరోగ్యం, సాఫల్యత మొదలైన వాటిని యాచించినట్లైతే అది బిచ్చమెత్తడమే అవుతుంది. ఆ విధంగా బిచ్చమెత్తడాలు ఫలిస్తాయన్నది సందేహమే.

పరామనో విజ్ఞానవేత్త డా॥ ఎమేలీ కేడీ గారు ప్రార్థన అంటే దైవానికి ధన్యవాదం చెప్పడమో లేక ఏదైనా ఇమ్మని యాచించడమో కాదు అన్నారు. సందేహాలనుంచి విముక్తి పొందిన భూమికలోనికి ప్రవేశించిన మనస్థితి అని పేర్కొన్నారు. అహంకారాన్ని వదిలి నమ్రతా భావాన్ని పొందడం, మనసులో రేగిన వికారభావాలను అణిచివేసి, పరమేశ్వరుని నేతృత్వాన్ని స్వీకరించడానికే ప్రార్థన అని పేరని, ఆ ప్రార్థనలో తన భావి జీవనాన్ని పరమేశ్వరుడు చూపించిన మార్గంలో పవిత్రతను, పరమార్థాన్ని జోడించి నడపాలని కోరుకోవాలని వ్రాశారు. ఈ విధంగా అంతరాత్మయొక్క లోతులలో నుంచి వెలువడే ప్రార్థనలో ఆత్మ పరివర్తనకు చెందిన శ్రద్ధ జోడింపబడితే అది భగవంతుని యొక్క సింహాసనాన్ని కదిలించగలుగుతుంది. అటువంటి ప్రార్థన యొక్క ఫలితాన్ని చమత్కారమన్నా తప్పులేదు అని కూడా వ్రాశారు.

చికిత్సా శాస్త్రములో నోబెల్ బహుమానమును పొందినట్టి వారు ఫ్రాన్స్ విశ్వవిద్యాలయ సంస్థాపకుడు ఐన డా. కైరల్ తాను సాధించిన ప్రతిసాఫల్యతకు వెనుక పరమాత్మ యొక్క దివ్యానుగ్రహం దాగియుండడాన్ని గుర్తించారు. తుచ్ఛ మానవులు ఉన్నత స్థితిని పొందలేరని, దైవానుగ్రహం లేకుంటే అది అసంభవమని పేర్కొన్నారు. తన చికిత్సా పద్ధతిలో వాడే మందులకు ప్రార్థన తోడయితేనే ఫలితం ఉంటుందని తెలియచేశారు. తనువాడే మందులకన్న దైవప్రార్థనకే ఆయన ప్రాధాన్యత నిచ్చారు. ఆయన ప్రతిరోగితోను నిర్మలమైన మనస్సుతో దైవాన్ని ప్రార్థించమని చెప్పేవారు. తాను చేసిన తప్పులకు పశ్చాత్తాపపడి, భవిష్యత్తులో నిర్మలమైన జీవితాన్ని కొనసాగిస్తానని ప్రతిజ్ఞ చేసి పరమాత్మను ప్రార్థిస్తే అతని ప్రార్థనను దైవం తప్పకుండా వింటాడని పేర్కొన్నారు. పశ్చాత్తాపమే నిజమైన చికిత్స అని, పరమాత్మ పాదాలకు తనను సమర్పించుకున్న వ్యక్తి శారీరక రుగ్మతలనుంచే గాక ఆంతరిక రోగాలనుంచి కూడా విముక్తిని పొందుతాడని తెలిపారు.

గాంధీ మహాత్ముడు తన స్నేహితుని కొకరికి "రామనామం నా జీవితానికి ఆధారం, అదే నన్ను అన్ని విధాలైన ఆపదలనుంచి కాపాడుతున్నది. నువ్వు దుర్వ్యసనాలతో నిండి ఉంటే వినయపూర్వకంగా దైవసహాయానికై ప్రార్థించు. నీకు పరమాత్మ సహాయమందిస్తాడు." అని లేఖవ్రాశారు.

మనస్సు బలహీనమై మనోవికారాలు పెరుగుతుంటే, కాలు ముందుకు సాగని స్థితి ఏర్పడితే నిర్మలమైన మనస్సుతో ప్రభువును ప్రార్థించాలి. గజేంద్రుని మొసలి నోటి నుండి విడిపించిన పరమాత్మ, పతన స్థితినుండి కాపాడమని ఆర్తితో అర్థించే భక్తుని వినకుండా ఉండడు. ఆ భక్తునికి మనోబలం రూపంలో అతని అంతఃకరణలోనికి దిగివస్తాడు.

పరమాత్మకు ఆత్మ సమర్పణ చేసే సమయంలో జీవుడు "తస్యైవాహమ్ (నేను దానికి చెందినవాడిని), తవైవాహమ్ (నేను నీకు చెందిన వాడినే)" అని విన్న విస్తూ తనను తాను మరచి పరమాత్మలో లీనమైపోతాడు. తనను పరమాత్మ స్వరూపుడనని భావిస్తాడు. ఆ స్థితిలో అతను "త్వమేవాహమ్" (నీవు నేను)" శివోహమ్ "(నేను శివుడను)" బ్రహ్మాస్మి "(నేనే బ్రహ్మను)" అని పేర్కొంటాడు.

ఈ విధంగా తనను పరమాత్మలోను పరమాత్మను తనలోను లీనము చేసుకున్న అనుభూతి గట్టిగా కలిగినప్పుడు దానిని కార్యరూపంలోనికి మార్చుకుంటాడు. అది కార్యరూపం ధరిస్తేనే ఆ అనుభూతి నిజంగా కలిగినదని భావించాలి. ఈ విధమైన శరణాగతి వ్యక్తిని వేగంగా దేవత్వం వైపుకు నడుపుతుంది. అప్పుడు తన అన్ని విధములైన దివ్య శక్తులతో దైవాన్ని శరణు కోరడం జరుగుతుంది. నిజానికి భగవంతుడే గొప్ప కానీ ప్రార్థన, సమర్పణ శరణాగతి మొదలైన ప్రక్రియలతో కూడిన సాధనా క్షేత్రములో భగవంతుని కన్న భక్తుడినే గొప్ప వాడుగా భావించడం జరుగుతుంది. ఎందుకో తెలుసా? భక్తుని సూచనలను అనుసరించి భగవంతుడు వ్యవహరించడం జరుగుతుంది కాబట్టి.

*– అనువాదం : శ్రీ కె.బి. సోమయాజులు*

*అఖండజ్యోతి జనవరి 1999*

**అన్నం తినడానికి 15 నిమిషాలు చాలు - కానీ జీర్ణించుకోవడానికి 24 గంటల సమయం కావాలి.**

## ధారావాహిక: పరమేశ్వరుని చిరునామా-14

# ప్రకృతి నుండి పాఠాలు

భూమి మీద ఇతర జీవ-జంతువులతో మనుషులను పోల్చి చూస్తే, జ్ఞాన విజ్ఞానాల అహంకారంతో మిడిసిపడే మనిషి తన సామాజిక వ్యవస్థ మరియు వ్యవహారంలో ఎన్నో చిన్న చిన్న జంతువులు, క్రిమికీటకాలు లక్షలాది సంవత్సరాల క్రితమే చేరిన స్థాయిని ఇప్పటికీ అందుకోలేదు. చీమలు, తేనెటీగలు, చెదపురుగులు, కందిరీగల ఆంతరిక వ్యవస్థ, క్రమశిక్షణ మరియు నాగరికత భావనలు మనుషుల కంటే ఉన్నత స్థాయికి చెందినవి. ఈ ఆధారంగానే ఇవి ఇంత దీర్ఘకాలం తమని తాము రక్షించుకున్నాయి.

ఇప్పటివరకు జంతుశాస్త్రం అన్వేషణల ద్వారా తెలుసుకున్న దానిని బట్టి మానవుని ఉత్పత్తి జరిగి పది లక్షల సంవత్సరాల కంటే ఎక్కువ సమయం కాలేదు. ఈనాటి అడవి మనుషులను పట్టుకుని, వారి పరిస్థితిని గమనించినట్లయితే లక్ష, రెండు లక్షల సంవత్సరాల సమయమే జరిగి ఉండవచ్చునని అనిపిస్తుంది.

దీనికి విరుద్ధంగా చీమలు, తేనెటీగలు మొదలైనవాటి విషయంలో బాగా విచారణ జరిపిన జగత్ప్రసిద్ధి వైజ్ఞానికులు జూలియస్ హక్సలే మరియు వీలర్ మొదలైన వారు వాటి వికాసం 25 లక్షల సంవత్సరాల క్రితం జరిగిందనే నిర్ణయానికి వచ్చారు. అప్పటినుండి వాటిలో చెప్పుకోదగ్గ పరివర్తన జరుగలేదు. వాటి వ్యవస్థను వర్ణిస్తూ ఒక పండితుడు డా॥ స్టాకర్డ్ హేథమ్ ఇలా వ్రాశాడు.

సామాజిక కీటకాలలో చీమలు అన్నింటికంటే ఎక్కువ విజయవంతం అయినవి మరియు విచిత్రమైనవి. వాటి జాతులన్నింటి సంఖ్య దాదాపు మూడువేలు. కొన్ని జాతుల పుట్టలలో అయిదులక్షల వరకు ప్రాణులుంటాయి. గుడ్లు పెట్టే కొద్దిపాటి రాణులను వదలిపెడితే మిగతా అన్ని చీమలు అంత పెద్దవిగా ఉండవు. అన్నింటికంటే పెద్దదైన 'నపుంసక' చీమ బరువు కూడా ఎప్పుడూ ఒక గ్రాముకు మించి ఉండదు. ఇంకొక రకంగా చెప్పాలంటే ఒక మామూలు మనిషి బరువుతో సమానం కావాలంటే ఒక లక్షకంటే ఎక్కువ చీమలని త్రాసు సిబ్బిలో ఉంచవలసి ఉంటుంది. ఇది ఆహారాన్ని మోయడం, శత్రువులతో పోరాడడం కోసం ప్రత్యేకంగా పెద్దవిగా, బలంగా తయారుచేయబడిన చీమల విషయం. చిన్న చీమలు ఇంకా తేలికగా ఉంటాయి.

ఈ చీమలలో కనిపించే అనేక రహస్యమయ ప్రవృత్తులలో ఎక్కువ మహిమగలది వాటి ఆహారవ్యవస్థ. ఆహారాన్ని సేకరించే పని దాదాపు శ్రామిక చీమలే చేస్తాయి. అయితే ప్రతి సముదాయంలో లేదా ఒక బస్తీలో నివసించే చీమలన్నింటి పొట్ట ఒక్కటే అని నమ్ముతాయి. శ్రామిక చీమలు కూడబెట్టిన ఆహారాన్ని దానిని మెడ క్రింది సంచులలో నింపుకుంటాయి. దానిలో తన వంతులోని కొంత ఆహారాన్ని తన పొట్టలోకి పంపిస్తుంది. మిగిలిన దానిలో ఒక్కొక్క బొట్టు మిగతా చీమలన్నింటికీ పంచుతాయి. దీనిని పరీక్షించడానికి శాస్త్రవేత్తలు ఆహారాన్ని వెదికే చీమల మార్గంలో పంచదార ద్రవాన్ని పోశారు. దానిలో ఏదో నీలిరంగు రసాయనిక పదార్థాన్ని కలిపారు. శ్రామిక చీమలు ఆ ద్రవాన్ని పంచిపెట్టాయి. ఫలితంగా బస్తీలో నివసించే ప్రాణులన్నింటి పొట్టలో కొద్దిపాటి నీలి కాంతి మెరిసింది. ఈ విధంగా ప్రాణులన్నింటి పోషణ జరుగుతుంది. మానవజాతి గనుక ఈ సిద్ధాంతాన్ని అర్థం చేసుకుని వ్యావహారికంగా ఆచరించడం ప్రారంభిస్తే ఈనాడు ఎక్కడా దొంగతనాలు, దోపిడీలు, మోసాలు మొదలయినవి ఉండవు.

వ్యక్తి జీవించినంతకాలం తన ఆకలిదప్పుల సమస్య తానే తీర్చుకోవాలనేది సుస్పష్టం. అతని పొట్ట సక్రమమైన రీతిలో నిండకపోతే అక్రమ మార్గాన్ని ఆశ్రయిస్తాడు. సమాజంలో మంచి చెడుల విషయాన్ని పక్కన పెట్టి ఎలా పడితే అలా అవసరాలను తీర్చుకునే ప్రయత్నం చేస్తాడు. దీని ద్వారా సమాజానికి కీడే జరుగుతుంది. సమాజంలోని మంచివారు, శ్రామికులు, సాధన సంపన్నులు భయంతో గడపవలసి వస్తుంది. ఆ దుర్మార్గుల వలన శారీరక, మానసిక కష్టాలను భరించవలసి వస్తుంది. అందువలననే మానవులు చీమలు మరియు తేనెటీగలతో సమానంగా తెలివిగా పనిచేస్తే వారి స్థితి ఎంతో సురక్షితంగా ఉండేది.

చీమలకు ఇంద్రియాలతోపాటు సంక్రమించిన కొన్ని శక్తులు కూడా మనిషి కంటే ఉన్నతస్థాయికి చెందినవి. అవి తమ ముక్కు

**ఇతరుల కష్టాలకు కరిగిపోయేవారే సాధుపురుషులు.**

ముందు ఉండే వెం(టుకలతో స్పర్శ మరియు వాసనను పసిగడతాయి. మనకు వచ్చే వాసన బట్టి ఆ వస్తువు రూపాన్ని తెలుసుకోలేము. కాని చీమలు వాసనలతోనే పదార్థ రూపాన్ని కూడా తెలుసుకుంటాయి. చీమల బస్తీల మధ్య యుద్ధం జరిగేటపుడు కూడా వాసనతోనే మిత్రులెవరో, శత్రువులెవరో పసిగడతాయి. ఇతరత్రా వాటికి వేరే వేషధారణ లేదా ప్రత్యేకమైన రణనాదం ఏదీ ఉండదు. అందువలననే ఈ సమస్యను అవి నోటి వెం(టుకల ద్వారానే పరిష్కరించుకుంటాయని తెలుస్తుంది. అవి ఏ మార్గంలో ఒకసారి వెళ్తాయో ఆ మార్గాన్ని వాసన ద్వారానే గుర్తిస్తాయి. ఈ ఉపాయంతోనే చాలా దూరం వరకు ఇటు అటు తిరిగి మరల తమ ఇంటికి చేరగలుగుతాయి.

కొన్నిరకాల చీమలలో 'తెలివి'కి సంబంధించి కొన్ని ప్రత్యేకతలు కూడా ఉంటాయి. 'డ్రైవర్' శ్రేణికి చెందిన చీమలు దారిలో ఏదైనా కాలువ లాంటిది వస్తే దానిమీద వంతెన నిర్మించి మిగిలిన దళాన్ని చేరవేస్తాయి. ఈ రకమైన ప్రతి శ్రామిక చీమ ఒక చిన్న గడ్డిపోచను నోటితో పట్టుకుంటుంది. అపుడు ఇతర చీమలు ఒకదాని గడ్డిపోచను మరొకటి పట్టుకొని కాలువ మీద వంతెన తయారుచేస్తాయి. బేట్ అనే పేరుగల శాస్త్రవేత్త తన పరీక్షల ఆధారంగా ఇలా వ్రాశాడు. 'దక్షిణ ఆమెరికాలోని ఒక నగరంలోని పట్టాలను దాటడానికి చీమలు ఇలాంటి వంతెననే తయారు చేశాయి. వాటిలో చాలా చీమలు వంతెనకు బదులుగా పట్టాలక్రింద తవ్వి సొరంగాన్ని తయారుచేశాయి. బేట్ ఈ సొరంగాన్ని మూసివేసినపుడు అవి పట్టాలను దాటడం ఆపివేశాయి. కొత్త సొరంగాన్ని త్రవ్వి పట్టాలను దాటాయి. ఇదే విధంగా ఒక చెట్టు మీద చీమలు ఎక్కడాన్ని నిరోధించడానికి దాని మాను నలువైపులా రెండునుండి నాలుగు అంగుళాలు వెడల్పున అతుక్కునే బంకను పూయడం జరిగింది. చీమలు చుట్టు ప్రక్కల నుండి మట్టి మరియు రాతి కణాలను తీసుకొచ్చి దానిమీద వేసి అటువైపు చేరాయి.

చీమల శుభ్రత భావన కూడా ఉన్నత స్థాయికి చెందినదై ఉంటుంది. అవి తమ శరీరాన్ని చాలా ఎక్కువగా శుభ్రం చేసుకుంటాయి. శ్రీ మేక్‌కుక్ ఒక చీమ జంటను పరీక్షించారు. వాటిలో ఒకటి భూమి మీద పడుకుంది. రెండవది దానిని నాకి శుభ్రం చేయడం ప్రారంభించింది. ముందు ముఖాన్ని, తరువాత ఛాతిని నాలుకతో శుభ్రం చేసింది. ఇదే విధంగా ప్రక్కటెముకలు ఉదరం మరియు కాళ్ళను పూర్తిగా నాకి శుభ్రం చేసింది. ఈ సమయంలో ఈ సమయంలో శుభ్రం చేసుకుంటున్న చీమ ఎంతో శాంతిగా, సంతోషంగా పడి ఉంది. దీనిద్వారా అది తన సహచరి పనితో బాగా సంతుష్టంగా, ప్రసన్నంగా ఉంటుందని విదితమవుతుంది.

చీమలు తమ పోషణకు అనేక రకాల విధులను నిర్వర్తిస్తాయి. దక్షిణ అమెరికాకు చెందిన 'అటూటా' జాతి చీమలు చెట్ల ఆకులు తుంచి వాటిని చిన్న చిన్న ముక్కలుగా చేస్తాయి. వాటిని తమ బిలంలోనికి నెట్టివేస్తాయి. కొద్ది సమయంలోనే వాటి నుండి పుట్ట గొడుగులవంటివి ఉత్పన్నమవుతాయి. బిలం లోపల ఉండే చీమలు ముఖ్యంగా వీటినే తింటూ జీవిస్తాయి. వీటిని 'తోటమాలి చీమలు' అంటారు.

రెండవ రకం 'పంటను సేకరించే చీమలు' ఇవి పొలాలనుండి ధ్యాన్యాన్ని సేకరించి తమ బిలాలలో జమ చేస్తాయి. ఇవి దాదాపు సారహీనమైన మరుభూమిలో నివసిస్తూ ఉంటాయి. ఈ ప్రాంతాలలో కరువు ఎక్కువగా ఉంటుంది. తినుబండారాల కొరత ఉంటుంది. ఇందువలననే ఈ చీమలు బిలాలలో రకరకాల విత్తనాలను అధిక మొత్తంలో జమ చేస్తాయి కరువు ఏర్పడినపుడు చీమల పుట్టలను త్రవ్వి అనేకసార్లు ఒకటి రెండు మణుగుల ధాన్యాన్ని బయటకు తీసేవారు.

'లేసియస్' పేరుగల అమెరికా చీమలు ఒక ఇతర కీటకాన్ని పోషిస్తాయి. దానిని ధాన్యాలు మరియు మొక్కల వేళ్ళ వద్దకు తీసుకెళ్ళి వదులుతాయి. అది అక్కడ రసాన్ని పీల్చుకుంటుంది. కొంత సమయం తరువాత చీమలు ఆ కీటకాన్ని తమ వెం(టుకలతో బాదుతాయి. అపుడు ఆ రసం బయటకు వస్తుంది. ఆ రసాన్ని అవి నాకుతాయి. మనుషులు ఆవులు, గేదెలను పెంచి పాలు పిండుకున్న విధంగా ఈ రసాన్ని స్వీకరిస్తాయి.

ఈ విధంగా చీమలు, తేనెటీగలు, చెదపురుగులు మొదలైన జీవులు చాలా చిన్నవి లెక్కలోనివి కానప్పటికీ సామూహిక శక్తిని ఎంతగా వికసింపజేసుకున్నాయంటే పెద్ద పెద్ద జీవులు కూడా వాటి మీద విజయాన్ని సాధించలేవు. అంతేకాక బాగా ప్రసిద్ధి గాంచిన పాము లాంటి విషజీవిని, ఏనుగు లాంటి బలీయమైన జంతువులను కూడా తమ సామూహిక శక్తితో తరిమికొడతాయి లేదా చంపివేస్తాయి. అవి ఎల్లప్పుడూ తమ సామూహిక క్రమశిక్షణను పూర్తిగా పాటిస్తాయి. తత్ఫలితంగా ఏదీ ఆకలితో పడి ఉండదు. మనుష్యులు ఆ జీవాలనుండి ఈ విషయంలో ప్రేరణ పొందగలిగితే ఈనాటి మానవ సమస్యలు చాలా వరకు పరిష్కారమయ్యేవి.

★★★

**పరస్పర సహకారం వల్లే లోకం ఇంకా సజీవంగా ఉంది.**

మనం - మన ఆరోగ్యం

# సృష్టికర్త అమూల్యవరం - వనౌషధీ విజ్ఞానం

సృష్టికర్త మనిషికిచ్చిన బహుమతులలో వనౌషధాలు సర్వశ్రేష్ఠమైనవి. వీటివలన మనుషులు తమ శారీరక, మానసిక వ్యథలను నివారించుకొనుటకు దేవతల అనుగ్రహాన్ని పొందుతున్నారు. బహుశ ఈ మాన్యత కారణంగానే ధర్మశాస్త్రాలు వనస్పతులను దేవ సమానులుగా భావించి, పూజించుటకు, ప్రార్థించడానికి విధానాలను ఏర్పరచినారు. ఉపనిషత్తులలో వృక్ష వనస్పతులను దేవతల రూపంలో స్వీకరించడం జరిగింది. ఉపనిషత్తు ప్రవచించిన ఋషివర్యుని కథనం ప్రకారం "ఏ పరమాత్మ అగ్నిలోను, జలంలోను, సమస్త లోకాలలోను నిలిచి ఉన్నాడో, ఔషధాలలోను, అన్ని వనస్పతులలోను ఉన్నాడో ఆ పరమాత్మకు నమస్కరిస్తాను" అని చెప్పబడింది.

వనస్పతుల సంఖ్య అసంఖ్యాకం. ఆహారం ఔషధ ప్రయోజనాల కోసం ఉపయోగించే అన్ని వనస్పతులు, తమంత తాము పరిపూర్ణమైనవే. వీటిలో ప్రతిదాని నిర్మాణం అనేక మిశ్రమాలు, క్షారాలు, రసాయనాలు, ఖనిజాలతో కలిసి ఏర్పడింది. మనిషి ఏవిధంగా పరిపూర్ణుడో అట్లే ప్రతీ వనస్పతీ పరిపూర్ణమైనదే. విధాత రక్తమాంసాలు, ఎముకలు, చర్మం, జీర్ణరసాలు మొదలైన అన్ని ఆవశ్యక తత్వాలను మనిషి శరీరంలో సులభంగా తన కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి సమకూర్చాడు. ఇదే విషయం వనస్పతుల విషయంలోను జరిగింది. ఆకులు, పళ్ళు, కందమూలాల రూపంలో వాటి ఉపయోగం జరుగుతూ ఉంది. వాటి విశ్లేషణల వల్ల వీటిలో ప్రతిదానిలోను అనేక రసాయనిక మాధ్యమాల కలయిక ఉంటుందనీ స్పష్టం అవుతుంది. అవి మానవ శరీరంలో ప్రవేశించి అవసరాలను చక్కగా నెరవేరుస్తాయి.

ఈ వనస్పతుల ఔషధగుణాల విజ్ఞానాన్నే ఆయుర్వేదం అంటారు. ఈ ఆయుర్వేద చరిత్రను వెతికితే దీని జననం క్రీస్తుపూర్వం అనేక వందల సంవత్సరాల ముందే జరిగిందని తెలుస్తోంది. ఈ విజ్ఞానం భారతదేశం నుండి టిబెట్టు ద్వారా చైనా చేరుకుంది. లాసా పుస్తకాలయం నుండి పొందిన టిబెట్టుకు చెందిన పాండు లిపినుండి ఈ యదార్థం లభించింది. దీనిలో లభించిన పదివేల కంటే అధిక ఔషధాలలో చరకుడు, సుశ్రుతులను తెలియచేసిన సందర్భాలున్నాయి. ఈ గ్రంథం పేరు రిగ్యుద బీర్ఖీ. ఈ శబ్దంలో బుక్, ఉద్బిజ్ అనే రెండు శబ్దాల సమ్మిళిత రూపం ధ్వనిస్తుంది. ఈ గ్రంథం క్రీ॥శ॥ 820 సంవత్సరాల నాటిదని భావించబడుతూ ఉంది.

అతి ప్రాచీనమైన ఈ ఆయుర్వేద విజ్ఞానం చైనాలో ఇప్పటికీ జీవించి ఉంది. దీనిని అన్వయించుకొనిన పరిణామం అక్కడ జన జీవనంలో స్పష్టంగా కనబడుతోంది. అక్కడ ఎక్కువ రోగాలకు శస్త్రచికిత్స చేయాల్సిన ఆవశ్యకత లేదని భావింపబడుతోంది. పేగులలోని అవరోధాలవంటి ప్రమాదకరమైన రోగాలను నయం చేయడంలో కేవలం వనమూలికలను చైనా చికిత్సకులు ఉపయోగిస్తున్నారు. విజ్ఞాన ప్రపంచ సమక్షంలో వనమూలికల సత్పరిణమాలు ప్రత్యక్షంగా కన్పిస్తున్నాయి. నేడు గొప్పవైద్య విజ్ఞానులు కూడా వివిధ చికిత్సా పద్ధతులను అధ్యయనం ద్వారా బేరీజు వేసి ఒక నిశ్చయానికి వచ్చారు. మానవ జీవనశక్తిని పెంచేందుకు సహాయపడే వాటిని, చికిత్సకు ఆధారమైన వాటిని జీవించేలా చేసి, వాటిని నిలబెట్టాలంటే, చేయాలంటే మానవుడు ప్రకృతిని శరణువేడాలని వైజ్ఞానికులు అభిప్రాయ పడ్డారు.

ప్రకృతి స్వరూపమే వనౌషధులు. వీటిలో రోగ నివారణ సామర్థ్యంతో పాటు శరీరంలోని లోటుపాట్లను దూరం చేసే పౌష్టిక తత్వాలు కూడా ఉన్నాయి. ప్రకృతి అంతటిలోను సుమారు 4 లక్షల కంటే ఎక్కువ మొక్కలు ఉన్నాయి. ఇందులో చికిత్స దృష్టిలో ఏదో విధమైన ఉపయోగంలేని మొక్కంటూ ఏదీ లేదు. ఈ విషయంలో ప్రాచీన కథ ఒకటి బహుళ ప్రచారంలో ఉంది.

భూమిపైన ఏదైనా వృక్షంగాని, వనస్పతిగాని మొక్కగాని, ఆకుగాని వృధాగా కనబడితే దానిని తీసుకురమ్మని బ్రహ్మదేవుడు జీవక మహర్షిని ఒకసారి ఆదేశించాడు. 12 సంవత్సరాలు నిరాటంకంగా భూమిపై తిరిగి మహర్షి మరలి వచ్చి బ్రహ్మగారి ముందు తలవంచి ఇలా చెప్పాడు. ప్రభూ నేను ఈ పన్నెండు సంవత్సరాలుగా భూలోకం అంతటా తిరిగాను. ప్రతీమొక్క గుణదోషాలను గమనించాను. కాని ఏదైనా వ్యాధి నిర్మూలనలో సహాయకారి కాని మొక్కంటూ భూమి మీద లభ్యం కాలేదు.

**స్నేహం దుఃఖాన్ని భాగిస్తుంది. ఆనందాన్ని హెచ్చిస్తుంది.**

ఈ ఔషధ గుణాలుండే వనస్పతులు మన పరిసరాలను, మన జీవనాలను పెనవేసుకొని ఉన్నాయి. వీటిలో ఒకటి తులసి. వృక్ష శాస్త్రంలో దీనిని ఆసిమమ్ శాంక్టమ్ అని పిలుస్తారు. వాడుక బాషలో దీనిని రామతులసి, కృష్ణ తులసి, తులసి బృందా, తులసి మహారిణి, కృష్ణ, సుఖరల్లీ అనే వేర్వేరు పేర్లతో పిలుస్తారు. రూపగుణాలననుసరించి తులసిలో కొన్ని రకాలున్నాయి. పూజకు ఎక్కువగా రామతులసి ఉపయోగిస్తారు. సామాన్యంగా తులసిమొక్క చిన్నదిగా ఉంటుంది. కాని అప్పుడప్పుడు నాలుగడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. పర్వత ప్రాంతాలలో దీని ఆయఃప్రమాణం సంవత్సరంకాగా మైదాన భూములలో నాలుగైదు సంవత్సరాల వరకు ఉంటుంది.

వనౌషధ వైజ్ఞానికుల ప్రకారం తీవ్ర జ్వరం, ప్రేలాపన స్థితిలో దీని కషాయాన్ని తాగిస్తే తగిన ఉపశమనం కలుగుతుంది. మనసుకు శాంతి లభిస్తుంది. ఇన్ఫ్లూయెంజా, మలేరియా, టైఫాయిడ్ మొదలైన రోగాలకు కూడా తులసి కషాయం మేలు చేస్తుంది. అందుకే దీనిని మృత్యువునుండి పునర్జన్మనిచ్చేది అని కూడా పిలుస్తారు. ధర్మశాస్త్రాల ప్రకారం తులసి దర్శించుట, స్పర్శించుట, పెంచుట, తడుపుట, పూజించుటవలన అన్ని అశుభములు నివారణ ఔతాయి. ఇంటిలో సుఖశాంతులు వృద్ధి చెందుతాయి. ఏఇంట్లో తులసి మొక్కలు అధికంగా ఉంటాయో, అక్కడ రోగాణువులు తగ్గి ప్రాణశక్తి పెరుగుతుందన్న యదార్థాన్ని విజ్ఞాన వేత్తలు కూడా స్వీకరించారు.

తులసివలె వేపకూడా మనందరి జీవితాలకు చాలా దగ్గరగా గోచరిస్తుంది. అజాడోరాక్టా ఇండికా అని దీనిని వృక్ష శాస్త్రంలో వ్యవహరిస్తారు. నింబ, తిక్తక్ అనే పేర్లతో సంస్కృతంలో పిలుస్తారు. నీమ్ అని ఒరియాలోను, నిమగాఛ్ అని బెంగాలీలోను బేబ్అని కన్నడంలోను తమిళములోను, లీంబడా అని గుజరాతిలోను, వేపచెట్టు అని తెలుగులోను దీనిని పేర్కొంటారు. భారతదేశపు అన్ని ప్రాంతాలలోను లభ్యమయ్యే సుపరిచితమైన వృక్షం వేప.

ఔషధీగుణాల దృష్టిలో వేప, కఫవాత పిత్తముల జ్వరం, కుష్ఠు మొదలైన అనేక రోగాలను నశింప చేస్తుంది. వేపగింజలలో 40 శాతం నూనె ఉంటుంది. వేపతైలం చేదుగా ఉండి క్రిమినాశకంగా పని చేస్తుంది. ఈ తైలం చర్మరోగానికి, గుండె, జీర్ణాశయ, పైత్యాశయ రోగాలకు, జీర్ణించిన కుష్ఠు రోగానికి ఉపయోగిస్తారు. వేప బెరడు, ఆకులు చేదుగా ఉన్నప్పటికి బలాన్నిచ్చి, జ్వరాన్ని నివారించి, నీరసాన్ని దూరం చేస్తాయి. దీని బెరడు నీటిలో కలిపి తాగితే, పొట్ట శుభ్రపడుతుంది. కండ్లమంట నుండి ఉపశమనం లభిస్తుంది. వేపాకులు నేత్రాలకు మంచివి. కుష్ఠుక్రిమినాశనం చేసి లాభం చేకూరుస్తాయి. ఇవి చర్మరోగ నాశకాలుగా భావించడమే కాక, విషనాశకాలు కూడ. వేపాకులు మరగకాచిన నీటితో స్నానం చేస్తే కురుపులు, మొటిమలు, గజ్జి, తీట (దురద) మొదలైన చర్మరోగాలు నివారింపబడతాయి. వేపాకుల రసాన్ని కొద్దిదినాలు తాగితే రక్తం శుద్ధి ఔతుంది. వేపాకుతో మరిగించిన నీటితో పాదాలను కడుగుకున్నందువల్ల అలసట దూరమౌతుంది. పచ్చి వేపాకులు నమిలి పుక్కిలించితే నోటి దుర్గంధం పోతుంది. నిద్రపోయేటపుడు వేపనూనె శరీరానికి మర్దన చేస్తే కీటకాలు, దోమలు మొదలైనవి కుట్టవు. ఎండిన చిన్న వేపకొమ్మలు, రెమ్మలు మండించి పొగబెడితే దోమలు, ఇతర ఎగిరే పురుగులు, మిడతలు పారిపోతాయి.

ఈ వరుసలో వనౌషధాలలో సహజంగా ఎక్కడైనా సులభంగా లభించే ఔషధం ఉసిరిక 'ఎంబిలికా ఔఫిసినైలిస్' దీని శాస్త్రీయ నామం ఫ్రాంసిస్ చరైయా, బనారసీ, కృష్ణా, కంచన మొదలైన రకాలు ఉసిరికలో ఉన్నాయి. పౌష్ఠికత దృష్టిలో ఉసిరికలో విటమిన్ 'సి' తగురీతిలో ఉన్నది. శరీరంలో విటమిన్ 'సి' కొరత వల్ల స్కర్వీ వంటి ప్రాణాంతక వ్యాధి ఉత్పన్నమవుతుంది. విటమిన్ 'సి' లోపం వలన చిగుళ్ళలో వాపు వచ్చి రక్తం కారుతుంది. దీని పరిణామముగా చిగుళ్ళు బలహీనమవుతాయి. వీటన్నింటికి ఏకైక ఔషధం ఉసిరి. రక్తంలో కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ఇది రక్తనాళాలను పుష్టిగాను, కోమలంగాను చేస్తుంది.

తాజా ఉసిరికలో విటమిన్ 'సి' అధికంగా ఉంటుంది. అదే విధంగా తాజా ఉసిరిక శీఘ్రంగా గుణాన్నిచ్చే ఔషధం కూడ. ఇది మూత్ర వ్యవస్థను సరిగా ఉంచేందుకు సహాయపడుతుంది. ఎండబెట్టిన ఉసిరిక జిగటవిరేచనాలు, దానివలన కలిగే నొప్పిని తగ్గించడంలో చాలా ఉపయోగపడుతుంది. ఉసిరిక ఫలంలో ఉండే అతి పెద్ద విశేషమేమంటే దీనిలోని 'సి' విటమిన్ ఉడికించినా, ఎండబెట్టినా నాశనం అవదు. మహత్తర ఔషధాలైన చ్యవనప్రాశ, త్రిఫల చూర్ణాలలో దీని పాత్ర ప్రశంసనీయం.

పచ్చిఉసిరికను పాలతోను, చద్దన్నంతోను తినడం చాలా లాభదాయకం. తాజా ఉసిరికను దంతాలతో కొరికి తినడం వలన దంతాలు బలపడతాయి. ఉసిరిక నీళ్ళతో కురులు రుద్దుకుంటే కురులు పొడవుగాను, దట్టంగాను, నల్లగాను పెరుగుతాయి.

**సాటివారికి సేవ చేయడం నిన్ను నీవు సేవించుకోవడమే.**

మలబద్దకాన్ని పోగొట్టేందుకు ఉసిరిక ఒక వరంవంటిది. ఇది శరీరంలో చెడిపోయిన జీర్ణాశయాన్ని సరిచేస్తుంది. ఉసిరిక చూర్ణాన్ని నియమంప్రకారం భోజనానంతరం సేవిస్తే బుద్ధి వికసిస్తుంది. నేత్రాలు కాంతివంతమౌతాయి. దీని వలన ఉబ్బస రోగులకు ఉపశమనం లభించి రక్తం శుద్ధి ఔతుంది. శరీరంలోని రక్తప్రవాహాన్ని ప్రభావవంతమైన రీతిలో సరిచేస్తుంది. ఉసిరిక వలన గుండె ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణక్రియ కూడా సరిగా ఉంటుంది.

మన సామాన్య జీవన క్రమంలో బాగా ఎరిగిన లవంగం కూడా చక్కని ఔషధగుణం కలది. రసాయనిక విశ్లేషణ చేస్తే ప్రతి 100 గ్రాముల లవంగాలలో 45-30 మిల్లీ గ్రాముల కార్బోహైడ్రేట్లు, 5.5 మిల్లీ గ్రాముల ప్రొటీన్లు (మాంసకృత్తులు), 0.74 మిల్లీ గ్రాముల కేల్షియం (సున్నం) 100 మి. గ్రా. ఫాస్పరస్, 48.8 మి. గ్రా. అయోడిన్, విటమిన్లు లభిస్తాయి. ఎక్కువ తైలం లభ్యమయ్యే లవంగాలే మంచి గుణకారకాలు.

ఆయుర్వేద శాస్త్ర ప్రకారం లవంగం రుచితోపాటు, నేత్రాలకు లాభకారకం, ఉత్ప్రేరకం, జీర్ణదాయకం, రుచికారకం, పిత్త, కఫ దోషాలను హరిస్తుంది. ఇది శ్వాసరోగం, దగ్గు, క్షయరోగం, రక్తదోషం, జ్వరం, వాంతుల మొదలైన వాటిని తగ్గించుటలో లాభదాయకమని గుర్తించబడినది. ఇది రక్తంలోని తెల్లకణాలను వృద్ధి చేసే విశేష గుణం కలిగి ఉంది. ఈ కారణంగానే ఇందులో గాయాలను నయం చేసి వేగంగా మానేటట్లు చేసే విలక్షణశక్తి ఉంది. భోజనానంతరం లవంగ రసాన్ని పీలిస్తే నోరు, శ్వాసల దుర్గంధం దూరమౌతుంది. దంతాలు, చిగుళ్ళు గట్టిపడతాయి. దీని వలన ఆహారం సరైన రీతిలో జీర్ణమౌతుంది. ఎక్కిళ్ళు, కడుపులో త్రిప్పడం మొదలైన వాటిలో కూడా లవంగ రసాన్ని పీలిస్తే లాభం కలుగుతుంది.

పైన ఈయబడినవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. దీనివలన మన చుట్టుపట్ల లభ్యమయ్యే వృక్షవనస్పతులలో రోగనివారణ శక్తి ఎంతో ఉందని మనకు తెలుస్తోంది. ప్రకృతి తల్లి వంటిది. కనుక అన్ని రకాలైన రోగ బాధలకు కారణాలను, వాటి పరిష్కారాలను అనేక వనస్పతుల రూపంలో మనకు సమకూర్చి పెట్టింది. మనదే ఆలస్యం. వాటిని మనకనుకూలంగా మలచుకొని ప్రయోగించుకోవడమే. వివిధ వనస్పతులతో రోగకారకాలను నిర్ణయించి నయం చేసుకోవడం చాలా సులభం. ఇది ఒక ఉన్నత వైజ్ఞానిక ప్రక్రియ కూడ. ఆధునిక శోధన పరిశోధనల ద్వారా ప్రమాదకరంగా భావించే రోగాలకు వైద్యం సఫలతా పూర్వకంగా ఈ వనస్పతుల ద్వారా సాధ్యమనే విషయం తెలిపోయింది. అందుచేతనే వనౌషధ చికిత్సా విధానం పాశ్చాత్య దేశాలలో త్వరిత గతిని జనరంజకమౌతుంది. మరి మన విజ్ఞానంలో అపరిచితులుగా ఉండడమెందుకు? మన చుట్టు లభ్యమయ్యే వనౌషధుల మహత్తును తెలుసుకొని, వాటిని ఉపయోగంలోనికి తేవడంలోనే మన సమర్థత, తెలివితేటలు ఇమిడి ఉన్నాయి. వీటి వలన స్వయంగా మన లాభం పొంది, ఇతరులను కూడా లాభపడేలా చేద్దాం.

*- తెలుగు అనువాదం : బాసంగి శ్రీరాములు*

*(అఖండ జ్యోతి సెప్టెంబరు 2000)*

## సత్యకామ జాబాలి

*చిన్నవాడైన జాబాలి తనను గురుకులాశ్రమంలో విద్యార్థిగా చేర్చుకోమని గురుకుల పీఠాధిపతియైన గౌతమ ఋషిని ఆశ్రయించాడు. ఆయన నీ గోత్రమేమిటి? నీ తండ్రి ఎవరు అని అడిగాడు. అవే ఆనాటి చదువులకు అర్హతలు.*

*బాలుడు ఇంటికి వచ్చి తన తల్లి జాబాలినడిగాడు. అపుడు ఆ తల్లి చూడు నాయనా! విధవరాలైన నేను ఒక యజమాని ఇంట్లో దాసిగా ఉన్నప్పుడు నీవు నా కడుపున బడ్డావు. నీ తండ్రి ఎవరో నేను గుర్తించలేదు. ఈ విషయమే మీ గురువుగారికి చెప్పు అన్నది తల్లి. బాలుడు తిరిగి వెళ్ళి తల్లి చెప్పిన సమాధానాన్ని గురువుగారికి చెప్పాడు. అలా చెప్పడం వల్ల ఏర్పడే సమాజపరమైన నిందలను లెక్కచేయకుండా చెప్పాడు. అప్పుడు గౌతముడు సంతోషంతో బాలుని ఎత్తుకుని బ్రతుకుతెరువు కొరకు కులట వృత్తి ఆశ్రయించి కూడా ఆ విషయమును చెప్పటానికి సందేహించని ఆ తల్లి, ఆమె చెప్పిన విషయాన్ని దాచకుండా సత్యమును చెప్పిన ఈ బాలుడు మా వద్ద విద్య నేర్చుకొనుటకు తగిన వాడే అని అతనిని ప్రేమతో శిష్యునిగా స్వీకరించి ఆశ్రమంలో చేర్చుకున్నాడు. ఆ బాలుడు సత్యకామ జాబాలిగా ప్రసిద్ధి పొందాడు.*

**వికసించని పూలు సుగంధాన్ని ఇవ్వవు - వికసించని మానవులు జ్ఞానాన్ని ఇవ్వరు.**



ధారావాహిక: హనుమత్ కథామృతం-27

# ఇంద్రునికి క్షమ-హనుమాన్‌కి వరాలు లభించాయి

హిమాలయాలలోని దివ్యమైన గుహ దేవతల, మహర్షుల రాకతో పునీతమై పోయింది. పవన దేవుని సంకేతం ప్రకారం వానరరాజు కేసరి, అంజనాదేవి ముందుగానే వచ్చిచేరారు. అంజనీదేవి ప్రాణాలు పుత్రుని చుట్టూ తిరుగుతూ ఉన్నాయి. ప్రియపుత్రునకు కష్టం వాటిల్లగానే ఆమెకు తెలియకుండానే ఆందోళన మొదలయింది. పుత్రుని జాడ తెలుసుకోమని భర్తను వేధించసాగింది. ఇంతలోనే వాయుదేవుని సంకేతం రానే వచ్చింది. దంపతులిద్దరూ ఉన్న పళంగా వచ్చేశారు.

ముద్దుల తనయుని పరిస్థితి చూచి కన్నతల్లి మనస్సు తల్లడిల్లిపోయింది. అంతలో తన పుత్రుడు సదాశివుని వరదానమనీ, అతనికి ఎలాంటి ఆపద కలగడానికి వీలు లేదనీ సమాధానం చెప్పుకుంది. రామకార్యం కొరకు జన్మించిన తనగారాల పుత్రునికి కష్టం కలిగించే సాహసం ఎవరు చేయగలరు? వచ్చిన పని పూర్తి కాకుండా ఎక్కడకు పోతాడు? అనుకుంటూ ధైర్యం చెప్పుకుంది. అతని రోమరోమం నుండి రామనామం వెలువడుతూ ఉంటే మృత్యువు అతని దరిదాపులకు కూడా రాదు. మానవుడుగా జన్మించిన శ్రీరాముడు మానవలీలలను సృష్టిస్తూ ఉన్నాడు కాబోలు! మానవోచిత సమస్యలను సృష్టిస్తూ ఉండవచ్చు. తన భక్తుని పరీక్షిస్తూ ఉండవచ్చు. తప్పక రక్షించి తీరుతాడు అనుకుంటూ ఊరటపొందుతూ ఉంది.

ఇలాంటి భవ్యమైన ఆలోచనలతో అంజనీదేవి పూర్తిగా స్థైర్యాన్ని పొందింది. ఆమెను చూచి కేసరి కూడా కుదుట పడ్డాడు. వీరిరువురిని చూచిన తర్వాత పవనదేవుడు కూడా ధైర్యాన్ని పుంజుకున్నాడు. అయినా పవనునికి, కేసరికి ఏ మూలనో కొద్దిగా భయం ఆవరించి ఉంది. ఒకరివెంట ఒకరు విఘ్నేశ్వరుడు, కుమారస్వామి, దేవగణములు, హిమాలయాలలో నివసించే ఋషి సత్తములు అందరు గుహ దగ్గరకు చేరుకున్నారు. రమావిష్ణులు, పార్వతీ పరమేశ్వరులు మాత్రమే మిగిలిఉన్నారు. అందరూ వారికోసం ఎదురు చూస్తూ ఉన్నారు. గరుడవాహనం మీద లక్ష్మీ సమేతంగా విష్ణుమూర్తి విచ్చేశాడు. చివరగా చిరునవ్వులు చిందిస్తూ నందివాహనంపై పార్వతీ పరమేశ్వరులు విచ్చేశారు. వారి వెంట ప్రమథ గణాలు పరుగులుదీస్తూ వచ్చారు.

పరమేశ్వరుని ఆగమనంతో నారాయణుడు స్నేహ పూర్వకంగా చెయ్యి చాపాడు. పరస్పరం నమస్కారం చేసుకున్నారు. బ్రహ్మదేవుడు కూడా వీరిద్దరితో చేరిపోయాడు. ముగ్గురిని ఒకేచోట చూచి ఇంద్రుడు సిగ్గుపడుతున్నాడు, భయపడుతున్నాడు. పార్వతిని తలచుకుంటేనే లోలోపల ఒణికిపోతున్నాడు. గణాధిపతి అయిన విఘ్నేశ్వరుడు అందరి మనోభావాలను అర్థం చేసుకున్నాడు. తల్లికి భావపూర్వకంగా సైగచేశాడు. కుమారుని సంకేతం అందుకుని పార్వతీదేవి భర్తవైపు చూచింది. పార్వతి సంకేతాన్ని శివుడు గ్రహించాడు. దృఢమైన స్వరంతో నెమ్మదిగా, మధురంగా ఇలా అన్నాడు.

“దేవరాజు ఇంద్రుడు హనుమాన్‌ను వజ్రాయుధంతో పడవేసి క్షమించరాని నేరం చేశాడు. అతనికి శిక్షపడాలి. అయినప్పటికీ అతనిని క్షమిస్తూ ఉన్నాం. కానీ ఇంద్రుడు తాను చేసిన తప్పిదానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి.”

ఒక్కక్షణం ఆగి మహాదేవుడు నవ్వుతూ “ఇంద్రుని ప్రాయశ్చిత్తంతో పాటు మనందరం కూడా” అంటూ అందరి ముఖాలు చూశాడు. మాట పూర్తి కాకుండానే అగ్ని దేవుడూ, వరుణ దేవుడూ “చెప్పండి మన మేం చేయ్యాలి?” అని ప్రశ్నించారు. దానికి సమాధానంగా పార్వతీ దేవి “నాకు ప్రియమైన హనుమంతునికి మీరంతా మీమీ శక్తికి తగిన విధంగా వరాలను ఆశీర్వచనాలనూ ప్రసాదించాలి. సమయం పడినప్పుడు అందరూ అతనికి సహకరించాలి. ఆ విధంగా నాకు మాట ఇవ్వండి” అంది. అంజనీదేవి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒక్కసారిగా లేచి జగన్మాత

**నీతిలేని ధర్మం వేరులేని వృక్షం వంటిది.**

పాదాలపై పడి నమస్కరించింది. ఆమె కన్నులు అశ్రుపూరితాలయ్యాయి. పార్వతీ దేవి స్నేహపూర్వకంగా ఆమె తలపై చేయి పెట్టి నిమురుతూ ధైర్యాన్ని ఇచ్చింది. దేవతలంతా సంతోషంగా తమతమ అంగీకారాన్ని చేశారు. పరమశివుడు పరమానంద పడిపోతూ హనుమంతుని వైపు దృష్టి సారించాడు. మహాకాలుని దృష్టి ప్రసరించగానే హనుమంతుడు మూర్ఛనుండి తేరుకున్నాడు. పూర్వం కన్నా మించిన తేజస్సుతో ప్రకాశిస్తూ ఉన్నాడు.

హనుమంతుడు స్వస్థత చెందగానే అందరి ముఖాలపై ఆనందం తాండవమాడింది. బ్రహ్మదేవుడు వాయుదేవుని వైపుచూస్తూ "ఇకనీవు నీ కర్తవ్యాన్ని స్వీకరించవచ్చుకదా?" అంటూ దరహాసం చేశాడు. పవనుడు తలవంచి నమస్కరించగానే సృష్టిలో ప్రాణశక్తి ప్రవహించడం మొదలైంది. సకల ప్రాణులలోనూ నూతన చైతన్యం వచ్చేసింది. సూర్యభగవానుడు కూడా తన బాధ్యతను చేపట్టాడు. సృష్టిలో సమస్త కార్యాలూ సజావుగా సాగిపోతున్నాయి. కానీ పార్వతీ దేవి ముఖంలో ఏదో ఆకాంక్ష కదలాడుతూ ఉంది. విఘ్నేశ్వరుడు ఆ విషయాన్ని గమనించాడు.

తల్లికి నమస్కరించి "అమ్మా! నీదయవల్ల నేను ప్రథమ పూజకు అర్హుడనయ్యాను. అందువల్ల హనుమంతునికి వరం ముందుగా నేనే ఇస్తాను. నావలెనే హనుమాన్ కూడ సంకట మోచన హనుమాన్‌గానూ, విఘ్ననాశకుడుగాను ఉండి నీకు ఆనందాన్ని కలిగిస్తాడు. స్మరించినంతనే సకల ప్రాణులకు కష్టాలు దూరం అవుతాయి. నాలాగానే సిద్ధిని, బుద్ధిని ప్రసాదిస్తాడు అని వరదానం చేశాడు. ఆ వరాన్ని వింటూనే పార్వతి ఆనందంతో పరవశించిపోయింది. ఆమె ఆనందాన్ని మరికొంత పెంపొందిస్తూ కుమార స్వామి "హనుమంతుడు యుద్ధ సమయంలో స్వీయశక్తితో ఆజేయుడుగా ఉంటాడు. తానే కాదు. తనను నమ్ముకున్న భక్తులు కూడా శౌర్య పరాక్రమాలతో విజయాలను సాధిస్తారు." అంటూ వరాన్ని ప్రసాదించాడు. వీరి ప్రారంభంతో దేవతలంతా ఒకరి తర్వాత ఒకరు వరాల వర్షం కురిపించారు. వానరరాజుకేసరి, అంజనీదేవి పరవశంతో ఊగిపోతున్నారు. క్రమంగా దేవతలందరూ ఇది పరమేశ్వరుని లీలగా గ్రహించారు. ఆది దంపతులకు నమస్కరించి ఎవరి నివాసాలకు వారు వెళ్లిపోయారు.

*– అఖండ జ్యోతి – అక్టోబరు – 2009*

## కదిలించే కళ్లు

27.సీ॥ జైలులో నుండగా చైతన్యమొందుచు  
రాని భాషల నేర్వరయముగాను  
సున్నంపు రాయిని సున్నితంబుగ బూని  
గోడపై వ్రాయుచు కుదురుగాను  
తోటి ఖైదీలంత తోడ్పాడు నందీయ  
ఆంగ్లభాషను నేర్చి ఆదరమున  
సంస్కృతంబుకు తోడు సరళమౌ హిందీని  
వారికిన్ నేర్పుచు వరుసగాను

తే॥ ఇచ్చిపుచ్చుకొనుచు వేగ యింపుమీర  
ఇతర భాషలు నేర్చిన వితమునంత  
మానవాళికి దెలుపుట మరువకనుచు  
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

28.సీ॥ కాంగ్రెసులోనను ఘనులైనవారికి  
సేవలు సేయుచున్ సంతసమున  
జైలు గోడల మధ్య జయమును కోరేటి  
మాలవ్య మాటలన్ మదిని నిలిపి  
పదిపైసలకు తోడు పదిలంగ పిడికెడు  
బియ్యంబు కోరుచు బిడియపడక  
పరివార సంస్థను పట్టుతో నడిపింప  
కోట్లాది ధనమును కూర్చుకొనుచు

తే॥ ఆశ్రమంబును నడిపించి యలుపులేక  
మంత్ర జపమును చేయించి మసలువితము  
మానవాళికి దెలుపంగ మరువకనుచు  
కవిని కదిలించె గురువు కంటిచూపు

రచన–మధుర కవయిత్రి  
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**భగవంతుడు లేని నీతి చుక్కాని లేని పడవ వంటిది.**

సాధనా విజ్ఞానం

# గురుదీక్ష - దేవదక్షిణ - ఆంతర్యం

మనిషి సామాజిక ప్రాణి. ఏకాకిగా ఉంటే అతను అడవి మనిషి వలెనే జీవిస్తాడు. ప్రగతిని పొందలేడు. ఇతర ప్రాణులైతే జన్మించిన తర్వాత కొద్ది సమయంలోనే ఆహారాన్ని తమంతట తామే తినడానికి ప్రయత్నిస్తాయి. కాని మానవ శిశువులు కొన్ని సంవత్సరాలు పెద్దవారి సంరక్షణలో ఉండాల్సి వస్తుంది. శిక్షణకు అధ్యాపకునిపైన, ఆరోగ్యానికి వైద్యునిపైన, సంపాదించడానికి ఆఫీసులపైన, కర్మాగారాలపైన, వ్యాపారాలపైన, ఉత్పత్తి దారులపైనా, కొనుగోలుదారులపైన ఆధారపడాల్సిందే. ఆ విధంగా మరొకరిపై ఆధారపడక పోతే మనిషికి ఆలోచించడం, మాట్లాడటం, సభ్యతగా వ్యవహరించడం కూడా తెలిసేది కాదు. ఇచ్చిపుచ్చుకోవడమనే పద్ధతి వల్లనే మనిషి ఇంత ప్రగతిని సాధించగలిగాడు. అతని అభివృద్ధికి ఆధారం కూడా పరస్పర సహకారంపైనే ఆధారపడి ఉంటుంది.

ఆత్మకు సంబంధించిన విషయంలో అయితే ఈ నియమం ఇంకా ఎక్కువగా వర్తిస్తుంది. ఆత్మాభివృద్ధికై ఉదారుల, తపస్సంపన్నుల, మార్గదర్శకుల అవసరం ఉంటుంది. శిష్యుల అవసరాలే కాదు, కష్టాలలో, సమస్యలలోతుల్లోకి వెళ్ళి వాటిని అర్థం చేసుకుని, పరిష్కారాలను తెలిపి, అవసరమైతే తన తపస్సంపద నుండి కొంత భాగాన్ని ఇచ్చి శిష్యుని సమస్య నుండి బయటకు తీయాలి. ఆత్మిక క్షేత్రంలో అలాంటి సహాయం చేసే అవసరం ఎంతైనా ఉంటుంది.

భూమి ఎంత సారవంతమైనదైనా, పచ్చని గడ్డి మొలవాలంటే దానికి నీరు అవసరమౌతుంది. ధాతువు ఎంతటి విలువ గలదైనా ఉపయోగించే పరికరంగా, లేక ఆభరణాల రూపంగా మార్చడానికై ధాతువును అగ్ని ద్వారా శుభ్రపరచబడి మలచబడాల్సి ఉంటుంది. వజ్రం సానబెట్టేవాని కౌశల్యంతో మెరుస్తుంది. ఎంతో విలువగలదానిగా తయారవుతుంది. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకునే గురు శిష్యుల సాంప్రదాయపు మహత్తును అంగీకరించడం జరిగింది. భ్రమ నుండి బయట పడాలంటే మార్గదర్శకులు ఉండాలి. ప్రగతిని సాధించాలంటే సహకరించే వారు ఉండాలి.

వివేకానందునకు – రామకృష్ణ పరమహంస ఆశ్రయం, చంద్రగుప్తునికి – చాణుక్యుని, శివాజీకి – సమర్ధగురు రామదాసు, వినోబాకి – గాంధీ మహాత్ముని ఆశ్రయం లభించింది. వీరి ఆశ్రయమే లభించకపోతే వారు తమ సొంత ప్రయత్నంతో ఇంతటి ప్రగతిని సాధించేవారు కాదు. ప్రపంచంలోని మహానుభావుల వెనుక ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఏదో ఒక రూపంలో ఏదో ఒక శక్తి సహాయం చేస్తూ వచ్చింది. బలహీనంగా ఉండే పూల తీగ, చెట్టుని ఆసరాగా పొంది ఆ చెట్టంత ఎత్తుకు ఎదుగుతుంది. ఎగురవేసే వాని కౌశల్యమే గాలి పటాన్ని ఆకాశంలో ఎంతో ఎత్తుకు ఎగురవేస్తుంది. గారడీవాడు కీలుబొమ్మల్ని కూడా జీవం ఉన్న వారివలె నటింపచేయడంలో నేర్పును చూపిస్తాడు. ఆనందుడు కుమారజీవుడు లాంటి సామాన్య మానవులు తమ బుద్ధి కుశలతతోనే విశ్వఖ్యాతిని పొందారు. పెద్దవారి విషయాన్ని వదిలేస్తే, సామాన్యంగా ప్రగతిని సాధించాలంటే తమకంటే ఎక్కువ సమర్థుల సహకారం కావాలి. తల్లి బాలకుని సంరక్షణలో ,పోషణ చేయడంలో ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉంటుంది. తండ్రి ఆ పిల్లవాని సంరక్షణకై, ప్రగతి కొరకు అవసరమయ్యే అన్ని సాధనాలను కూడబెడుతూ ఉంటాడు. ఆధ్యాత్మిక క్షేత్రంలో ఈ రెండు పనులూ గురువే నిర్వహించాల్సి ఉంటుంది. ఏ మార్గదర్శకుని సహాయం లేకుండానే కొంతమంది ఏకలవ్యుని వలే తమ కర్తవ్య నిష్ఠ బలంతోనే ఎంతో ఉన్నతమైన ప్రగతిని పొందారు. కాని అది చాలా అరుదుగా కనిపిస్తుంది. కృష్ణుడు–సాందీపుని, రాముడు–విశ్వామిత్రుని, పాండవులు–ద్రోణాచార్యుని ఆశ్రయం పొందిన విధంగా ప్రగతిని సాధించుటయే సరైన పద్ధతి.

ప్రజ్ఞాయుగం చాలా దగ్గరలో ఉంది. దీనిలో మహాప్రజ్ఞ గాయత్రి–యుగశక్తి రూపంలో వెలువడుతున్నది. ఆమె ఆశ్రయం పొందినవారు విపత్తులనుండి బయటపడటంలో, ఉజ్జ్వల భవిష్యత్తును పొందటంలో ఇతరుల కంటే ఎక్కువ సమర్థులౌతారు.

నేడు చైతన్యవంతులు ఆత్మకళ్యాణం, లోకకళ్యాణం రెండింటిని కూడా నిర్వహించాలి. దీనికై వారి స్వంతశక్తి సరిపోదు, వారికి భగవంతుని అనుగ్రహం కావాలి. రణరంగంలో సైనికుడు

**లేనిదాని కోసం ఆశించేది దుఃఖం. ఉన్నది చాలనుకునేది సుఖం.**

ఒక్కడే పోరాడడు. అతనికి అవసరమైన సాధనాలను అందించడంలో సమర్థవంతమైన గవర్నమెంటు అతని వెనకాలే ఉంటుంది. అలాంటి అదృశ్యదైవశక్తి ప్రత్యక్షంగా గురుదీక్ష రూపంలో లభిస్తుంది. యుగనిర్మాణాన్ని నడిపేవారి ఉదాహరణ ఇటువంటిదే. వారిలో సత్ప్రయోజనాలకై ఉపకరించే దైవానుగ్రహాన్ని చూడవచ్చు, తెలుసుకోవచ్చు, పరిశీలించవచ్చు.

సాధకుని శ్రద్ధతోపాటు గురుసామర్థ్యాన్ని జోడించే ప్రక్రియనే గురుదీక్ష అంటారు. గురువు సామర్థ్యంపై విశ్వాసం ఉంచి, ఆ లాభాన్ని పొందటంలో శ్రద్ధతో సంకల్పం తీసుకోవడానికి శిష్యులు నడుం కట్టాలి. దీక్ష యొక్క భూమిక ఏర్పడుతుంది. మొక్కకు అంటుకట్టడం ఎంత మహత్తును కలిగి ఉంటుందో దీక్షా కార్యం కూడా అంతే మహత్తును కలిగి ఉంటుంది.

ఆ అంటు నుండి రసం తీసుకోగలగడంలోనే మొక్క తన నైపుణ్యాన్ని చూపిస్తుంది. పౌష్టిక ఆహారంతో శరీరం బలపడుతుంది. కాని దానికై ఆహారం తింటే సరిపోదు. పొట్ట కూడా జీర్ణింపచేసే రసాన్ని దానితో కలపాలి. అపుడు శరీరానికి బలం లభిస్తుంది. యజ్ఞంతో శ్రేష్ఠ సామాగ్రితో ఆహుతులు వెయ్యడంతో వాతావరణం పరిశుభ్రమవుతుంది. పోషణ కూడా జరుగుతుంది. కాని యజ్ఞకుండంలోని అగ్ని యజ్ఞ సామాగ్రిని తనవేడితో భస్మం చేస్తుంది. అప్పుడు మాత్రమే వాతావరణం మారుతుంది. ఈ విధంగానే గురువు యొక్క ప్రాణానుదానం పొందిన శిష్యుడు గురువు పట్ల శ్రద్ధతో కూడిన సమర్పణను అందిస్తాడు. అప్పుడే కోరుకున్న ప్రతిఫలం లభిస్తుంది. దీక్ష సఫలమవడంలోనూ లేక నిరర్థకమవడంలోనూ ఇదే అర్థం దాగి ఉంది.

దీక్షను సార్థకం చేసే ఈ శ్రద్ధ ప్రయత్నాన్ని 'దక్షిణ' అంటారు. అంటు కట్టిన మొక్కకు వృక్షం తన రసం నుండి కొంత భాగాన్ని అంటులోనికి ప్రవహింపచేయాలి. శిష్యునితో జోడించబడిన ప్రాణాన్ని ప్రగతి మార్గంలో పయనింపచేయడానికి గురువు తన సమయంలో, సాధనాలలో, పురుషార్థంలో కొంత భాగాన్ని శిష్యుని కోసం వెచ్చించాలి. గురువు ద్వారా లభించిన శక్తి యుక్తులను చాలా జాగ్రత్తగా ఖర్చు చేయాలి. ఈ దక్షిణ సాధకుని దీక్షను సార్థకం చేస్తుంది. గురువు ద్వారా దీక్ష – శిష్యుని ద్వారా దక్షిణ సమర్పించుకునే పద్ధతి తప్పనిసరి ప్రక్రియగా ప్రతిపాదించబడింది.

విత్తనం వృక్షంగా తయారవ్వాలంటే నీరు, ఎరువు అవసరమవుతాయి. అగ్నిని ప్రజ్వలింప చేయాలంటే ఇంధనం కావాలి. ఆహారాన్ని జీర్ణింపచేయడానికి జీర్ణరసం కావాలి. వర్షం సారవంతమైన భూమికే ఉపయోగపడుతుంది. జీవశక్తి ఉన్న వారిలోనే మందులు పనిచేస్తాయి. పరసువేది ఇనుమును మాత్రమే బంగారంగా మారుస్తుంది. ఈ విధంగానే సమర్థుడైన గురువు ఇచ్చిన దీక్ష శ్రద్ధ కలిగిన శిష్యునికి మాత్రమే ఫలిస్తుంది. కాని అది ఏ ఒక్కరితోనూ సాధ్యం కాదు. దీనిలో గురువు యొక్క సామర్థ్యం, శిష్యుని అర్హత సమానంగా ఉండాలి. ఒక చేత్తో చప్పట్లు ఎలా కొట్టగలం? కళ్ళు ఉంటేనే దృశ్యం కనిపిస్తుంది. చెవులు పనిచేస్తేనే శబ్దాలు వినిపిస్తాయి. మెదడు సరిగ్గా ఉంటేనే శిక్షణ ఉపయోగపడుతుంది. శిష్యునికి గురువు అనుగ్రహం లభిస్తేనే ప్రతిఫలం లభిస్తుంది. ఇందువల్లనే గురుదీక్ష యొక్క ఒక భాగంగా గురుదక్షిణ అని చెప్పబడింది. నిజమైన ఆత్మాభివృద్ధికై బండికున్న ఈ రెండు చక్రాలు సమానంగా పని చేయాలి. గురుదీక్షకు 3 రూపాలున్నాయి. 1. మంత్రదీక్ష – అంటే నిర్ధారించడం, క్రమశిక్షణ, 2. ప్రాణశక్తి – భూమిలో విత్తనాలు నాటడం, గర్భధారణం, చెట్టుకి అంటుకట్టడం, రెండు ప్రాణాల ఏకీకరణ, 3. బ్రహ్మదీక్షా సమర్పణ, విసర్జన, శరణాగతి, ఏకాత్మత, అద్వైతం రెండు శరీరాలు ఒకే ప్రాణంగా మారాలి. గాయత్రీ మహా విజ్ఞానంలోని మూడవ భాగంలో వాటిని గురించి విస్తృతంగా చర్చించబడింది.

గురుదీక్షకి మూడు పక్షాలున్నాయి. 1) ఉపాసనలో నియమ బద్ధత, నిష్ఠను జోడించడం, 2) జీవన సాధనలో భావనాత్మకంగా లీనమవ్వడం, ఉన్నతమైన జీవనం, ఉదారంగా వ్యవహరించడంలో నిరంతర ప్రగతి, 3) సత్ప్రవృత్తులను పెంచడంలో ఇతరులు తమను అనుకరించేలా ప్రవర్తించడం. నేడు ఎవరు ఏ పరిస్థితిలో ఉన్నా, కొంత అభివృద్ధి మార్గంలో సాహసవంతమైన అడుగును వెయ్యాలి. అందులోనే గురుదక్షిణ అర్థం దాగి ఉంది. ఎవరేమి చేస్తారు? అనే ప్రశ్నకు స్వయంగా సమాధానం ఇవ్వవలసి ఉంటుంది.

దీక్షను స్వీకరించే వారినుండి మహా ప్రజ్ఞా–గురుదేవులు ఆశించేదేమంటే, వారు నవయుగ నిర్మాణ ఉద్యమాన్ని సఫలం చేయడానికి తమ అంశదానాన్ని పెంచాలి. నేడు మానవత్వం జీవన్మరణాల మధ్య ఊగిసలాడుతున్నది. భయంకర సమస్యలతో

**కర్మయోగి నిస్వార్థంగా సేవ చేస్తూ గమ్యంవైపు పయనిస్తాడు.**

పోరాడటానికి, ఉజ్జ్వల భవిష్యత్తుకై పునాదులు వెయ్యడానికి సరైన సమయం ఇదే. ఈ మహా ప్రయోజనం సిద్ధించాలంటే ప్రజ్ఞాపుత్రుల అంశదానం ఎక్కువగా కావాలి. వారు తమ సమయాన్ని సాధనాలను ఎంత ఎక్కువగా ఇవ్వగలిగితే అంత, ఎక్కువలో ఎక్కువ ఉదారత్వాన్ని చూపాలి. పిసినారితనాన్ని రానివ్వకూడదు.

పూజ్య గురుదేవుల ద్వారా యుగ సృజనలో నిమగ్నమయ్యేశక్తి హిమాలయాల్లోని ఉన్నత కేంద్రం నుండి వస్తుంది. నిర్ధారించిన నిర్దేశాలకనుగుణంగా ఆ శక్తిని ప్రసాదిస్తూ ఉంటుంది. గురుదేవుల నిజమైన సంపాదన 3 రకాలు. 1) లెక్కలేనంతమంది చేసే సేవా సాధనలకు బదులుగా సంపాదించిన కైలాస పర్వతమంతటి పుణ్యం, 2) అంతరంగంలోనూ, బహిరంగంగానూ చేసిన మానస సరోవరం వంటి తపశ్చర్య, 3) లెక్కలేనంత ఆత్మీయతతో హృదయాకాశంలో కిక్కిరిసి ఉన్న భక్తి భావన, కరుణతో నిండిన ఆత్మీయత. ఈ మూడింటి ద్వారా తమ వద్ద దీక్షను పొందిన ఆత్మీయులను సుఖ సంతోషాలలో ఉంచే ప్రయత్నం చేస్తారు. ఈ అనుగ్రహంతో ఎంతోమంది సంస్కారవంతులు అయ్యారు. ఈవిధంగా పూర్వకాలంలో ఎంతోమంది అనుగ్రహ వర్షంలో తడిసి లాభం పొందారు. ఇది అందరికీ తెలుసు. భవిష్యత్తులో ఇటువంటి మేఘాలు ఇంకా దట్టంగా తయారవుతాయి. మేఘాల సమూహం వర్షించడానికి తయారవుతున్నాయి. దీక్షను పొందిన ఆత్మీయులందరికి ఈ అనుగ్రహంతో కూడిన విశిష్ట లాభం లభించనున్నవి. కాని ఈ విషయాన్ని ఒక్క క్షణం కూడా మరిచి పోకూడదు. బండరాతిపై కుండపోతగా వర్షం కురిసినా దానిపై గడ్డిపోచకూడ మొలవదు. దీక్షకు కారణం పేరాశే అయితే, శ్రద్ధ ఉత్పన్నమయ్యే ఏ చిహ్నం కనిపించకపోతే, శక్తివంతమైన దీక్ష కూడా తలవంచుకుని అపజయాన్ని పొందుతూ తిరిగి వెళ్ళిపోతుంది. నిష్ఠూరత, పిసినారితనం బండరాతివలే చలనం లేకుండా ఉంటే దీక్ష-దక్షిణలు మెలికపడి శక్తివంతమైన విద్యుత్ ప్రవాహాన్ని నిలిపివేస్తాయి. అలాంటి దీక్షలు ఎంతటి గొప్పవారి ద్వారా ఇవ్వబడినా అపహాస్యం పాలౌతాయి.

మీ కుటుంబ సభ్యుల్లో, మరో సభ్యుని చేర్చుకోండి. గురుదేవుల ప్రాణ ప్రియమైన 'ప్రజ్ఞా అభియానం', 'గాయత్రీ పరివారం', 'యుగ నిర్మాణ మిషన్' మొదలైన వాటి గురించి సమయం, సాధనాలు వెచ్చించాల్సి వస్తుంది. ఈ నూతన సభ్యుని కూడా అదే నిష్పత్తిలో పోషించాలి. ఎక్కువగా కాకపోయినా, తక్కువ కూడా చెయ్యకూడదు. మీ ప్రగతికై మీరు ఆలోచించే దాని కంటే, ప్రజ్ఞా అభియానం ప్రగతి విషయం గురించి ఆలోచించాలి. కుటుంబ సభ్యులందరిలో ప్రతి ఒక్కరిపై మీరు చేసే ఖర్చుతోపాటు, పరమ పూజ్య గురుదేవుల ప్రాణ శక్తిని పోషించడానికి కూడా ఖర్చు చెయ్యాలి. ప్రజలతో సంప్రదింపులు కలిగి ఉండాలి. నెలలో ఒక్కరోజు వేతనం, కుదరకపోతే ఎంత వీలైతే అంత నియమబద్ధంగా శాంతికుంజ్‌కు పంపండి. ఎందుకంటే నవ సృజనంలో పాల్గొంటున్న యుగశిల్పుల నిర్వహణ, దారిఖర్చులు మొదలగు అవసరాలను ఈ అంశదానంతో తీర్చవలసి ఉంటుంది.

మీరు రాతినే జీవనం ఉన్న సాక్షాత్తు 'గిరిధర గోపాలునిగా' భావించారు. రామకృష్ణ పరమహంస యొక్క కాళిమాత తన ప్రత్యక్ష పరిచయాన్ని ఇచ్చింది. ఏకలవ్యునికి ద్రోణాచార్యుడు చమత్కారాన్ని చూపించారు. ప్రాణ దీక్ష తీసుకున్నవారి శ్రద్ధ జీవంతో ఉన్న దానికి ప్రమాణంగా, భావనాత్మక గురుదక్షిణ ద్వారా చెల్లిస్తే నిశ్చయంగానే ఆ అనుగ్రహం లెక్కలేనన్ని రెట్లుఅయి తిరిగి వర్షిస్తుంది. ఆధ్యాత్మిక ప్రగతిలో శ్రద్ధాహీనతే ప్రధానమైన ఆటంకంగా నిలుస్తోంది. దీక్షను స్వీకరించిన వారు ఈ అడ్డును తొలగించుటలో సమర్థులై ఉండాలి.

*– అనువాదం : శ్రీమతి నాగమణి*

## సాధన

*శ్రీరామకృష్ణ పరమహంసను ఒక శిష్యుడు గురుదేవా! మీరు ఇంత గొప్ప సాధకులు కావటానికి కారకులెవరని ప్రశ్నిస్తాడు. సాధనలో పరాజయం పొందిన అనేకమంది సాధకులని రామకృష్ణ పరమహంస బదులు చెప్తారు. అదెలా! అని శిష్యుడు ఆశ్చర్యం వ్యక్తం చేస్తాడు. దీనిలో ఆశ్చర్యం ఏముంది ఇతర సాధకుల లోపాలను గమనించి, ఆ లోపాలు నా సాధనలో జరుగకుండా చూచుకునే వాడిని. ఆ అనుభవం ద్వారా సాధనలో ఎదురైన అవరోధాలన్ని అధిగమించి గమ్యం చేరగలిగాను అని పరమహంస చెప్పారు.*

**ధర్మ సూత్రాలు, ధర్మోపదేశాల పట్ల అంకితభావం కలిగిఉన్నప్పుడే ధార్మిక జీవనం ప్రారంభం అవుతుంది.**



ధారావాహిక : భక్తిగాథ-32

# ఒకమహాతపస్వి రాజభవనానికి వచ్చిభోజనం స్వీకరించడంలోని అంతరార్థం?

భిల్లు కుమారుడైన కలుప్ప భక్తిగాథను విన్న ఋషులూ మొదలైనవారందరూ భావమగ్నులయ్యారు. భక్తిలో సాధనా మరియు సిద్ధి కలసి ఉంటాయి. సాధకుని అస్తిత్వం భక్తిలో కలసిపోతుంది. ఇతర సాధనా పద్ధతులను చేసేవారికి అలసటా, వ్యాకులతా కలుగుతాయి. వారు ఎక్కువ కాలం సాధన చేయలేరు. భక్తుడు తన ఇష్టదైవాన్ని ఆరాధిస్తున్నప్పుడు అతని మనస్సు క్షణక్షణమూ సంతోషాతిరేకంతో పులకించిపోతుంది.

భక్తిభావంలో ఉన్న వీరంతా సమయాన్ని మర్చిపోయారు. నారదులవారు వీణమీటినట్లు మధుర స్వరంతో తమ సూత్రాన్ని ఉచ్చరించారు.

**రాజగృహ భోజనాదిషు తథైవ దృష్ట త్వాత్ (31)**

రాజగృహాల్లో, భోజనాల్లో అలాంటి అనుభవమే కలుగుతుంది.

భక్తి స్వయంగా ఫలస్వరూపమని వివరించిన దేవర్షి భక్తిని రాజగృహంలోని భోజనాలతో పోల్చడం విని వశిష్ఠమహర్షి పెదవులపై చిరునవ్వు తాండవించింది. కొద్ది క్షణాలు వారు ఏవో జ్ఞాపకాలలో మునిగిపోయారు. దేవర్షి వశిష్ఠుల వారిని ఈ సూత్ర కథను గురించిన తత్వం తెలుపవలసిందని అర్థించారు. వశిష్ఠ మహర్షి "నారదా! నీవు ఉచ్చరించిన రాజ గృహమూ, భోజనమూ అన్న మాటలు విన్నప్పుడు నాకు వెనుకటి సంఘటనలు గుర్తుకు వచ్చాయి."

అందరూ ఆ పవిత్ర సంఘటనను గురించి తెలుపమని కోరారు. అప్పుడే హిమాలయాల్లోని జలపాతాల ధ్వనీ, హిమపక్షులు ధ్వనుల వాతావణంలో మధుర సంగీతాన్ని ఆలపించాయి. ఈ భక్తి గాథను వినడానికి ముందుగా ప్రకృతి మంగళాచరణం చేస్తున్నట్లుంది. వశిష్ఠ మహర్షి చెప్పడం ప్రారంభించారు. "నేను చెప్పే విషయం భక్తవరేణ్యుడైన అంబరీషుడు అయోధ్యను పరిపాలిస్తున్ననాటిది. అంబరీషుని భక్తిని గురించీ, అతని విశిష్టమైన గుణాలనూ, వ్యక్తిత్వం గురించీ ఎన్నో పురాణాల్లో వివరించబడింది. ఇప్పుడు నేను చెప్పే విషయం పురాణాల్లో లేనిది.

బ్రహ్మర్షి వశిష్ఠుడు అయోధ్యా నగర రాజులందరికీ మొదట్నుంచీ కులగురువన్న సంగతి అందరికీ తెలిసిందే. స్వయంగా బ్రహ్మదేవుడే వారికి ఇలా నచ్చచెప్పాడు. "పుత్రా! ఇది సామాన్య వంశం కాదు. ఈ వంశంలో అనేకమంది మహనీయులు జన్మిస్తారు. భగవద్భక్తులూ జన్మిస్తారు. వారి భక్తి ప్రభావం చేత స్వయంగా శ్రీమన్నారాయణుడే మర్యాదా పురుషోత్తముని రూపంలో ఈ వంశంలో జన్మించనున్నారు. వీరందరికీ పురోహితుడుగా ఉంటూ మార్గదర్శనం చేయవలసిన భాగ్యం నీకు కలుగుతుంది" అని నచ్చబలికాడు.

వశిష్ఠ మహర్షి భక్తులతో పాటు భగవంతుని సాన్నిధ్యం తనకు లభిస్తుందని తెలిసి రాజవంశ పురోహితునిగా ఉండడానికి సంతోషంతో అంగీకరించాడు. ఈ వంశంలోనే భక్త శ్రేష్ఠుడైన అంబరీషుడు జన్మించి అయోధ్యా నగరానికి రాజయ్యాడు. ఇంత విశాలమైన రాజ్యానికి చక్రవర్తి అయినప్పటికీ ఆయన భక్తి కొంచెం కూడా తగ్గలేదు. నియమంగా ఏకాదశీ వ్రతం చేసేవాడు. ఎడతెగని నిష్ఠతో భగవన్నామస్మరణ చేసేవాడు. నిరంతరం గొప్ప గొప్ప యజ్ఞాలు చేస్తూ యజ్ఞపతియైన నారాయణుని అర్చించేవాడు. తన ప్రియ శిష్యుడైన అంబరీషుని కథను వినిపిస్తున్నందుకు వశిష్ఠులవారి మనస్సు పులకించిపోయింది. అయోధ్యా సామ్రాజ్యంలో మొదటి నుంచి ఏకాదశి వ్రతం అద్భుతంగా జరుపబడేది. అంబరీషుడు చక్రవర్తయ్యాక ఏకాదశి వ్రతం

**సుఖపడలేకపోవడానికి కారణం - ఉన్నదానిపై నిర్లక్ష్యం, లేనిదానికోసం ఆరాటం.**

ఇంకా విశిష్టతను సంతరించుకుంది. మహారాజు ఎంతో దివ్యంగానూ, భవ్యంగానూ ఏకాదశి పారాయణం చేసేవారు.

రాజు చేసే ఈ పారాయణంలో అయోధ్య నగరంలోని ప్రతి ఒక్కరు పాలుపంచుకొనేవారు. తను ఇష్టదైవ మెవరైనప్పటికి నగరంలోని ప్రతి ఒక్కరూ ఈవ్రతం ఆచరించేవారు. వారి వ్రతాచరణలో వారికి తమరాజు పైగల శ్రద్ధాభావం కనపడేది. ఒకరోజున మహారాజు ఏకాదశీ వ్రత పారాయణం చేస్తున్నారు. ఎప్పటిలాగా అయోధ్యా వాసులంతా వచ్చిచేరారు. ఆహ్వానించిన ఋషులందరూ ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. రాజుగారి పరివారం వారికి సాదర సత్కారాలు చేస్తున్నారు.

వచ్చిన ఋషులందరిలో విద్రుమమహర్షి కూడా ఉన్నాడు. వారి తపస్సును గురించిన చర్చ అయోధ్యా నగరమంతా జరుగుతుండేది. ఈ ఋషియొక్క కఠోరతపము ఆశ్చర్యం కలిగించేదిగా ఉండేది. అలౌకికమైన వీరి తపస్సును గురించిన కథను భూలోకంలోని వారేకాక దేవలోకంలోని వారుకూడా చెప్పుకునేవారు. వీరు ఎక్కడికీ వెళ్ళేవారు కాదు. వారీ రోజున ఇక్కడ వచ్చారంటే అందరికీ ఆశ్చర్యమేసింది. మాకు తెలిసినంతలో రాజగృహాలకు రావడం కానీ, ఆహారం తీసుకోవడానికి చేసేవారు కారు. అలాంటిది ఈ రోజున రాజ గృహానికి రావడం పంక్తిలో కూర్చొని భోంచేయడమనేది చాలా ఆశ్చర్యం కలిగించింది. ముఖ్యంగా అంబరీషుడే ఎక్కువగా ఆశ్చర్యపోయాడు. ఇదివరకు చాలాసార్లు అంబరీషుడు విద్రుమ ఋషి కుటీరానికి వెళ్ళాడు. కానీ ఆయన రాజును కలవడానికి కూడా నిరాకరించేవాడు. అలాంటిది ఈ రోజు వారే స్వయంగా వచ్చారు.

చాలా సార్లు అంబరీషుడు వశిష్ఠమహర్షితో అనేవారు "గురుదేవా ! నాకు ఈ భూమి మీద ఉన్న మహర్షులందరి ఆశీర్వాదం లభించింది. ఎందుకో కానీ మహతపస్వి విద్రుమ మహర్షి కృప లభ్యంకాలేదు. నాభక్తితోనే ఏదో లోపముంది. తన తపస్సు చేత లోకాలన్నింటినీ ప్రకాశింపచేసే విద్రుమ మహర్షి నన్ను కలవడానికి కూడా ఇష్టపడడం లేదు." ఈ విధంగా వ్యథ చెందుతున్న అంబరీషునితో వశిష్ఠమహర్షి "విద్రుమ మహర్షి గొప్ప తేజో సంపన్నుడైనప్పటికీ కరుణలేని వాడు కాదు. ఏదో ఒక రోజున వారు నీ వద్దకు తప్పక వస్తారు. వారంత కఠినమైన తపస్సులో లీనమైనప్పటికీ నీ హృదయం నుండి వారు దూరం కాలేరు. వారి కృప మీకు తప్పక లభ్యమౌతుంది. లేదా ఆ విధాత కలిపే విధంగా రచన చేస్తారు అని ఓదార్చేవారు. తపోనిష్ఠుడైన విద్రుమమహర్షి ఈ రోజు మహారాజు యొక్క రాజభవనానికి, ఏకాదశీ వ్రత పారాయణానికి భోజన సమయానికి విచ్చేశారు. వారి రాకలోని అంతర్యం మాత్రం ఎవరికీ అంతుపట్టలేదు.

*అనువాదం : కె. అరవిందమ్మ*

*– అఖండ జ్యోతి – సెప్టెంబర్ 2008*

## భగత్‌సింగ్

*భారతవీర కిశోరం భగత్‌సింగ్ ను ఉరికంబానికి ఎక్కించే రోజు. భగత్‌సింగ్ చురుగ్గా ఆలోచిస్తున్నాడు. ఈ అంతిమక్షణాల్లో ఉల్లాసంగా ఉండాలంటే ఏం చేయాలి? లెనిన్ జీవిత చరిత్రను చదవాలన్న కోరిక కలిగింది. చివరి కోరికగా ఆ పుస్తకాన్ని ఇవ్వమని కోరాడు. తెచ్చి ఇచ్చారు. అటువైపున ఉరిశిక్ష అమలుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇటువైపు భగత్‌సింగ్ పుస్తక పఠనం చేస్తున్నాడు ఏకాగ్రతగా. చివరి అధ్యాయంలో ఉన్నాడు. జైలు అధికారి తీసికొని వెళ్లటానికి వచ్చాడు.*

*"మహాశయా! ఒక్కక్షణం ఆగండి. ఒక విప్లవ కారుడు మరొకవిప్లవకారునితో కలవపోతున్నాడు. ఈ చివరి పేజీ పూర్తిగా చదివి వచ్చేస్తాను. అన్నాడు నిశ్చలంగా.*

*జైలు అధికారి స్తబ్ధుడయ్యాడు. ఉరికంబం ఎక్కబోయే వానికి కూడా ఇంతనిశ్చలత్వమా! ఆ ప్రయత్నంగా అతడి కన్నులు చెమర్చాయి. ఇంతలో పుస్తకాన్ని ఇచ్చివేసి ఉల్లాసంగా ఉరికంబాన్ని కౌగిలించుకున్నాడు భగత్‌సింగ్.*

**మేఘుడి దుఃఖం, సూర్యుని తాపం ఇవి రెండే లోకాన్ని నిలబెట్టే మూలస్థంభాలు.**

ప్రత్యేక వ్యాసం

# మహాకాలుని మహా ప్రయోజనం

## 25-07-2010 గురు పౌర్ణమి సందర్భంగా పరమపూజ్య గురుదేవుల మహాయోజనను మరొక్కసారి మననం చేసుకుంటూ గతంలోనికి తొంగిచూద్దాం.

యుగఋషి పరమపూజ్య గురుదేవులు యుగసంధి కాలాన్ని 12 సంవత్సరాలుగా ప్రకటించారు. 1988-89 నుండి 2000 వరకు అవధిని నిర్ణయించారు. అప్పట్లో అధ్యాత్మ వాదులను, పరిస్థితులను పరిశోధనాదృష్టితో పరికిస్తూ ఉన్న శాస్త్రవేత్తలు కూడా ఈ అవధిని ఒప్పుకోక తప్పలేదు. మంచి విషయంలో ప్రవేశించే ముందు కష్టాలను ఎదుర్కోకతప్పదు. 1999 నుండి 2000 మధ్యలో అణుయుద్ధం, చిన్న చిన్న ప్రళయాలు ఎదుర్కొవాల్సి ఉంటుంది అని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో కూడా సామూహిక కృషి వల్ల సామూహిక ప్రయత్నాలు వల్ల, అన్ని వర్గాల వారు, అన్ని సంప్రదాయాలవారు ఒక్క త్రాటిమీదికి రావడం వల్ల సత్ఫలితాలను పొందడం జరిగింది. ఇప్పుడు నూతన సహస్రాబ్దిలో నూతనయుగం రాబోతూ ఉంది.

ప్రస్తుత ప్రయత్నాల ప్రకారం దేశవిదేశాలలో గాయత్రీ పరివార్ వేలాది కేంద్రాలలో ఆధ్యాత్మిక ఉద్యమం నడిపిస్తూ ఉంది. ఈ ఉద్యమంలో జాతి, వర్గ, సంప్రదాయాల భేదం లేకుండా ఆలోచనా పరులు అందరు భాగస్వాములు అవుతున్నారు. వీరి సంఖ్య నానాటికీ పెరిగిపోతూ వచ్చింది. వీరి సాధనల వల్ల అమోఘమైన శక్తి పెరుగుతూ ఉన్నది. సాధకులు రెండు వర్గాలు. 1. నైష్ఠిక సాధకులు 2. సహకార సాధకులు. వారికి వారి వారి స్థాయిలు నిర్ణయించడం జరిగింది.

సామూహిక సాధన ద్వారా "అందరికీ సద్బుద్ధి, అందరికీ ఉజ్జ్వల భవిష్యత్తు" అన్న ధ్యేయంతో అనేక స్థానాలలో ప్రశిక్షణా శిబిరాలు నడిపించడం జరిగింది. దేశవిదేశాలలో నలుమూలలా ప్రశిక్షణా శిబిరాలను నడిపిస్తూ ప్రచారం కొనసాగింది. ఉద్యమం ఏకముఖంగా కొనసాగడం కోసం సాధనా పద్ధతిని సులభతరం చేయడం జరిగింది. అందువల్ల నూతన సాధకులుగా తయారు కావచ్చు. దేశ, భాష, ప్రాంతాలను అనుసరించి స్థాయిలను ఏర్పాటు చేయడం జరిగింది.

1. క్రొత్తగా ప్రవేశించిన వారు మంత్రాన్నిగాని, ఉపాసనా విధానాన్ని గాని ముందుగా 10 నిమిషాలపాటు పాటించాలి. అందరికీ సద్బుద్ధి లభించాలనీ, ఉజ్జ్వల భవిష్యత్తు కలగాలనీ భగవంతుని ప్రార్థించాలి. ఇవే విషయాలను అవసరమైన భాషలలోనికి అనువాదం చేయాలి. వాటిని అందరికీ పంచాలి. చదువురాని వారి చేత కూడ వారి వారి భాషలో పలికించాలి. ఆ ప్రార్థన

"ఓ ప్రభూ! మాకందరికీ సద్బుద్ధిని ప్రసాదించుము. ఉజ్జ్వల భవిష్యత్తును కలిగించుము. మంచి ఆలోచనలు ఇమ్ము. మా చేత మంచి పనులను చేయించుము." అని చేయాలి. ఈ చిన్న ప్రార్థనను మూడు సార్లు చేయించాలి. దీనితోపాటు ఇష్టదైవాన్ని గాని లేక సూర్య భగవానుని గాని ధ్యానం చేయాలి.

2. ఇష్టదైవాన్ని ఉపాసించేవారు దానికి సంబంధించిన మంత్రాన్ని ఓం నమశ్శివాయ, హరేకృష్ణ-హరేరామ, జయశ్రీకృష్ణ, జయశ్రీరామ్, నమోభగవతే వాసుదేవాయ, ఏదైన కీర్తన, జైన ప్రార్థన, నమాజ్, బైబిల్ ప్రార్థన ఏదికావాలి అనుకుంటే దానిని ఉపాసనలో జోడించుకోవాలి. 10-15 నిమిషాలు నిర్ణయించుకున్న సమయం ప్రకారం ప్రార్థన చేయాలి. మీఇష్ట మంత్రంతో పాటు గాయత్రీ మంత్రాన్ని, దాని భావార్థాన్ని మననం చేసుకోవాలి. రోజూ ఒక మాల జపం చేయడానికి ప్రేరణ పొందాలి.

3. ఎలాంటి సంకోచం లేకుండా గాయత్రీ సాధన చేయదలచుకున్న వారికి చక్కని ప్రశిక్షణ నిచ్చి అభ్యాసం

**నెమలికి పంచెవన్నెల పింఛం - రాజుకు రత్న ఖచిత కిరీటం శత్రువులు.**

చేయించాలి. జపంలో సంఖ్యను లెక్కించడం కన్నా ఉదయిస్తున్న సూర్యుణ్ణి ధ్యానించడంలో ఎక్కువ శ్రద్ధ చూపించాలి. ఈ జపం నియమప్రకారం చెయ్యాలి. దీక్ష తీసుకోనివారు కూడా అనుకూల సమయంలో జపం చేసుకోవచ్చు. ధ్యానం చేయాలి అనుకున్నవారు గురుదేవులను గానీ, హిమాలయ శిఖరాలను గాని ధ్యానంలో నిలుపుకోవచ్చు. పరివార్‌లోని సభ్యులు అందరు కలసి సామూహికంగా చేయాలి అనుకుంటే 15–30 నిమిషాలు కేటాయించడం పెద్ద విషయం ఏమీకాదు. సామూహిక జపం వారంలో ఒకరోజు నిర్ణయించుకుని చేయల్సి ఉంటుంది. ఫలితం మాత్రం రెట్టింపుగా వస్తుంది.

నియమంగా జప సాధన చేసే సాధకులు షట్కర్మలతో ప్రారంభించాలి. సూర్యార్ఘ్యంతో ముగించాలి. ఆదివారంగానీ, గురువారం గాని అస్వాదు వ్రతాన్ని ఆచరించాలి లేదా ఒకపూట భోజనం మానివేయాలి. ప్రతిరోజూ ధర్మఘటంలో ఒక గుప్పెడు బియ్యం 50 పైసలు అన్నదాన – జ్ఞానదానాల కొరకు జమ చేసి ఇవ్వాలి. (పావుకిలో బియ్యం, 1రు).

పైన తెలిపిన నియమాలు సాధారణ సాధకుల కొరకు ఏర్పరచబడ్డాయి. ఇతర సాధకులు శ్రద్ధగా రోజుకు మూడు మాలలు జపం చెయ్యాలి. ఒకటి తమక్షేమం కొరకు, రెండవది కుటుంబం కొరకు, మూడవది సమాజ కల్యాణం కొరకు అని భావించుకోవాలి. ఆదివారం ఫలాహారం (పండ్లు) తీసుకోవాలి. అంటే అల్పాహారంతో ఉపవాసం ఉండాలి. ప్రతిగురువారం అస్వాదు (ఉప్పులేకుండా) భోజనం చెయ్యాలి. సహయోగీ సాధకులు తప్పనిసరిగా ఒకమాల జపం చెయ్యాలి. లేదా 10 నిమిషాలు సామూహిక సాధనలో కూర్చుండి ఉజ్జ్వల భవిష్యత్తుకై ప్రార్థించాలి.

ఈ సమగ్రమైన ఉద్యమం వ్యక్తిగతంగానూ, కుటుంబ పరంగానూ, సామూహికంగానూ భారతదేశంతోపాటు ప్రపంచపు నలుమూలలోనూ, పల్లె పల్లెలోనూ ప్రశిక్షితులైన కార్యకర్తలు ప్రచారం చెయ్యాలి. ఏదైనా నిర్ణయించుకున్న స్థలంలో సామూహిక జపం చెయ్యాలి. దాని వల్ల ఐకమత్యం పెరుగుతుంది. భావనల్లో బలం చేకూరుతుంది. జపంలో శక్తి పుడుతుంది. వసంత పంచమి పర్వం సందర్భంగా సామూహిక సాధనలతో పాటు గ్రామ గ్రామాలలో దీపయజ్ఞాలు నిర్వహించబడాలి. మొదట 24 దీపాలతో ప్రారంభమై, క్రమంగా 240 దీపాలతో ఘనంగా కొనసాగాలి. గ్రామాలలో ప్రారంభమైన ఈ దీపయజ్ఞాలు నగరాలకు ప్రాకిరావాలి. పట్టణాలలో దీప సంఖ్య 2400 వందల వరకు పెరిగి పెరిగి 24000 కు సాగిరావాలి. పెద్ద ఎత్తున పూర్ణాహుతి నిర్వహించబడాలి. పూర్ణాహుతిలో పరిజనులు అధిక సంఖ్యలో పాల్గొనాలి.

యుగపరివర్తనా ఘట్టాన్ని కేవలం కండ్లతో చూడడమే కాదు. ఆ ఘట్టంలో మనవంతు పాత్ర కూడా ఉండాలి. అందుకోసం నిరంతరం కృషి చేయాలి. ఈ విధంగా పాల్గొన్న వారు తమ జీవితాలను ధన్యం చేసుకుంటారు. రాబోయే ప్రళయాన్నుండి ప్రపంచాన్ని రక్షించాలంటే రక్షణ కవచం అయిన గాయత్రీ మంత్రాన్ని పఠించాలి. సమాజ కల్యాణంలోనే మన కల్యాణం ఇమిడి ఉందని మరచిపోరాదు. మహాకాలుడు మధ్యమధ్యలో చిన్న చిన్న తాండవ నృత్యాలు చేస్తూ ఉంటాడు. రాబోయే రోజుల్లో లోభమోహ క్రోధాలను అణిచివేసే నిమిత్తం ప్రళయ నృత్యం చెయ్యక తప్పదు. మరొక్కసారి త్రిపురాసుర సంహారం జరిగి తీరుతుంది. మహాకాలుని జయ జయ నాదాలు చేస్తూ కదనరంగంలో కాలుపెడదాం. విజయాన్ని సాధిద్దాం.

*– అఖండ జ్యోతి – ఫిబ్రవరి 1999*

**శ్రీ కె.వి. వాలయ్య పంతులు**
**బాల సంస్కారశాలల *ఆంధ్రప్రదేశ్***
***రాష్ట్ర కన్వీనరుగా నియమితులయ్యారు.***
***కార్యకర్తలందరూ వీరికి సహాయ,***
***సహకారాలను అందించవలసిందిగా***
***కోరుతున్నాము.***
***ఫోన్ : 9989860217***

పాలలో నీళ్లను వెదికే బదులు వెన్నను వెదకడం నేర్చుకో.



పూజ్య గురుదేవుల అమృతవాణి

# దేవత్వమును వికసింపచేసుకోండి-కాలనేములు కాకండి - 1

గాయత్రీ మంత్రము నాతోపాటు ఉచ్చరించండి

**ఓం భూర్భువః స్వః తత్స వితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్.**

దేవియో ఔర్ భాయియో,

చాలా పురాతనమైన సంఘటన ఇది. రావణాసురుడు సీతను అపహరించుకుని వెళ్ళిపోయిన తరువాత అందరికి వచ్చిన సమస్య ఏమిటంటే దీనిని ఎలా ఎదుర్కోవాలి? రావణాసురుడితో యుద్ధము ఎలా చెయ్యాలి? చాలామంది మనుష్యులున్నారు, రాజులు, మహరాజులు కూడా ఉన్నారు కాని ఎవరికీ రావణాసురిడితో యుద్ధము చేసే సాహసము లేదు. ఎవరు తమ ప్రాణాలను పణంగా పెట్టుకుంటారు? ఎవరు కష్టాలలో ఇరుక్కుంటారు? అందువల్ల ఎవరూ ముందుకు రాలేదు. రాములవారు అడిగారు. ఎవరూ నాకు యుద్ధములో తోడ్పడరా? అప్పుడేమయ్యింది? దేవతందరూ కలిసి ఆలోచించుకుని ఇలా అన్నారు. దైవకార్యములో మనము తప్పక సహాయపడాలి. సుగ్రీవుని సేవలో – హనుమంతుని సేవలో చేరి రావణాసురునితో జరిగే యుద్ధంలో తోడ్పడాలి. అంటే దేవతలు వానరుల రూపం ధరించారు, ఎలుగుబంట్ల రూపం ధరించారు. రావాణాసురుడు ఎక్కడ? కోతులు ఎక్కడ? వీరిరువురికీ ఏ విధమైనా పోలికా లేదు. కానీ వీరు యుద్ధానికి సన్నద్ధులయ్యారు, ఎందువలన? ఎందువల్లనంటే, వీరు దేవతలు కనుక. వీరు దేవతలు కాకపోతే! ఎలుగుబంట్లు, కోతులే అయివుంటే చెట్ల మీద ఆ కొమ్మ మీదకీ, ఈ కొమ్మ మీదకీ ఎగురుతూ ఉండేవారు. పిల్లల్ని పుట్టిస్తూ ఉండేవారు. లేక ఇంకేవో పనులు చేస్తూ ఉండేవారు. కానీ సీతను విడిపించడానికి, రామరాజ్య స్థాపనకు, లంకను ఛిన్నాభిన్నం చేయటం లాంటి పనులు ఎలా చేయగలిగేవారు? కానీ వీరు ఇవి చేశారు. ఈనాడు ఇక్కడ సమావేశమైన మమ్మల్నందరినీ కూడా నాటి కోతులూ, ఎలుగుబంట్ల రూపంలో ఉన్న దేవతల వలే చూస్తున్నాను. ఈనాడు మళ్ళీ అటువంటి చారిత్రాత్మక సంఘటన యొక్క పునరావృత్తి కాబోతోంది. మీరందరూ దేవతలే. ఏకాంతంలో మీరు శాంత మనఃస్థితిలో ఉన్నప్పుడు, ఒంటరిగా ఉన్నప్పుడు, మీ అంతఃకరణంలో చూసుకోండి, మీరు ఎలుగుబంట్లా, కోతులా లేక దేవతలా? నిజానికి మీరు దేవతలే. దేవతలు కాకుండా కష్టకాలంలో ఇంకెవరూ ఆదుకోలేరు. దేవతలే సహాయపడగలరు. మీ అందరితోనూ నేను ఒక్క మాట చెప్పదలచుకున్నాను. అవసరమైనప్పుడు మీరు ఈ మాటలు గుర్తుచేసుకోండి. గురుపూర్ణిమనాడు గురువుగారు మాతో ఇలా అన్నారు. మాలో దేవత కూర్చుని ఉన్నాడు – దేవత విరాజమానమై ఉన్నాడు. దేవతలు ఏ పనైతే చేస్తారో, ఏ పని చెయ్యటానికైతే వారి జీవితాన్ని వినియోగిస్తారో, దేనికొరకైతే వారు పురుషార్థములు చేస్తారో, ఆ పురుషార్థములే మాకు అప్పచెప్పారు. ఈ ఒక్కమాట నేను మీతో చెప్పవలసి ఉన్నది.

రెండవది చెప్పవలసినది ఏమిటంటే, మహాభారతము జరిగినప్పుడు అర్జునుడు ఏమన్నాడంటే, ''మేము పంచపాండవులమే కదా! మరి కౌరవులు వందమంది, అంతేకాక వారి దగ్గర విశాలసేన ఉన్నది. మావద్ద సేన లేదు. ఉంటే ఐదో, యాభైమందో ఉన్నారు. ఇటువంటప్పుడు ఇంక యుద్ధమేమి చెయ్యగలము? తప్పనిసరిగా మేమందరమూ చంపి వేయబడతాము''. అందువల్ల అతడు మళ్ళీ మళ్ళీ యుద్ధము చెయ్యటానికి ఒప్పుకోకుండా ఏమి చెప్పేవాడంటే, మహానుభావా మమ్మల్ని యుద్ధము చెయ్యమనకు. మాకు ఇందులో గెలుపు లభించదు. మీరే చెప్పండి. వీరితో యుద్ధము చేసి మేము సఫలత ఎలా పొందగలము? అప్పుడు భగవంతుడు అతనితో ఇలా అన్నాడు. చూడు అర్జునా! నేను వీరందరినీ ఎప్పుడో చంపేశాను. నీకు అందమైన సింహాసనము ఏర్పరిచాను. మీరు ఐదుగురూ సింహాసనము

**అన్ని యంత్రాలకంటే ఖరీదైన యంత్రం మానవ శరీరం.**

ఎక్కి రాజ్యము చెయ్యటమే మిగిలివున్నది. దీనికొరకు నేను ఇది వరకే చంపేసిన జీవచ్ఛవాలైన కౌరవులను నువ్వు చంపవలసి ఉన్నది. వీరు మృతప్రాయులే. నీవు కేవలం బాణాలు వెయ్యాలి. అదే విధంగా ఈ సంధికాలంలో నా పని నేను పూర్తి చేశాను. యుగాన్ని మార్చడానికి, సంబంధించిన మహాత్మపూర్ణ కార్యాలను నెరవేర్చిన పేరు మాత్రమే మీరు పొందవలసి ఉన్నది. ఎవరిని గెలవాలి? ఎవరితో ఓడాలి? ఎవరితోనూ ఓడవలసిన అవసరము లేదు. ఎవరిమీద గెలవవలసిన అవసరము లేదు. ఎవర్నీ చంపవలసిన పని లేదు. ఏ విధమైన పురుషార్థమూ చెయ్యవలసిన అవసరం లేదు. మీరు విజయులన్న శ్రేయస్సు పొందవలసి ఉన్నది. మీరు ఆ శ్రేయ, సౌభాగ్యాలనే పొందండి. అర్జునుడు దానినే పొందాడు. దానికి ముందు అతను ఎక్కువ వాదిస్తూ, నాకు పెళ్లాం పిల్లలు ఉన్నారు, నా పనిలో నష్టము వస్తుంది, అది జరుగుతుంది, ఇది జరుగుతుంది, నాకు సమయం లేదు అటున్నప్పుడు, కృష్ణుడు విసుగెత్తి ఒకే ఆజ్ఞ ఇచ్చాడు "తస్మాత్ యుద్ధాయ యుజ్జస్వ". యుద్ధం చెయ్యి. లేనిపోని వంకలు పెట్టకు. మరి నాగతి ఏమిటి? అని అడిగినప్పుడు శ్రీకృష్ణుడు అన్నాడు నీ బాధ్యత నేను తీసుకుంటాను, నీవు యుద్ధం చెయ్యి.

**మిత్రులారా, ఈనాడు గురుపూర్ణిమ. మీలోని ప్రతీ దేవత యొక్క బాధ్యత నేను స్వయంగా తీసుకుంటున్నాను.** దేవతలు –ఎలుగుబంట్లు, కోతులుగా దైవకార్యము కొరకు ముందుకు వచ్చినప్పుడు వెనకాతల వారి ఇళ్ళు, పెళ్ళాం పిల్లలు ఉండిపోయారు. కుటుంబం ఉండిపోయింది. భగవంతుడే వారిని చూసుకున్నాడు. మీ ఇంటిని చూసుకోవటానికి నేనున్నాను. వారి బాధ్యత నాది. మీ బాధ్యతలన్నింటినీ నేను స్వీకరిస్తున్నాను. **మీరు నా పనిని చెయ్యండి, నేను మీ పనులను చేసి పెడతాను.** నేను మళ్ళీ మళ్ళీ నీకు నమ్మకంగా చెప్తున్నాను. నేను ఖచ్చితంగా మీ పనులను చేసి పెడతాను. తండ్రి పిల్లవాడి యొక్క ప్రతీ పనిని చేసి పెడతాడు. పిల్లవాడు ఏమి అడిగితే తండ్రి అది ఇస్తాడు. టాఫీ అడిగితే టాఫీ ఇస్తాడు, గిలక అడిగితే గిలక ఇస్తాడు. నీవు చిన్న పిల్లవాడివి కనక ఇవే అడుగుతున్నావు. శాంతికుంజ్‌కి రాగానే ఇవే అడుగుతావు. నాయనలారా! ఇకనుంచి ఏమి చెప్పాలన్నా రాసి ఇచ్చేయండి. రాసినా, చెప్పినా ఒక్కటే. వాటి అన్నింటికి నా జవాబు విని నోట్ చేసుకోండి. ఇళ్ళకి వెళ్ళాక అందరికీ చెప్పండి. ఇరవై నాలుగు పురశ్చరణల ద్వారా సంపాదించిన పుణ్యము, గత మూడు సంవత్సరాల ఏకాంతంలో చేసిన మౌనసాధన ద్వారా ఏకత్రితమైన పుణ్య సంపదలో మన అందరికీ వాటా ఉంటుందని గురుదేవులు ఆశ్వాసన ఇచ్చారు అని చెప్పండి. తల్లి కడుపులోకి బిడ్డరాగానే తండ్రి ఆస్తి మీద అతనికి హక్కు ఏర్పడుతుంది. ఇదే విధంగా నా యొక్క ఆర్జనలో కూడా మీ హక్కు ఉన్నది. **ప్రార్థించవద్దు, నివేదనలు చెయ్యవద్దు, అడుక్కోకండి, వరదానాలు అడుక్కోకండి. మీ హక్కు అడగండి. మేము మీ పని చేస్తున్నాము మీరు మా హక్కు ఇవ్వాలి.** మీకు అనారోగ్యము ఉన్నదా? మీకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయా? నేను మీకు ఆరోగ్యాన్ని ఇస్తాను. నేను వాటిని దూరం చేస్తాను. మీరు దెబ్బలాటలలో ఇరుక్కున్నారా? వాటిలో కూడా నేను మీకు సహాయపడతాను. మీ మీదకు కష్టాలు వస్తే నేను షీల్డ్ అయి (డాలు వలె) వాటిని అడ్డుకుంటాను.

శ్రీకృష్ణుడు, అర్జునుడి రథాన్ని నడిపాడు. నేను మీ రథాన్ని నడుపుతాను. ఏ రథాన్ని? మీ వ్యాపారము యొక్క రథాన్ని, మీ ఉద్యోగము యొక్క రథాన్ని, మీ క్రియాకలాపాల రథాన్ని, మీ శరీరము యొక్క రథాన్ని, మీ ఇంటి–కుటుంబము యొక్క రథాన్ని. ఇది నా వాగ్దానం. కానీ దీనితోపాటు ఇంకో మాట మీకు చెప్తున్నాను. మీరు నా మార్గానికి ఉండి, కలసి పనిచేద్దాం, నా భుజాలతో మీ భుజాలని కలపండి. దీనివల్ల మీరు ఏమి నష్టపోరు. మీరు ఖచ్చితంగా ఇది నమ్మండి. మీకు అడ్డువచ్చే వాళ్ళని నేను ఎప్పుడో తొలగించేశాను. మీ కొరకు విజయాల మాల తయారుగా వుంచాను. పంచ పాండవులకు కూడా ఈ విధంగానే విజయమాలలు తయారుగా ఉంచబడినవి. కేవలము వారు మెడలో వేసుకోవటమే తరువాయి. అదేవిధంగా మీకు కూడా మాలలు తయారుగా ఉన్నాయి. మీరు వాటిని వేసుకుని శ్రేయసౌభాగ్యాలు పొందటమే తరువాయి. రాబోయే ఈ నవయుగ క్రమములో మీరు భాగస్వాములైతే పేరు మీకే

ప్రపంచం పర్వత గుహలాంటిది - మనం వేసే ప్రతికేకా తిరిగి వినిపిస్తుంది.

లభిస్తుంది. అయితే గురుజీ! మా పెళ్ళాం పిల్లల సంగతి ఏమిటి? నాయానా! అది నా బాధ్యత. వారికి ఆరోగ్యం బాగాలేకపోతే, నేను వారికి ఆరోగ్యాన్ని ఇస్తాను. వ్యాపారంలో నష్టం వస్తే ఆ నష్టాన్ని నేను పూర్తి చేస్తానని గ్యారంటీ ఇస్తున్నాను. నీ వ్యాపారంలో వచ్చే నష్టాన్ని నీవు ఇప్పుడే, శాంతికుంజ్ నుండే వసూలు చేసుకోదలుచుకుంటే సరే. కాని పిల్లవాడు పెరిగి పెద్దవాడైతే వాడికి పెద్ద బాధ్యతలు ఇవ్వబడతాయి. చిన్నవాడికి అవి ఇవ్వబడవు. ఇప్పుడు మీరు యువకులు. ఇప్పుడు నాకు ఎవ్వరూ పిల్లల వలె కనిపించటం లేదు. అందరూ యువావస్థకి చేరుకున్నారు. ఇప్పుడు నేను మీ అందరికీ తగిన పని ఇస్తాను. అంతేకాక నా దగ్గర ఏమి మిగిలి ఉన్నదో అంతా మీకు పంచేస్తాను. కానీ గురువుగారు! మీరు వెళ్ళిపోతున్నప్పుడు మీ ఆర్జనంతా మీతో తీసుకెళ్ళిపోతారా? నాయనా! నేను అది చెయ్యను. మీరు ఖచ్చితంగా విశ్వసించండి, నా సంపాదనంతా మీకు ఇచ్చి వెళ్తాను. ఆ సంపాదన పుణ్యమైనది కావచ్చు. సంసారికమైనది కావచ్చు లేక ఆధ్యాత్మికమైనది కావచ్చు. అన్ని సంపాదనల్లోనూ మీకు భాగముంటుంది.

మిత్రులారా, నేను జీవితమంతా ఇస్తూనే ఉన్నాను. తాతముత్తాతల నుండి రెండువేల భీగా (ఎకరాలు) భూమి లభించింది. అదంతా ఇచ్చేశాను. నాభార్య నగలన్నీ కూడా దానం ఇచ్చేశాను. పిల్లల కిడ్డీ బ్యాంకులో డబ్బు కూడా నేను ఇచ్చేశాను. ఇంక ఇప్పుడు మీ దగ్గర ఇంకా ఏదైనా ధనము ఉన్నదా అని మీరు అడగవచ్చు? లేదు నాయనా, ధనము పేరిట ఒక్క నయాపైసాలోని లక్షవ వంతు కూడా నా దగ్గరలేదు. గురువుగారి దగ్గర ఏముంది అని మీరు వెతకదలచుకుంటే లేక చనిపోయిన తరువాత తెల్సుకోదలుచుకంటే మీకు శాంతికుంజ్‌లో ఒక ఋషి ఉండేవాడని, అక్కడ రొట్టెలు తింటూ రోజల్లా ఇరవై నాలుగు గంటలు పని చేసేవాడని తెలుస్తుంది. నాయనా! ధనము పేరిట నావద్ద ఏమీ లేదు, అయినా నావద్ద సంపత్తి ఉన్నది, అదే నా దగ్గర లేకపోతే నేను ఇంత పెద్ద పెద్ద మాటలు ఎందుకంటాను? **మొదటిది తపస్సు అనే సంపత్తి.** దేనినైతే సామాన్య స్థాయిదని చెప్తావో, దానిద్వారా నేను మీ కష్టాలను, ఆపదలను నివారించగలుగుతున్నాను. **రెండవ సంపత్తి ద్వారా నేను మిమ్మల్నందర్నీ విశ్వనేతలుగా తయారు చేయదలిచాను.** భగవంతుడు నన్ను నేతగా పంపించాడు. చాణక్యుడిని నేతగానే పంపించాడు. వినోబాని కూడా నేతగానే పంపించాడు. నేను కూడా మీలో ప్రతిఒక్కరినీ నేతగా మార్చదలచుకున్నాను. నేతలుగా తయారుచేయటమే నా కోరిక. మీ కోరికలు ఏమిటో అవి నాకు తెలియవచ్చు లేక తెలియకపోవచ్చు. అందువల్లన వాటిని రాసి ఇచ్చేయండి. నాకు రోజువారి క్రమమున్నది. నేను కూర్చున్నప్పుడు మీరు రాసి ఇచ్చినవన్నీ చూసుకుంటూ వుంటాను. రాత్రి క్రమములో పూజా-ఉపాసన చేసుకుంటాను. పొద్దున నుంచి మధ్యాహ్నం వరకు రాబోయే ఇరవై సంవత్సరాల వరకు అఖండ జ్యోతి నిరంతరము వచ్చేటట్లుగా రచనలు వ్రాసుకుంటూ ఉంటాను. ఇరవై సంవత్సరాల వరకు నేను వ్రాసిన వ్యాసాలు మరియు వ్రాయదలచిన పుస్తకాలన్నీ నేను వ్రాసివుంచుతాను. ఈ యుగసంధి సమాప్తమై రెండువేల సంవత్సరం వచ్చినప్పటికి మీకు ఏమి అనుభవంలోకి వస్తుందంటే, గురువుగారు వ్రాసి ఉంచిన రచనల ధోరణిలో ఏమీ తేడా రాలేదు, ఆయన వాణిలో ఏ మార్పు రాలేదు, ఆయన అక్షరాలలో ఏ తేడా రాలేదు. ఆయన పుస్తకాలలో కాని, పత్రికలలో కాని ఏ మార్పు లేదు. మిషన్‌లో ఏ తేడా రాలేదు, రాదు కూడా. మధ్యాహ్నం తరువాత నేను వచ్చినవాళ్ళతో కలిసే కార్యక్రమం కూడా ఈ మధ్యనే మొదలుపెట్టాను. ఐదునుండి ఇరవైఐదుమంది దాకా వ్యక్తులను ఒక సమూహంగా పైకి పిలిపించుకుంటున్నాను కూడా. ఇది మధ్యాహ్నం నుండీ సాయంత్రం వరకు నా కార్యక్రమం. మీరు ఇక్కడికి వచ్చినప్పుడు చాలా ముఖ్యమైన పని ఉంటే ఈ విధంగా నన్ను కలవవచ్చు. ప్రాపంచికమైన ఇబ్బందులు ఉంటే మాతాజీని కలవండి. వీటి బాధ్యత నేను మాతాజీకి అప్పచెప్పాను. ప్రపంచంలో మీకు ఉన్న కష్టాలన్నీ మాతాజీకి చెప్పకోండి. ఆధ్యాత్మికమైన విషయము లేక కొంచెం పైకి లేవాలని, సమాజము కొరకు ఏదైనా పెద్ద అడుగు వేయదలచుకుంటే నా దగ్గరకు రండి. పెద్ద అడుగు వేయదలచుకోలేదు, మాబాధల గురించి మాత్రమే చెప్పదలచుకుంటే మాతాజీతో చెప్పండి. మీరు పెద్ద అడుగు

**పాముకన్నా ప్రమాద కరం - పరుల ధనం.**

వెయ్యటానికి నేను సహాయపడతాను. ఈ ప్రపంచంలో నేను పెద్ద పెద్ద అడుగులు వేశాను, మిమ్మల్ని కూడా పెద్ద పెద్ద అడుగులు వెయ్యమని చెప్తున్నాను. ఈ రెండు విషయాలు మీరు గుర్తుంచుకోండి.

ఇంకొక మాట, నా మాటలకు సాక్ష్యముగా విశ్వములోని అతి పెద్ద భవిష్యవక్త వందల సంవత్సరాల క్రిందటి చెప్పిన మాటలు చెప్తున్నాను. ప్రపంచంలో చేతులు చూసి చెప్పే భవిష్యవక్తలు చాలామంది ఉన్నారు. వారు నీ పెళ్ళి ఎప్పుడౌతుంది, నీకు డబ్బులు ఎప్పుడు అందుతాయి, ఎప్పుడు ఏమవుతుందో, ఎలా అవుతుందో చెప్తుంటారు. ఇదేవిధంగా జాతకాలు రాసేవారు కూడా చాలామంది ఉంటారు. కానీ, ప్రపంచం యొక్క రాజనీతి గురించి భవిష్యవాణి చెప్పగలిగిన ఒకే ఒక వ్యక్తి ఉన్నాడు. ఇప్పటికి ఆయన యొక్క ఎనిమిది వందల భవిష్యవాణులు నిజమయ్యాయి. సుమారు వెయ్యి సంవత్సరాల క్రిందట ఆయన జన్మించాడు. ఆయన పేరు నోస్ట్రడామస్. ఆయన చెప్పిన భవిష్యవాణులన్నీ నూటికి నూరుపాళ్ళు నిజమయ్యాయి. నోస్ట్రడామస్ పుట్టినప్పుడు బ్రిటన్ అన్నది లేనే లేదు. స్కాట్‌లాండ్ ఉండేది. ఐర్లాండ్ ఉండేది. ఇంగ్లాండ్ ఉండేది కానీ బ్రిటన్ లేదు. కానీ ఆయన తన భవిష్యవాణిలో బ్రిటన్ ఏర్పడుతుందనీ, ఇన్ని రోజులు రాజ్యం చేస్తుందని, మరియు 1942వ సంవత్సరంలో దీని సామ్రాజ్య పతనము మొదలవుతుందని, అప్పుడు దీనిలో విస్తరింపబడి ఉన్న రాజ్యమండలమంతా నష్టమవుతుందని చెప్పాడు. ఇవన్నీ అక్షరసత్యాతే కదా? ఇది ఉదాహరణకి మాత్రమే చెప్పాను. అతని ఇటువంటి భవిష్యవాణులన్నీ కవితలుగా ఒక పుస్తక రూపంలో అచ్చువేయబడినవి. ఫ్రాన్స్ రాష్ట్రపతి ఫ్రాంకోయిస్ మిటరాండ్ (1981–1995) గారు ఈ పుస్తకాన్ని తన తల దగ్గర పెట్టుకుని పడుకునేవారు. కవితలుగా ఉన్న ఈ పుస్తకం మీద వేలాదిమంది వివరణలు వ్రాసారు. ఆయన హిందూస్థాన్ గురించి చెప్పిన భవిష్యవాణులు మీరు రానున్న అఖండజ్యోతి పత్రికలో చదవబోతున్నారు. ఆయన భవిష్యవాణి ఏమిటంటే హిందూస్థాన్ యొక్క ఆధ్యాత్మము మరియు పాశ్చాత్యుల తత్త్వ విజ్ఞానము ఇవి రెండు కలసిపోతాయి. పాశ్చాత్యుల భౌతిక విజ్ఞానము మురియు మన యొక్క ఆధ్యాత్మికత కలిసిపోతాయి. రష్యా హిందూస్థాన్ కలిసిపోతాయి. చైనా, అమెరికాల మధ్య యుద్ధం జరుగుతుంది మొదలగు అనేక భవిష్యవాణులు ఉన్నాయి. ఇన్ని భవిష్యవాణులలో మీకు ఉపయోగపడేది ఒక్కటే. హిందుస్థాన్ నేడు అమెరికా చేస్తున్నట్టు విశ్వనేతృత్వం వహిస్తుంది. అమెరికా బాంబులు తయారు చేసుకున్నా, ఛాలెంజర్స్ తయారు చేసుకున్నా, స్టార్–వార్‌ల ప్రణాళికలు వేసుకున్నా, **భవిష్యత్తులో భారతదేశమే విశ్వ నేతృత్వము వహిస్తుంది. గొప్ప శూరవీరులు, యుద్ధము చేయగలిగేవారు కావాలి. గొప్ప ఇంజనీర్లు కావాలి. గొప్ప గొప్ప సామర్థ్యము గల వ్యక్తులు కావాలి. దీనికొరకే నా ప్రయత్నాలన్నీ. నాయనా, నీలో యోగ్యత లేకపోతే దానిని నేను ఇస్తాను. నీ పొలాలు గట్రాల బాధ్యతలు మాత్రమే నేను తీసుకోవటం లేదు. నీవు విశ్వనేతృత్వం వహించటానికి సామర్థ్యం కూడా నేను ఇస్తాను.**

★★★

## శ్రీ గాయత్రి శతకం

29. లక్షమారుల లక్ష్యమున్ లక్షణముగ
పఠన మొనరింప మంత్రమున్ భక్తితోడ
త్రుంచు నధికార జనితమౌ దోషములను
విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత

*తా:* – లక్షమారులు లక్ష్యంగా పెట్టుకుని సలక్షణంగా గాయత్రీ మంత్రమును మననం చేస్తే అధికార అహంకారం వల్ల నీవు చేసిన తప్పుల్ని సరిదిద్ది నిన్ను మంచి అధికారిగా నిలుపుతుంది గాయత్రీ మాత.

30. మంత్ర మహిమను నమ్ముచూ మదిని నింపి
ఆలపించగ పాతికవేల మార్లు
సర్వరోగాలు హరియించు సత్వరంబు
విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత

*తా:* – గాయత్రీ మంత్రాన్ని పరిపూర్ణంగా విశ్వసించి మదిలో నిలుపుకుని ఇరవై అయిదువేల మార్లు ఆలపిస్తే వెంటనే సర్వరోగాలను పోగొట్టి ఉపశమనాన్ని ఇస్తుంది వేదమాత.

రచన

సహజ కవి, సాహిత్య రత్న,
శతక చతురానన, పద్య కవితాసుధానిధి
శ్రీ అయినాల మల్లేశ్వర రావు

**వేదం చదివి బ్రాహ్మణుడు, కాచి కమ్మరి, ఉతికి చాకలి అవుతారు-పుట్టుకతో కాదు.**

వైజ్ఞానిక ఆధ్యాత్మికత

# శక్తియొక్క చేతన స్వరూపాల అనుభూతి

వైజ్ఞానిక ఆధ్యాత్మికత యొక్క అధ్యయన కర్త ఋషి కన్య వాక్ కౌసుకీ నదీ తీరమున సంధ్యావందనం చేస్తున్నది. సంధ్యాకాలం అయింది కాని ఇంకా చీకటి పడలేదు. సూర్య భగవానుడు పృధ్వి యొక్క పశ్చిమ గోళార్థమున తన ప్రకాశమును విరజిమ్మడానికి వెళ్తున్నాడు. ఆకాశంలో ఉన్న చిన్న చిన్న మేఘాల మధ్యనుంచి అస్తమిస్తున్న సూర్యుని ఎర్రకిరణాలు క్రింద పడుతున్నాయి. కౌసుకీ నది కెరటాల గాలి కొంచెం సేపు నెమ్మదిగా ఒక్కొక్కసారి వేగముగా వీస్తున్నది. చుట్టుప్రక్కల ఉన్న పర్వతముల చిన్న పెద్ద శిఖరాలు సహజమైన గోడల్లాగా ఉన్నాయి. అక్కడ ఉన్న వృక్షములు అటుఇటూ ఊగుతూ ఆనందిస్తున్నాయి. ఋషికన్య వాక్ ఇరువైనాలుగు అక్షరముల గాయత్రీ మంత్రమును మననం చేసుకుంటూ, ఆదిశక్తి యొక్క మూల స్వరూపమును, ఇతర రూపములలో దాని యొక్క వ్యక్తీకరణ గురించి అనుసంధానం (రిసర్చి) చేస్తున్నది. ఆమె ధ్యానం బాహ్యప్రకృతి యొక్క దృశ్యములపై లేనే లేదు.

ఆకాశంలో మేఘాలు బాగా కమ్ముకున్నాయి. గాలి కూడా తీవ్రమయింది. కౌసుకీనదీ వేగంగా ప్రవహిస్తున్నది. గాయత్రీ మంత్రార్థమును వివేచన చేసుకుంటూ మంత్ర జపం పూర్తి అయిన తరువాత సూర్యోపాసన గావించింది. సాధనా కార్యక్రమం పూర్తిచేసుకుని వాక్ లేచినిలబడినపుడు ఆకాశంలో ఆవరించి ఉన్న మేఘాలపై, కౌసుకీ నదీ ప్రవాహ వేగంపై, బలంగా వీస్తున్న గాలిపై ఆమె ధ్యానం పడింది. ఆ క్షణములోనే ఆకాశంలో మేఘాల గర్జనతో పాటు ఆకాశంలో విద్యుత్ కాంతులు మెరుస్తున్నాయి. ఎలా ఉన్నదంటే మహరుద్రుడు ధర్మమును ద్వేషించే అసురుల సంహారం కొరకు ధనస్సుపై బాణం సంధించిన ధ్వని వలె ఉన్నది. ఆమె ఆ దృశ్యాన్ని వింతగా అబ్బురంగా చూస్తున్నది.

ఈ దృశ్యాలు ప్రక్కకు పోయి అనేక ప్రశ్నలు ఆమె మనస్సులో ఉత్పన్నమయ్యాయి. మేఘ ఉరుముల రహస్యం ఏమిటి? విద్యుత్‌లో వెలుగు, ధ్వని ఎక్కడ నుండి వస్తాయి? నదీ ప్రవాహంలో, గాలిలో తీవ్రమైన వేగం ఎవరు ఉత్పన్నం చేస్తారు? ఈ రకమైన ప్రశ్నలు ఆమె మనోకాశం నందు బాహ్య ఆకాశంలో మేఘములవలె ముసురుకున్నాయి. ఇంతలో వర్షం పడడం మొదలయ్యింది. ఆమె ఆశ్రమం దగ్గరలోనే ఉన్నది. దానిలో ఆమె (వాక్), ఆమె తండ్రి అభృణ్ మహర్షి నివసిస్తారు. పురిటిలోనే తల్లి దేహాన్ని చాలించింది. తండ్రే తల్లికూడా అయ్యాడు. పుట్టినప్పటి నుండి ఇప్పటివరకు అభృన్ మహర్షి తల్లిదండ్రుల బాధ్యతలను నిర్వహిస్తున్నాడు. దీనితోపాటు గురువు పాత్ర కూడా పోషిస్తున్నాడు. తండ్రికి తగిన పుత్రిక ఆమె. తపశ్చర్యతో శ్రేష్ఠమైన సంస్కారములలో, సదాచరణలో, సేవలో, పరిశ్రమలో, విద్యాభ్యాసంలో వాక్‌ను అనేకులు ఆదర్శంగా స్వీకరించారు. గురుకులములలో ఆచార్యులు మార్గదర్శకులు తమ శిష్యులకు వాక్‌ను అనుసరించమని చెప్పుండేవారు. ఋషి కన్యలకు వారి తల్లితండ్రులు వాక్ వలె ఉండమని చెప్పుండేవారు.

వాక్ ఆశ్రమ పరిసరములోకి వెళ్ళగానే ఆశ్రమ ద్వారంలో నిలబడి ఉన్న తండ్రి అభృణ్ మహర్షిని చూచింది. మహర్షి తన కుమార్తె కొంచం అలసిపోయిందని, ఏదో ఆలోచించడం గమనించాడు. అంతర్‌జ్ఞాని అయిన ఆయనకు ఆమె సమస్య అర్థం కావడానికి ఒక క్షణం పట్టలేదు. ప్రశ్నల బరువు వల్ల అలసిపోయిందని అర్థమయింది. మహర్షి ఆమె నుదిటిని తాకుతూ ఇలా అన్నాడు "పుత్రీ! నువ్వు తడిసిపోయావు. ముందు బట్టలు మార్చుకుని వేడిగా ఏదైనా త్రాగు. తరువాత మనం మాట్లాడుకుందాం" వాక్ కొంచం సేపట్లోనే తండ్రి నిర్దేశాలను పాటించింది. తరువాత వారిద్దరు గ్రంథాలయంలోనికి వెళ్ళారు. అక్కడ ఆర్ష సాహిత్యంతో పాటు లౌకిక సాహిత్యం కూడా మెండుగా ఉన్నది. తండ్రి కూతురు ఎదురెదురుగా కూర్చున్నారు. అభృణ్ మహర్షి నవ్వుతూ ఇలా అన్నారు "నీ అన్ని ప్రశ్నలకు సమాధానం ఒకే శబ్దంలో ఉన్నది –శక్తి. దీనిని ఊర్జా అని కూడా అంటారు. ఇది సక్రియంగా నిష్క్రియంగా రెండు రకాలుగా ఉంటుంది.

నిష్క్రియశక్తిని సక్రియంగా చేసేందుకు వైజ్ఞానిక, ఆధ్యాత్మిక పద్ధతులున్నాయి. చాలా జాగ్రత్తగా విను. సృష్టి మొత్తంలో శక్తి

**కలసి మెలసి జీవించడం బలం - కలియబడడం బలహీనం.**

విహీనమైన కణం గాని బిందువుగాని లేదు. వివిధ రూపములలో ఉన్న పదార్థములు జడముగా, శక్తి విహీనంగా కనిపించినప్పటికి లోపల అణుబల రూపంలో క్రియాశీలంగా ఉంటుంది. ఇదే కాంతి, వేడి, ధ్వని, విద్యుత్, అయస్కాంత, వాయు, జలవిద్యుత్, సౌరశక్తి అనే రకరకాల రూపాలలో కనుపిస్తుంది. పరమాణు నాభి కేంద్రంలో కూడా ప్రచండమైన శక్తి విస్ఫోటక రూపంలో ఉన్నది. ఈ శక్తి గొప్పదనం ఏమిటంటే దీనికి నాశనం లేదు.

ఋషికన్య వాక్ తండ్రి వివరిస్తున్న విషయములను జాగ్రత్తగా వింటున్నది. ఆయన స్నేహపూర్ణ స్వరంతో ఇలా అంటున్నారు. "ఇప్పుడు నేను శక్తి (ఊర్జా) యొక్క జడరూపముల గురించి చర్చిస్తున్నాను. ఈ భౌతిక శక్తుల వంటివే సూక్ష్మం చైతన్య వంతమైన శక్తులు కూడా ఉన్నాయి. పుత్రీ! నేను ఆధ్యాత్మ విజ్ఞానం యొక్క రహస్యం చెబుతున్నాను. దీనిని పదార్థ విజ్ఞాని ఎన్నడూ తెలుసుకోలేదు. పదార్థముల విభజన వల్ల కణముల సృష్టి, కణముల విఖండన వల్ల బహిర్గతం అయ్యే శక్తి గురించి అందరికి తెలిసినదే. కాని జడశక్తి అంతరాళాలలో ఒక క్రమ పద్ధతిలో చేతనత్వ శక్తి యొక్క ఉచ్ఛస్తర ఆయామమున్నది (డైమన్షన్). దీనిని నూటికి కోటికి ఒక్కడు మాత్రమే తెలుసుకోగలుగుతాడు. జడశక్తి యొక్క విఖండన, విభజనతోనే ఇది సాధ్యము. దీనిని ప్రాణశక్తి అంటారు. ప్రాణశక్తి యొక్క వివిధ రూపములు మానసిక శక్తి, భావశక్తి, ఆత్మశక్తి ఈ క్రమములో బహిర్గతమవుతాయి. ఆంతరిక అస్థిత్వంలో దీనిని కుండలిని జాగరణ, దాని ఊర్ధ్వారోహణ క్రమంలో తెలుసుకోవచ్చు. బాహ్య జగత్తులో దీని బహిర్గతం, అనుభూతి విధానములు బహు ఆయాయముల (మల్టీ డైమన్షనల్) సృష్టి చేయగల సామర్థ్యం గలది. దీనిని నూటికో కోటికో ఒకడు తెలుసుకోగలుగుతాడు.

సామర్థ్యం, బలం అంటే ఏమిటి? ఆ ఋషికన్య తండ్రిని కోమల స్వరంతో ప్రశ్నించింది. తండ్రి జవాబు ఇచ్చాడు. "సామర్థ్యం అన్నా, బలం అన్నా శక్తి యొక్క ఆవిర్భావమే. జడపదార్థములకు, చేతనత్వములకు అన్నింటికి ప్రకృతి భగవతి ఆద్యశక్తి ఈ సామర్థ్యాన్ని ఇచ్చింది. తన అణుసంబంధమైన పదార్థములకు, జీవముల అవసరాన్ని బట్టి ఈ సామర్థ్యమును ఎక్కువగానో, తక్కువగానో ఇచ్చింది. వైజ్ఞానిక పద్ధతుల ద్వారా లేక ఆధ్యాత్మిక ప్రక్రియల ద్వారా ఈ సామర్థ్యమును పెంచుకోవచ్చు. అంతేగాక దీనిని వివిధ రకాలుగా ఉపయోగించుకోవచ్చు. ఏ విధంగా అయితే విద్యుచ్ఛక్తిని, వాయుశక్తిని, అణుశక్తిని ప్రయోగించడం జరుగుతుందో, అదే విధంగా వివిధ ఆధ్యాత్మిక ప్రక్రియల ద్వారా ప్రాణబలం, మనోబలం, ఆత్మబలం మొదలైనవి ప్రయోగించి అనేక చమత్కారాలు సాధించవచ్చు. శక్తి యొక్క జడచేతన స్వరూపాలు, వాటి సామర్థ్య అవగాహన కొరకు బహు ఆయామముల (మల్టీ డైమన్క్షన్) సాధన అనివార్యమవుతుంది."

తండ్రి అభృణ్ మహర్షి కథనం సుకోమల పదహారు సంవత్సరాల కన్య వాక్‌లో ఒక మహా సంకల్పం అయింది. ఆమె కౌసుకీ నదీ తీరాన మహాతపస్సు చేయటానికి నిశ్చయించుకున్నది. అత్యంత కఠినమైన తపస్సు ప్రభావమున ఆమెలో అనేక శక్తుల కొత్త కొత్త గవాక్షములు (కిటికీలు) తెలుచుకున్నాయి. విరాట్ బ్రహ్మాండములో వ్యాపించిన, తన వ్యక్తిత్వంలో వ్యాపించిన ఆ శక్తి యొక్క వివిధ ఆయామములను (డైమన్షన్స్) సాక్షాత్కరించు కున్నది. శక్తియొక్క అన్ని పొరాలు, ఆయామములను దాటి ఆదిశక్తి యొక్క మూల మహిమామయమైన ప్రభావమును గ్రహించి, తదనుసారం రూపం పొంది లేచి నిలబడి ఇలా అన్నది **"ఓం అహం రుద్రేభిర్వసు - భిశ్చరాభ్యహ మాదిత్యై రూత"** నేను సచ్చిదానంత సర్వాత్మశక్తి రుద్ర, వసు, ఆదిత్య, విశ్వదేవగణముల రూపంలో చరిస్తాను. ఋగ్వేద సంహిత దశమ మండలంలోని 125వ సూక్తంలో దైవీసూక్తం అనే పేరుతో ఎనిమిది మంత్రాలున్నాయి. ఆ మంత్రాలలో వర్ణించిన అనుభూతియే నేను పొందినది. వాక్ యొక్క వైజ్ఞానిక ఆధ్యాత్మికత అనుసంధానం (రిసర్చి) అనేక యుగముల తరువాత బుద్ధ భగవానుని ధర్మచక్ర ప్రవర్తనలో తిరిగి చోటుచేసుకున్నది.

*– అఖండ జ్యోతి జులై 2009*

**యుగశక్తి గాయత్రి**
**మాస పత్రిక చదవండి !**
**చదివించండి !!**

**సూర్యుడు తన తాపాన్ని చూపనిదే పిందెలతో ఉన్న చెట్లు పంటకురావు.**

జీవించే కళ

# గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి

పదిమందిలో గౌరవం లభించాలని సాధారణంగా అందరూ కోరుకుంటారు. అవమానాన్ని కోరుకునేవారు కాగడా బెట్టి వెదికినా దొరకరు. కోరికైతే అందరికీ ఉంటుంది. కానీ దాని వాస్తవ రూపాన్ని తెలిసినవారు కొందరే. చాలామంది కోరికలు అనే మృగతృష్ణలో తిరిగి తిరిగి నిరాశగానే మిగిలిపోతారు. వాస్తవాలకూ, నకిలీలకూ తేడా తెలియక ఒక్కొక్కసారి మోసంలో చిక్కుకుంటారు.

ప్రాచీన కాలపు రాజుల వంశాలలో పదవులకోసం, పేరు కోసం ఎన్నెన్నో కుతంత్రాలు పన్నేవారు. రాజకీయంలో నేటికీ అదే పరిస్థితి ఉంది. అన్నింటికీ మూలకారణం పేరు ప్రతిష్ఠలు పొందాలన్న ఆకాంక్షయే. నిజమైన గౌరవాన్ని పొందాలంటే కర్తవ్యాన్ని పాటిస్తూ, ధర్మనిరతిగా జీవిస్తూ ఉంటే పేరు ప్రతిష్ఠలు వాటంతట అవే వచ్చి చేరుతాయి. అలాంటివారు చరిత్రలో కోకొల్లలుగా ఉన్నారు. వారు ఈ లోకాన్ని విడిచిపోయినా, వారి కీర్తి ప్రతిష్ఠలు మన మనస్సులను అంటిపెట్టుకునే ఉన్నాయి.

ఇలాంటికోవకు చెందిన ఒక వ్యక్తి నిరంతర సేవా కార్యక్రమాలలో నిమగ్నమై సామాన్య జనులకు వైద్య సేవలు అందించాలి అనుకున్నాడు. అందుకోసం ఒక హాస్పటల్ ప్రారంభించాడు. తనకు సహాయంగా ఒక కాంపౌండర్‌ను పెట్టుకున్నాడు. ఇద్దరూ కలసి ఎంతో ప్రేమతో సేవలు అందిస్తూ ఉన్నారు. అనేకమంది పేదవారు లబ్ధిపొందుతున్నారు.

ఒకనాడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి హాస్పటలుకు వచ్చాడు. గాయాలు తీవ్రంగానే తగిలాయి. కాంపౌండర్ అతనికి గాయాలు శుభ్రం చేసి కట్టుకడుతున్నాడు. డాక్టరుగారు రోగులను పరిశీలిస్తున్నారు. ఇంతలో డాక్టరు గారి కొడుకు కాలివ్రేలికి గాయం అయిందంటూ వచ్చాడు. కాంపౌండర్ కొద్దిసేపు ఆగాలని చెప్పాడు. చేతిలో పనికాగానే కట్టుకడతాను అక్కడ కూర్చోమన్నాడు. ఆ బాలునికి చాలా కోపం వచ్చింది. నేను డాక్టరుగారి కొడుకును కదా! అన్న అహంకారం రెక్కలు విప్పింది. ఏమాత్రం ఆలోచించకుండా కాంపౌండర్ చెంప చెళ్ళుమనిపించాడు. అంతేగాక "హాస్పటల్ మాది. నన్నే నిర్లక్ష్యం చేస్తావా? బుద్ధి లేదా?" అని అరిచాడు. ఈలోగా కాంపౌండర్ తన పనిని పూర్తిచేసుకున్నాడు. ఆ అబ్బాయిని క్షమాపణ కోరాడు. గాయం శుభ్రం చేసి, కట్టుకట్టి పంపించాడు.

సాయంకాలానికల్లా ఈ విషయం ఆ నోటా ఆ నోటా పడి డాక్టరు గారిని చేరింది. ఆయన కొడుకును ఒక్క మాటకూడ అనలేదు. కాంపౌండర్ దగ్గరకు వచ్చి క్షమాపణ కోరాడు. ప్రాయశ్చిత్తంగా పెయింటరుని పిలిపించి, బయట ఉన్న సైనుబోర్డు మీద తన పేరును చెరిపించి కాంపౌండర్ పేరును వ్రాయించాడు. ఇదంతా ఆ బాలుడు చూస్తూనే ఉన్నాడు. అతనిలో పడగవిప్పిన అహంకారం కరిగిపోయింది. కళ్ళవెంట అశ్రుధారలు ప్రవహించడం మొదలుపెట్టాయి. తండ్రి దగ్గరకు వెళ్ళి క్షమాపణ కోరాడు. తండ్రి కాంపౌండర్‌కు క్షమాపణలు చెప్పించాడు. చిన్న విషయానికి కూడా అహంకారం పెంచుకోరాదనీ, గౌరవం అనేది ఇచ్చి పుచ్చుకునే అంశమనీ కుమారునికి నచ్చ చెప్పాడు.

ఈవిధంగా గౌరవం యొక్క విలువను తెలుసుకుని, దానికి అనుగుణంగా జీవించిన వ్యక్తి ఎవరో కాదు, మనదేశంలో ప్రఖ్యాతి గాంచిన లాలాలజపతిరాయ్. తరువాత ఆయన భారత స్వాతంత్ర్య సమరంలో ఎనలేని కృషిచేశారు. నేటికీ ఆయన భారతీయుల హృదయాలలో స్మరింపబడుతూనే ఉన్నారు.

*– యుగనిర్మాణ యోజన, నవంబరు-2008*

**అన్ని నీతుల ముఖ్యోద్దేశ్యం సుఖ జీవనమే.**

# ఆదిశక్తి యొక్క లీలాకథలు-1

**ఈ నెలనుండీ ప్రారంభమౌతున్న ఈ నూతన వ్యాసమాల పాఠకులందరి హృదయాలనూ ఆనందింపజేయగలదు, శక్తి సాధనా విషయంలో మనకందరికీ మార్గదర్శనం చేయగలదు.**

ఆదిశక్తి యొక్క లీలలను తెలియజేసే గాథలు చెప్పాలనే ఆలోచనలు హృదయంలో పరవళ్ళుతొక్కుతున్నాయి. ఆదిశక్తి యొక్క లీలాగాథలు సూత్రరూపంలో గాయత్రీమహా మంత్రంలోని 24 అక్షరాలలో నిక్షిప్తం చేయబడివున్నప్పటికీ, యుగయుగాలలో ఈ తల్లియొక్క భక్తులు కన్నవి, విన్నవి అయిన ఎన్నో విశేషాలతో కూడిన విస్తృతమైన వివరణ శ్రీ దుర్గాసప్తశతిలో ఇవ్వబడింది. ఋగ్వేదం యొక్క ఋషి అయిన అంభృణుడు చేసిన కన్యావాక్ అనే సాధనకు సిద్ధిరూపంలో ఈ కథలు ఉత్పన్నమైనట్లు చెప్పబడుతున్నది. 'శ్రీదేవీసూక్తము' అనే రూపంలో కూడా ఇది వెల్లడికాబడినది. ఐతే ఇవన్నీ చరిత్రకు చెందిన అంశాలు. భావనాలోకంలో, తల్లియైన భవాని భక్తుల హృదయాలలో నిత్యమూ విరాజమానమై ఉంటుంది. ఆమె ఏవిధంగా 'నిత్యమో' అదేవిధంగా ఆమె కథలు కూడా నిత్యమై విలసిల్లుతున్నాయి. అనంతకోటి బ్రహ్మాండనాయిక, అఖిలాండేశ్వరి అయిన ఆ తల్లియొక్క లీలాచరిత్ర ఆమె వలే అనంతమైనది. దానిని సరియైన రీతిలో వర్ణించడం సహస్ర ఫణిఫణాలంకృతుడైన ఆ ఆదిశేషువునకు కూడా సాధ్యంకాదేమో! ఇప్పటికీ అమ్మను గురించి సరిగా ఉచ్చరించడం కూడా చేతకాని వ్యక్తులు ఇక ఆమె లీలాగాథలను ఏవిధంగా గానం చెయ్యగలరు?

అయినప్పటికీ ఆ తల్లిమీదనే నమ్మకం. ఆమె తన యొక్క ఈ చిన్నిబిడ్డ యొక్క పిలుపును విని తప్పకుండా సంతసిస్తుంది. కల్లాకపటమెఱుగని, చిన్నపిల్లల స్వచ్ఛమైన మాటలు విని తల్లి కిలకిలా నవ్వుతుంది. వారి చిలుకపలుకులను వింటుంటే ఆమెకు ఎంత ముద్దువస్తుందంటే అమాంతం వారిని ఒడిలోకి తీసుకొని హృదయానికి హత్తుకుంటుందామె! వణుకుతున్న చేతివ్రేళ్ళమధ్య కలాన్ని అదిమిపెట్టి వ్రాస్తున్న ఈ అల్పమైన జీవునకు కూడా అదే నమ్మకం! గోస్వామి మహరాజ్, భగవంతుని చరిత్రను ప్రారంభించటానికి ముందుగా.....

**'జౌ బాలక కహ తోతబరితా సునహి ముదిత మన పితు అరుమాతా'** అంటారు.

అనగా 'పిల్లవాడు చెప్పే మాటలు చిలుకపలుకుల వలె ఉంటాయి. వాని తల్లిదండ్రులు వాటిని ఎంతో సంతోషంతో వింటారు' అని అర్థము. నాకైతే మా అమ్మే సమస్తమూ! నేను ఎన్నడూ ఎవ్వరివద్దకు వెళ్ళలేదు. మరిక ఎవ్వరిగురించీ వినలేదు, ఆలోచించలేదు. నాకు తెలిసినదల్లా ఒక్కటే. 'సృష్టికర్త ఆమెయే! సృష్టిలో ఏర్పడే ప్రతివొక్క కదలిక కూడా ఆమెయే!'

ఆదిశక్తిని పరిచయం చేస్తూ మహాకవి తులసీదాసు, 'ఆదిశక్తి జెహి జగ ఉపజాయా' అంటారు. అనగా తన గర్భం నుండీ ఈ యావత్ప్రపంచానికీ జన్మనిచ్చినట్టువంటి, మన పాంచభౌతికమైన శరీరాలకేకాదు, మన ఆత్మలకు కూడా తల్లియైనటువంటి ఆమెయే ఆదిశక్తి!' అని అర్థం. బిడ్డ తన తల్లియొక్క ఉదరంలోనే పోషింపబడతాడు. ఆమె యొక్క రక్తమాంసాల నుండి లభించిన ఒక అంశతోనే అతని అస్తిత్వం నిర్మించబడుతుంది. ఆమె శ్వాసనుండే అతని శ్వాస నడుస్తుంది. గర్భంలో ఉన్నప్పుడు అతడు తల్లికన్నా అభిన్నంకాడు. గర్భంనుండీ వెలుపలకు వచ్చిన తరువాత అమ్మా! అని పిలవడంలో అతనికి ఆనందమూ, తల్లి తనను హృదయానికి హత్తుకున్నప్పుడు శాంతి లభిస్తాయి. తల్లి అతనికి స్తన్యమిచ్చి పెరిగి పెద్దయిన తర్వాత తన చేతితో ఆహారాన్ని తినిపిస్తుంది. తద్వారా అతడు సంతృప్తిచెందుతాడు.

**'యస్యాః పరతరం నాస్తి'** అని వేదవాక్కు అనగా 'ఆమెను మించి మరెవ్వరూ లేరు' అని అర్థం. ఇంకెవ్వరూ ఉండటానికి ఆస్కారం కూడా లేదు. ఆమెయే 'పరాపరాణం పరమా పరమేశ్వరీ' అని చెప్పబడింది. అనగా లౌకికమైన,

ధర్మము, సత్ప్రవర్తన అనే గుణాలు-జీవాత్మ పరమాత్మలో లీనం కావడానికి దోహదపడే ఉపకరణాలు.

అలౌకికమైన అన్నింటికన్నా ఆవలవుండే ఆమెయే పరమేశ్వరీ అని తెలుసుకోవాలి. ఆమెను గురించిన సరియైన, ఖచ్చితమైన జ్ఞానం ఎవ్వరికీ లేదు. అయితే ఆమెకు మటుకు అందరినీ గురించిన సంపూర్ణమైన జ్ఞానం ఉంది. ఇది యుక్తమే! ఎందుకంటే, అమాయకుడైన పసిబాలుడు తన తల్లి యొక్క సంపూర్ణత్వాన్ని గురించి ఎలా తెలుసుకొనగలడు? అయితే తల్లికిమాత్రం తన బిడ్డను గురించి సమగ్రంగా తెలుసు. బిడ్డను గురించి తల్లికి తెలియని విషయమేదీ ఉండదు. బిడ్డలు ఆమెతో చెప్పడం వల్ల, ఆమెకు ఈ జ్ఞానం రాదు. ఆమె అంతరంగంలో బిడ్డను గురించిన అనుభూతి వల్ల తెలుసుకొనగలుగుతుంది.

ప్రజ్ఞావంతులు దీనిని అతిశయోక్తిగా భావించవచ్చునేమో గానీ, శ్రద్ధావంతులకు మాత్రం ఇది సంపూర్ణమైన సత్యం! వారి అనుభవం వారికి "ప్రతివొక్క తల్లీ అంతర్యామియై ఉంటుంది. తన గురించి తాను చెప్పుకొనలేని పిల్లల గురించికూడా ప్రతివొక్క విషయమూ ఆమె ఎంతో తేలికగా అర్థం చేసుకొనగలదు. చమత్కారపూర్వకమైన వాక్కులకన్నా, సరళతతోనిండిన మృదు భావాలే ఆమె హృదయాన్ని స్పృశిస్తాయి. ఆ మృదుభావాల్లోని ఆర్ద్రత ఆమె హృదయాన్ని తడిపివేస్తుంది. ఇవన్నీ ఈ ప్రపంచంలోని సర్వసాధారణమైన తల్లులకు సంబంధించిన విషయాలు. మరి జగద్ధాత్రియైన ఆదిశక్తి యొక్క అంతర్ జ్ఞానాన్ని గురించి ఏమని చెప్పగలం? ఆమె అంతర్ జ్ఞానం అనంతములకన్నా అనంతమైనది. ఆమెను పిలవటానికి కూడా సాధ్యంకాదనేదిమాత్రం సత్యం! తన బిడ్డల యొక్క హృదయ స్పందనతోపాటే ఆమె హృదయం కూడా స్పందిస్తుంది!" అని తెలియజేస్తుంది.

అమాయకులు, పసివారు అయిన తన సంతానాన్ని గురించి, తల్లికాకపోతే మరి ఎవరు ఆలోచిస్తారు? – అనేది అంగీకరించబడే సత్యం. పిల్లవాడు పిల్లవాడిగానే ఉంటాడు. వాడు నిప్పులో చెయ్యిపెట్టవచ్చు లేదా పామును పట్టుకొనవచ్చు. ఫలితంగా అతడి చేతిని కాల్చవచ్చు లేదా పాము అతడిపై బుసకొట్టవచ్చు. ఏది జరిగినా అతడు కేవలం ఏడుస్తాడుతప్ప ఏమీ చెయ్యలేదు. వీటన్నింటిని గురించి తల్లే ఆలోచించవలసి ఉంటుంది. ఆమెయే ఉఋకులు–పరుగులు తీయవలసి ఉంటుంది. మన అమ్మయొక్క ఈ అలవాటును గురించి మనకు బాగా తెలుసు, అందువల్లనే మనం సంపూర్ణమైన నిశ్చింతతో ఉండగలుగుతున్నాం. ఎందుకంటే మనం ఎంత అజ్ఞానులం, మూర్ఖులం అయినప్పటికీ మన తల్లి సంపూర్ణమైన జ్ఞానం కలిగిన వ్యక్తి అన్న విషయం మనకు చక్కగా తెలుసు కాబట్టి.

ఆమెను గురించి వేదాలు **'యస్యాః స్వరూపం బ్రహ్మాదయో న జానంతి తస్మాదుచ్యతే అజ్ఞేయా'** అని చెప్తున్నాయి. బ్రహ్మాదిదేవతలకు కూడా ఆమె స్వరూపాన్ని గురించిన జ్ఞానం లేదుకాబట్టి ఆమె 'అజ్ఞేయా!' అని పిలువబడుతున్నది. ఈ దేవతల విషయం నాకు తెలియదు. వారి యొక్క జ్ఞానాన్ని గురించి కూడా నాకేమీ తెలియదు. ఆదిశక్తి అని పిలువబడే నా తల్లి 'మమతామూర్తి' అన్న విషయం మాత్రం నాకు తెలుసు. ఆమె తన బిడ్డలకు, మృదుహృదయులైన తన శిశువులకు, తనను గురించిన సమస్త విషయాలు తెలియజేస్తుంది. అందుచేత మూడు వ్రేళ్ళ మధ్య ఉన్న యీ కలం నుండి, ఆదిశక్తి యొక్క లీలలకు సంబంధించిన వేదాంతపరమైన, యోగపరమైన, భక్తిమయమైన రహస్యాలు వెల్లడి అవుతున్నవంటే ఆశ్చర్యపడవలసినదేమున్నది? భక్తిపూరితమైన నా భావన కూడా 'అమ్మయే ఈ పని చేయిస్తున్నది' అని చెప్తున్నది. ఆమె యొక్క అహైతుకమైన కృప ఉన్నట్లైతే మూగవాడు మాట్లాడగలడు, కుంటివాడు కొండను కూడా దాటగలడు. 'ఎట్లా? ఏవిధంగా?' అన్నది ఈ వ్యాసమాల చదివేవారు క్రమంగా తెలుసుకొనగలరు. అమ్మ యొక్క ప్రేమ మీద అగాధమైన విశ్వాసం, ఆరాధ్య సద్గురువు యెడల నిశ్చలమైన నమ్మకం నాకు ఉన్నాయి.

1986వ సంవత్సరంలో, శాంతికుంజ్‌లోని ప్రవచన వేదికపై నుండి, సద్గురువైన ఆ ప్రభువు ఈవిధంగా చెప్పారు, 'వందనీయ మాతాజీని చూసినవారు నన్ను చూసినట్లే! నన్ను చూసినవారు గాయత్రీమాతను చూసినట్లే!' అనగా పరమపూజ్య గురుదేవులు, వందనీయ మాతా భగవతీదేవి మరియు గాయత్రీమాత..... వీరు ముగ్గురూ తాత్వికంగా ఏకస్వరూపులు. వారిలో భేదం లేదు. ముందు ముందు ఒకరి

**ఆశించడం వల్లకాక, అర్హత సంపాదించడం వల్ల దేనినైనా పొందవచ్చు.**

లీలాగాధలో మిగిలిన ఇద్దరి యొక్క లీలాకథలు కూడా ఇమిడిఉన్నాయి' అని కూడా చెప్పుకుంటాం.

శ్రీ దుర్గాసప్తశతి యొక్క ఋషి సుమేధుడు ఈ రహస్యాన్ని కొంత ఈ క్రిందివిధంగా తెలియజేశాడు.

**దేవానాం కార్య సిద్ధ్యర్థమావిర్భవతి సా యా । ఉత్పన్నేతి తదా లోకే సా నిత్యాప్యభిధీయతే ॥ (1/65/66)**

'ఆమె నిత్య, పుట్టుకలేనిది' అయినప్పటికీ, దేవతల యొక్క కార్యాలను సిద్ధింపజేయుటకు అప్పుడప్పుడూ ప్రకటీకృతమౌతుంది. అప్పుడు ఆమె లోకంలో ఉత్పన్నమైనట్లు చెప్పబడుతుంది. ఈవిధమైన ఋషి వాక్కు 'వేదమాత అయిన గాయత్రీదేవియే అసురసంహారిణియైన దుర్గ'–అనే సత్యాన్ని ధృవీకరిస్తున్నది. ఆమెయే సీత, రాధ, ఆమెయే శ్రీరామకృష్ణుల జీవనసహచరి శ్రీ శారదామాతా, ఆమెయే ప్రభు శ్రీరామశర్మ యొక్క జీవన సహధర్మచారిణియైన వందనీయ మాతా భగవతీదేవి యొక్క స్వరూపంలో ఆవిర్భవించినది. ఆ ఆదిశక్తియే ప్రతి యుగంలోనూ యుగశక్తిగా అవతరిస్తున్నది.

శ్రీ దుర్గాసప్తశతి ఆమె యొక్క దార్శనిక, మాంత్రిక, యోగపరమైన లీలాగాధ. ఇప్పుడు మేం మా పాఠకులచేత ఆ సప్తశతియొక్క శ్రవణం, పఠనం చేయించబోతున్నాం. భక్తులైనవారు దీనిని చదివి తన్మయులౌతారు. దార్శనికులైన జిజ్ఞాసువులకు (వేదాంతపరమైన సంశయములున్నవారికి) ఇందులో సృష్టివిద్య, ఆత్మవిద్యలకు సంబంధించిన రహస్యాలు లభిస్తాయి. మంత్రవేత్తలైన వారికి ఈ లీలాగాధలు మంత్ర సాధనకు సంబంధించిన లెక్కలేనన్ని క్రొత్త కోణాలను ప్రసాదించగలవు. యోగసాధకులు ఇందులోనుండి యోగం యొక్క వివిధ రహస్యాలను పొందగలరు. సంతానంపట్ల వాత్సల్యం కల్గిన, పరమ దయామూర్తియైన, అమ్మ యొక్క అభిమానం పిల్లలమైన మాకు లభించినది. అందువల్లనే మా చేతుల నుండి 'శ్రీ దుర్గాసప్తశతి యొక్క గాయత్రీమయ వ్యాఖ్య' వెలువడుచున్నది. పిల్లవాడికైతే **క్షుధాతృషార్తా జననీం స్మరన్తి** – అనేది సాధారణ విషయం. అంటే పిల్లలకు ఆకలి అయినప్పుడు, దాహం వేసినప్పుడు అమ్మను పిలవాలి అన్న విషయం మాత్రం తెలుసు. ఐతే జ్ఞానమూర్తియైన అమ్మ యొక్క జ్ఞానకోశం అక్షయమైనది. దానిలోనుండి ఒక చిన్న అంశం, రాబోయే సంచిక నుండి వ్యాసమాలగా వెలువడనున్నది. 'శ్రీ దుర్గాసప్తశతి ఏవిధంగా గాయత్రీమయమైనది' అనే విషయాన్ని పాఠకులు దీనిని చదివిన తర్వాత తెలుసుకొనగలరు.

– శ్రీమతి కృష్ణకుమారి, *గుంటూరు*

## జాగ్రత్తగా ఉండాలి

*ఒక ముసలివాడు, యువకులకి చెట్టు ఎక్కడం, దిగడం నేర్పిస్తున్నాడు. వారెంతో ఉత్సాంగా పెద్ద పెద్ద చెట్లు ఎక్కిదిగడం నేర్చుకోసాగారు. వారిలో ఒకడు ఎక్కడంలో చాలా ప్రావీణ్యతను సంతరించుకున్నాడు. ముసలాయన వారితో ఇలా అన్నాడు. "చెట్లేక్కేటప్పుడూ, దిగేటప్పుడూ కూడా ఎంతో జాగ్రత్తగా ఉండాలి" దానికి "ఇందులో కొత్తేముందా? అందరికీ తెలిసిన విషయమేగా!" అంటూ ఆ యువకుడు చూస్తూండగానే చెట్టు చివరి కొమ్మకు చేరుకున్నాడు. ముసలాయన చూస్తూనే ప్రోత్సహించసాగాడు. దిగడం మొదలుపెట్టగానే ఆయన మౌనంగా ఉండిపోయాడు. యువకుడు ఎంతో జాగ్రత్తగా అప్రమత్తంగా దిగడం మొదలుపెట్టాడు. మూడొంతులు కిందకి దిగాక, "నాయనా! జాగ్రత్త! తొందపడకుండా జాగ్రత్తగా దిగు" అని కిందనుంచి ఆయన హితవు పలికాడు. అంతపైనుంచి దిగినప్పుడు ఏమీ మాట్లాడకుండా, సగం కన్నా ఎక్కువ దిగపోయాక అప్పుడు ఎందుకు జాగ్రత్తపడమని ఆయన చెపుతున్నారో ఆ యువకుడికి అర్థం కాలేదు. "నీవు పైనుంచి దిగేటప్పుడు స్వయంగా ఎంతో జాగ్రత్తగా ఉన్నావని నాకు బాగా తెలుసు. కాని లక్ష్యం దగ్గరకొచ్చినప్పుడు, తేలిగ్గా ఉంటుందనిపించి మామూలుగా అందరూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. నాయనా! అందుకే నేను నిన్ను సావధానంగా ఉండమని చెప్పాను" అని ఆ పెద్దాయన బదులిచ్చాడు.*

**ఒక ఖైది మరో ఖైదీని విడుదల చేయలేడు-బంధాలను వదలి లేనివాడు మరొకరికి బోధించలేడు.**

## గాయత్రీమాత-24 శక్తిధారలు - 14

# సరస్వతి

జ్ఞాన చేతనకు రెండు పక్షాలు. **1) ప్రజ్ఞ:** మేధాశక్తి ఆత్మికపరమైన సమాధానంతోపాటు అభివృద్ధి మార్గాన్ని సూచిస్తుంది. **2) బుద్ధి:** లోక వ్యవహారాలలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకునే మార్గాన్ని సూచిస్తుంది. బుద్ధి ప్రజ్ఞ యొక్క అంతఃకరణం. బుద్ధి మస్తిష్కం యొక్క స్వరూపం. ప్రజ్ఞ యొక్క అధిష్ఠాన దేవత గాయత్రి. బుద్ధిని నడిపించేది సరస్వతి. మన అవసరాన్ని అనుసరించి ఎవరిని ఆశ్రయిస్తే ఆ ఫలితాలు లభిస్తాయి.

సరస్వతి అంటే సంగీత – సాహిత్యాలకు ప్రతిరూపం. ఆలోచనా శక్తి, భావనాశక్తి, సానుభూతులను కలగలుపుకుని ఉన్న త్రివేణి సరస్వతి. వీణ సంగీతానికి, పుస్తకం ఆలోచనకు, నెమలి వాహనం కళలకు చిహ్నాలు. సాధారణంగా లోకంలో సరస్వతీ దేవిని చదువుల తల్లిగా చెపుతూ ఉంటారు. విద్యారంగంలో వసంతపంచమిని సరస్వతీదేవి జన్మదినంగా జరుపుకుంటారు. విద్య పశుస్వభావాన్ని మార్చివేసి మానవత్వాన్ని ప్రసాదిస్తుంది. అజ్ఞానికి జ్ఞానం ప్రసాదిస్తుంది. మననం చేయడం బుద్ధి యొక్క పని. మననం ద్వారా మానవత్వం సిద్ధిస్తుంది. భౌతిక ప్రగతికి మూల కారణం బుద్ధి శక్తియే అనడం సమంజసంగా ఉంటుంది. అంటే ఇదంతా సరస్వతి అనుగ్రహమే అనక తప్పదు. సరస్వతీ మాత అనుగ్రహం లేకపోయినట్లైతే మానవుడు అడవిమనిషిగా జీవితాన్ని గడుపుతాడు. విద్య యొక్క గొప్పదనాన్ని, బుద్ధి వికాసం యొక్క అవసరాన్ని మనిషి మనిషికి అర్థం చేయించడం కోసం సరస్వతిని పూజిస్తారు. దీనినే గాయత్రీమాతలో దాగి ఉన్న బుద్ధి పక్షాన్ని ఆరాధించడం అంటారు.

మహాకవి కాళిదాసు, వరద రాజాచార్యులు, వోపదేవుడు మొదలైన అజ్ఞానులు సరస్వతీ ఉపాసన ద్వారానే గొప్ప పండితులు అయ్యారు. దీనిని బట్టివారు ఎంత నియమ నిష్ఠలతో, ఇష్టంగా ఆరాధించారో మనకు అర్థం అవుతూ ఉంది. అందువల్లనే అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న వారు జ్ఞాన జ్యోతిని పొందగలిగారు. ఏదో కారణంగా బలహీనపడిన బుద్ధి సంస్థానాన్ని జాగృతపరచి, తేజస్సును కలిగించే ప్రయత్నమే సరస్వతీ ఆరాధన. భావ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపాసన చక్కని మార్గం. శ్రద్ధతో నిమగ్నమై చేసిన సాధన అత్యంత శక్తివంతమయింది. వ్యాయామం, అధ్యయనం, కళ, సాధన మొదలయిన ప్రక్రియలు చైతన్యాన్ని వృద్ధి చేస్తాయని మానసిక శాస్త్రవేత్తలు కూడా అంగీకరించారు. సరస్వతీ ఉపాసన కూడా ఇదే ఫలితాన్ని ఇస్తుంది. శాస్త్రీయ పద్ధతిలో చేసినట్లైతే బుద్ధిపరంగా గొప్ప మేలు జరుగుతుంది.

మంద బుద్ధిగలవారికి గాయత్రీ మాతలోని సరస్వతీ తత్వం ఎక్కువ మేలు చేస్తుంది. మానసిక వైకల్యాన్ని తొలగించడానికి సరస్వతీ సాధన మిక్కిలి ఉపయోగకారి. మెదడుకు సంబంధించి నిద్రలేకపోవడం, తలనొప్పి, ఒత్తిడి (టెన్షన్) మొదలైన జబ్బులు గాయత్రిలో ఒక అంశ అయిన సరస్వతీ సాధన ద్వారా తగ్గుతాయి. ఊహాశక్తి లోపించడం, సమయస్ఫూర్తిగా ఆలోచించలేక పోవడం, మతిమరపు, భ్రమ, నోటికి రుచిలేకపోవుట, ఏ పనినైనా ఆలస్యంగా చేయుట మొదలైన వాటివల్ల కూడా మానవుడు మానసిక బలహీనుడుగా భావింపబడతాడు. పై లోపాలను కూడా సరస్వతీ సాధన ద్వారా తొలగించుకోవచ్చు.

విద్యను గురించి ప్రతి ఒక్కరి మనస్సులో శ్రద్ధ కలగాలంటే సరస్వతీ సాధన కావాలి. తెలివితేటలు మిక్కిలి విలువైన సంపద. తెలివితో ధనాన్ని కూడా సంపాదించుకోగలుగుతాం. శారీరిక శక్తిని పెంచుకోగలుగుతాం. వస్తు సామాగ్రిని సమకూర్చుకోగలుగుతాం. ఆనందాన్ని అనుభవించ గలుగుతాం. ఇంత గొప్పశక్తి సామర్థ్యాలు గాయత్రిలో అంతర్గతంగా ప్రవహిస్తూ ఉన్న సరస్వతీ పాయలో నిండి ఉన్నాయి. సరస్వతీ సాధన సర్వులకూ ఆచరణీయం.

★★★

**సంపదలు పెంచుకుంటే తుంచుకోలేక బాధపడతావు.**



మహిళా జాగరణ

# ఈనాటి ఆదర్శ మహిళలు హైదరాబాదు వనితలు - అర్చన, నవనీత వనవనాభివృద్ధి

మనిషిపై పుట్టాక ఈ లోకంలో ప్రతి ఒక్కరికీ మంచిదో, చెడ్డదో చెప్పుకోగలిగిందో, చెప్పుకోలేనిదో ఏదో ఒక హాబీ (ఆసక్తికర విషయం) తప్పకుండా ఉంటుంది. పుస్తకాలు చదవడం, బొమ్మలు వేయడం, ఇతర భాషలను నేర్చుకోవడం, సంగీతం, చెట్లను పెంచడం మొదలైనవి ఏదో ఒకటి కావచ్చు.

ఐటి సంస్థలో ఉద్యోగినిగా ఉన్న నవనీతకు చిన్నతనంనుండే మొక్కలంటే ప్రాణం. వ్యవసాయానికి సంబంధించిన కోర్సు చదివిన అర్చనకూ మొక్కల పెంపకం ప్రాణం. ఇద్దరి మధ్యా బంధుత్వం కూడా ఉంది. అనుకోకుండా ఒకరోజు అందమైన తోటలో కూర్చుని ముచ్చటించుకుంటున్నారు. మాటల సందర్భంలో ఇద్దరి అభిప్రాయాలూ ఒక్కటే అని తేలిపోయింది. వారి ఆలోచనలు, ఆశయాలు పచ్చదనం చుట్టూ పరిభ్రమించాయి. "మనం డబ్బున్న వాళ్ల ఇండ్లలో పుట్టి పెరిగాం. అందమైన పూలమొక్కల మధ్య పువ్వుల్లా పెరిగాం. కానీ ఈనాడు నగరాలలో చాలామంది పిల్లలు పచ్చదనాన్ని, దాని విలువను తెలుసుకోలేని దశలో ఉన్నారు. లేచిన దగ్గర నుండి ఉద్యోగాల బిజీలో తిరిగే తల్లిదండ్రులు పిల్లలను పచ్చదనపు నీడలో పెంచలేకపోతున్నారు" అంటూ అనేక విషయాలు చర్చించుకున్నారు.

ఇద్దరి హాబీ మొక్కల్ని పెంచడమే. మనమే ఒక అందమైన ఉద్యానవనాన్ని ఎందుకు పెంచకూడదు? దానిని పది మందికి ఉపయోగపడేలా ఎందుకు పంచకూడదు? అన్న ధోరణిలో వారి సంభాషణ నడిచింది. క్షణాల మీద మెరుపులాంటి ఆలోచన వచ్చింది. కుటుంబ సభ్యులతో చర్చించారు. రెండు కుటుంబాల వారు వీరి మాటకు ఓటు వేశారు. వ్యాపారవేత్త అయిన అర్చన తండ్రి 6 ఎకరాల స్థలాన్ని అందించి ఆశీర్వదించారు. నవనీత తండ్రి పెట్టుబడికి కావలసిన ధనాన్ని సమకూర్చారు. కుటుంబాలలోని ప్రతి ఒక్కరూ చక్కగా సహకరించారు.

అందరి కోసం అందమైన తోటను అందించాలి అనుకున్న ఆదర్శ యువతులు ఇంక ఆగుతారా? నగ శివార్లలోని నాచారంలో పెద్ద ఎత్తున మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. ఇప్పుడు అక్కడ 400 రకాల మొక్కలు ఉన్నాయి. 2009 ఆగష్టులో 'హాబీ హబ్' అన్ని హంగులతో అలంకరించబడింది. సాధారణంగా నర్సరీల్లో లభించే మొక్కలే కాకుండా, ఆయుర్వేదం, అరోమా, హైబ్రీడ్, బొన్సాయ్, ఆర్కిడ్స్ వంటి అనేక మొక్కలను అందుబాటులోకి తీసుకునివచ్చారు. అర్చన పూర్తిగా తన సమయాన్ని 'హాబిహబ్' కే అర్పించింది. నవనీత ఐటీలో తన ఉద్యోగాన్ని నిర్వహిస్తూనే ఆదివారాలలో, సెలవుల్లో సంపూర్ణ సహకారాన్ని అందిస్తోంది.

మొక్కల సేకరణ, పెంపకం, అభివృద్ధి పరచడం కార్యక్రమాల్లో మునిగి తేలుతూ ఏడాది తిరిగేసరికి అందమైన ఉద్యానవనాన్ని తీర్చిదిద్దారు. అంతటితో ఆగారనుకుంటున్నారా? నగరంలోని వివిధ పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణ ఉపయోగాల గురించి సెమినార్లు నిర్వహించారు. విద్యార్థులను 'హాబీ హబ్' కు ఆహ్వానించారు. ఆసక్తి గల పాఠశాలలకు, పిల్లలకు అది విహారయాత్రగా మారింది. వేలాదిమంది విద్యార్థులను ఆకట్టుకుంటున్నది. పూదోటను రమణీయంగా అలంకరించుకునే సిరామిక్, మట్టి కుండీలు, సముద్ర జంతుజాలాలను కళ్ళకు కట్టే మెరైన్ ఆక్వేరియం వంటివి అదనపు ఆకర్షణలు. విద్యార్థులకు ప్రవేశం ఉచితం. పార్టీలు, ఫంక్షన్‌లు, కార్పొరేట్ సమావేశాలకు కొంత రుసుము వసూలు చేస్తారు. పెయింటింగ్, కుట్లు, అల్లికలు, గృహాలంకరణ మొదలైన విషయాలకు వారాంతంలో శిక్షణ ఇస్తారు. దానికి కావలసిన వస్తు సామాగ్రిని ఎవరివి వారే తెచ్చుకోవాల్సి ఉంటుంది. శిక్షణా తరగతులు కేవలం చిన్నారులకే కాదు, ఆసక్తిగల గృహిణులు, ఎవరైనా వచ్చి నేర్చుకోవచ్చునని నవనీత తెలియచేశారు.

అక్కడకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఏదో ఒక మొక్కను కానుకగా ఇచ్చి మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తారు. 5 నెలల క్రితం ప్రారంభమైన ఈ వినూత్న ప్రయత్నంలో ఇప్పటికే వేల సంఖ్యలో మొక్కలు పంపిణీ చేశారు. వనాల అభివృద్ధితోపాటు సందర్శకులకు ఫిష్‌వుడ్, బయో ఎరువులు, మెరైన్ ఫిష్‌లు, గృహాలంకరణకు ఉపయోగించే వెదురు, బోన్సాయ్ మొక్కల ద్వారా ఉపాధి మార్గాలను కూడా సూచిస్తారు. నేటి యువతకు ఆదర్శం నవనీత-అర్చనలు.

*- ఈనాడు ఆదివారం అనుబంధం ఆధారంగా*

**చావు పుట్టుకలు, బంధాలు, బంధరాహిత్యం సుఖదుఃఖాలు, లాభనష్టాలు మొదలైనవన్నీ మనో నిర్మిత భావాలు.**

## దేవ సంస్కృతి విశ్వవిద్యాలయము - 4

# తక్షశిలా విశ్వవిద్యాలయం

తక్షశిలా విశ్వవిద్యాలయం పురాతన భారతదేశపు అత్యున్నత విద్యాలయాలలో ఒకటి. ఇది భారత ఉపఖండానికి వాయవ్య ప్రదేశములో ఉండేది. దాదాపు 2700 సంవత్సరముల క్రితము స్థాపించబడిన ఈ విశ్వవిద్యాలయం సుమారు సహస్రాబ్ది కాలము అత్యున్నత స్థాయిలో ఉన్నది. క్రీస్తు పూర్వం ఇక్కడ ప్రపంచ ప్రఖ్యాతమైన విద్యాబోధన సాగేదని చరిత్ర చెప్తున్నది. ప్రస్తుతము తక్షశిల పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలో ఇస్లామాబాద్ కు 35 కి.మి. పశ్చిమాన ఉన్నది.

తక్షశిల అనే మాట తక్షకుడు అనురాజు పేరు మీద వచ్చింది. రామాయణములోని శ్రీరాముని తమ్ముడైనటువంటి భరతుడు తన కుమారుని పేరు మీద ఈ నగరాన్ని నిర్మించాడు. ఈ తక్షశిలా రాజ్యమందే వైశంపాయనుడు (వ్యాసభగవానుని శిష్యుడు) మహాభారతమును ప్రవచనము ద్వారా అందించాడు. తక్షశిలలోని ఒక మడుగులో తక్షకుడు అనే మహా సర్పము ఉండేదని దాని పేరు మీదే ఈ స్థలానికి తక్షశిల అనే పేరొచ్చిందని మరో కథనం. త్రేతాయుగములో ఈ ప్రదేశమున ప్రారంభమైన విద్యాలయము, ద్వాపర యుగము దాటి కలియుగం వరకు నడచినది.

విద్యాబోధన గురుకుల పద్ధతిలో జరుగుతున్న కాలమది. గురుకులంలో గురుశిష్యులు ఇద్దరూ కలిసిమెలసి జీవించేవారు. రాజకుమారుల దగ్గర నుంచి సామాన్య వ్యక్తి వరకు అందరూ ఈ విద్యాలయంలో విద్యార్థులుగా ఉండేవారు. వీరి నడుమ ఎటువంటి విభేదాలు ఉండేవి కావు. అందరూ ఒకే చోట సహజీవనం చేసేవారు. క్రమశిక్షణలో మర్యాద లోపం సాధారణంగా ఉండేది కాదు. అందువల్ల ఎటువంటి దండనలకు అవకాశం ఉండేది కాదు. విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు భోజనము, దుస్తులు కూడా ఉచితంగా అందజేసేవారు. నిత్యావసర వస్తువుల గురించి ఇరువురికీ బెంగ ఉండేది కాదు. సంతృప్తిగా జీవించేవారు. ఉపాధ్యాయులు తమ విద్యాలయాల నిర్వహణ కోసం గ్రామస్థుల నుంచి, రాజ్యాధినేతల నుంచి నిధులు సేకరించేవారు.

విద్యా విధానం ప్రధానంగా మౌఖికంగా, వ్యక్తిగతంగా కూడా ఉండేది. వినుట, ఆలోచన, అభ్యాసం అనేవి ఈ విద్యా విధానములో ముఖ్య అంగాలు. గ్రంథాలు చాలా కొద్దిగా మాత్రమే ఉండేవి. ప్రతి పాఠాన్నీ కంఠోపాఠంగా నేర్పేవారు. ప్రతిరోజు ఒక ప్రత్యేక నిర్ణయ కాలంలో గురువులు ఉన్నత విద్యార్థులకు పాఠాలు నేర్పితే, ఇతర సమయాలలో ఉన్నత విద్యార్థులు (సీనియర్లు) చిన్న తరగతుల విద్యార్థులకు (జూనియర్లు) విద్య నేర్పుతూండేవారు. ప్రతి రోజు దినచర్య వేకువ జామునే (సూర్యోదయానికి ఒక గంట లేదా ఒకటిన్నర గంటలకు ముందు) ఆరంభమౌతుంది. ఇక్కడ అష్టమి, నవమి, చతుర్దశి, అమావాస్య, పూర్ణిమలలో సాధారణంగా అధ్యయనము చేసేవారు కాదు. పెద్దలు ఆశ్రమానికి వచ్చినప్పుడు, ప్రకృతి విపత్తుల కాలంలోనూ అధ్యయనము చేసేవారు కాదు. ఇక్కడ అనేక మంది ఖ్యాతి గాంచిన శాస్త్రవేత్తలు దూరదూరాల నుంచి, వచ్చే విద్యార్థులకు ఆయా శాస్త్రాలలో ప్రావీణ్యం కల్పించేవారు. ఇక్కడ విద్యావేత్తలు ఆయా క్షేత్రాలలో ఉన్నత స్థాయిలో ఉండేవారు.

దేశంలోని నాలుగు మూలల నుంచి, చైనా మొదలైన విదేశాలనుంచి విద్యార్థులు అక్కడికి వచ్చి గురువుల పాదాల వద్ద కూర్చొని విద్యాభ్యాసం కొనసాగించేవారు. జాతక కథల్లో తక్షశిలలోని విద్యావ్యవస్థను గూర్చిన అనేక వివరాలు కనిపిస్తాయి.

ఈ విశ్వవిద్యాలయ అధ్యయనంలో వేదములు, అష్టాదశ శిల్పశాస్త్రాలు నేర్పబడేవి. అట్లాగే వైద్యశాస్త్రం, న్యాయశాస్త్రం, ధనుర్విద్య, సైన్య విద్య ఇక్కడ ప్రముఖముగా బోధింపబడేవి. సంగీతము, నాట్యము, నాటకము మొదలైనవి ఇక్కడి విశేష విద్యాశాఖలుగా ఉండేవి. సృష్టి రహస్యం, సృష్టి వికాసము, గ్రహ, నక్షత్ర, గోళముల స్థితిగతులు, ఋతువులు, భౌగోళిక పరిస్థితులు చరాచర జంతుజాలము భూగర్భ రహస్యము నేర్పబడేవి. వైద్యశాస్త్రంలో వ్యాధులు వాటి నివారణల గురించే కాక, ఆ సందర్భంలో మనిషికి ఓషధులే కాక ఆత్మ విశ్వాసాల వల్ల కలిగే శక్తి మొదలైనవన్నీ కూడా ఇక్కడ నేర్పబడేవి. శస్త్ర విద్యలో కంటి పొరలు, గర్భకోశం నుంచి మృతపిండాన్ని తీయడం వంటి శస్త్ర చికిత్సలు చేసేవారు. మానవులతోపాటు ఇక్కడ జంతువులకు కూడా పరిపూర్ణమైన వైద్య సౌకర్యం ఉండేది.

ఈ విశ్వవిద్యాలయమునందే గణిత శాస్త్రము చాలా వృద్ధిచెందినది. ఏకాంశ, దశాంశపద్ధతిని (Place value, Decimal system) కనుగొన్నది ఈ విశ్వవిద్యాలయములోనే. ఆ రోజులలో ఈ విశ్వవిద్యాలయము ఈనాటి ఐఐటి, యమ్ఐటి లాగా ఉండేది. రహస్య నిధులను వెలికితీయకుట, రహస్య సమాచారమును క్రోడీకరించుట వంటి విద్యలు కూడా అక్కడ నేర్పబడేవి.

★★★

**అందరినీ ఆదుకో - దయతో దగ్గరకు చేర్చుకో.**

నావారితో నామాట : 2011 - 2012 శతాబ్ది సంవత్సరం

# జన్మశతాబ్దికి ఇంకా 222 రోజులు మాత్రమే ఉన్నాయి

## గురుసత్తా మార్గదర్శనం

పునీతమైన గురుపూర్ణిమ సమయం ఆసన్నమయింది. ముందు సంచికలో పరమపూజ్య గురుదేవులు అందించిన సాధనాత్మక మార్గదర్శనం 'నా అంగ అవయవములతో' చర్చించబడింది. 1984 సూక్ష్మీకరణ సాధనా సమయంలో అందించినటువంటి మార్గదర్శనం ఈ నాటికి అంతే ప్రాముఖ్యత కలిగిఉంది. రాబోయే సంవత్సరం గురుదేవుల జన్మశతాబ్ది సంవత్సరం. అందువల్ల ప్రస్తుత సమయం అతి మహత్వపూర్ణమైనది. శాంతి కుంజ్‌లోని కార్యకర్తలు కలసి తమ వికాసం కొరకు చర్చించుకుంటున్నారు. దీనిలో పాల్గొన్న వారందరిని, ఈ విరాట్ 'యుగనిర్మాణ యోజన' లో పాల్గొన్న వారందరిని గురుదేవులు తమ అంగ అవయవములుగా భావించారు. చెయ్యవలసిన బాధ్యత కూడా అప్పగించబడింది. అంగ అవయవములు అంటే శరీరంలోని విభిన్న భాగాలు. అందరు కలసి పనిచేయాలి. అప్పుడే కార్యక్రమాలకు వేగం వస్తుంది. ప్రగతి జరుగుతుంది. గురుదేవులు 'యుగనిర్మాణ యోజన'ను ఒక దైవీ ప్రణాళికగా వర్ణించారు. ఇది తప్పనిసరిగా జరిగి తీరుతుంది. దీనిని యుగపరివర్తన అంటారు. ప్రపంచాన్ని పూర్తిగా మార్చడమే దీని ఉద్దేశ్యం. సత్యయుగాన్ని తిరిగి తీసుకువచ్చే సంకల్పం ఇది. సాధనాలు ఎక్కడి నుండి వస్తాయి? ఇవన్నీ ఎవరు సమకూరుస్తారు? వీటి గురించి ఆలోచించవద్దని గురుదేవులు ఉద్బోధిస్తున్నారు. అత్యధిక శ్రమతో సమర్పణ భావముతో పని చేయాలి.

ఇప్పుడు ఈ సంచికలో తరువాయి భాగం ఇవ్వ బడుతుంది.

### హనుమంతుడి స్థాయి కన్న మనం తగ్గకూడదు

పరమపూజ్య గురుదేవులు సమర్పణ గురించి ప్రస్తావించినపుడు హనుమంతుడి పేరు తప్పనిసరిగా వస్తుంది. గొప్పశక్తితో కలసినపుడు మహత్వపూర్ణ కార్యములు చేయగలిగే సామర్థ్యం, శ్రేయస్సు లభించిందని ఇతిహాసం చెబుతుంది. అదే విధంగా మనలో ఎవరు కూడా హనుమంతుడి స్థాయికి తగ్గకూడదని గురుదేవులు కోరుకుంటున్నారు. మనం చేసే పనులలో ఎవరు కూడా పురుషార్థ దృష్టితో గాని, సమర్పణ దృష్టితో గాని వెనుకబడకూడదు. అవాంఛనీయ పరిస్థితులను సరిచేసే (సంభవామి యుగే యుగే) ఈశ్వరుని సంకల్పమును చూడగలిగాలి. దీనికి కావలసిన సూక్ష్మ వనరులను ఋషి చేతన మన ముందుంచుచున్నది. దీనిని ఉపయోగించుకునే సామర్థ్యం ఇస్తుంది. మనం వారి నిర్దేశాలను చదివినట్లయితే గంగోత్రి నుండి గంగా సాగరం వరకు జరిగే గంగా ప్రవాహం వలె మన యాత్ర చిన్నగా ప్రారంభమయి పెద్దది పెద్దదిగా అవుతున్నదని తెలుస్తుంది. దీని కొరకు మనం హనుమంతుడి వలె పని చేయాలి. రామకార్యం కొరకు సమర్పణా భావంతో పని చేయడమే ఆయన ప్రత్యేకత

### సమర్పణ చేసుకోవాలి

తీసుకున్న సమర్పణ భావం నిరంతరం మనస్సులో ఉంచుకోవాలి. స్త్రీ తనను తాను భర్తకు సమర్పించుకున్నప్పుడు అతని పేరు, వంశం, భవిష్యత్‌తో జోడింపబడుతుంది. ఆమె సమర్పణ చూడముచ్చటవుతుంది. మనం గురుసత్తాతో జోడింపబడి ఉన్నాము. వారి ఆదర్శములను జీవితంలో అన్వయించేందుకు ఎప్పుడో సంకల్పించుకున్నాము. వారి ఆలోచనలతో మన జీవితంలో మార్పు వచ్చింది. సామాజిక క్షేత్రంలో కూడా నిరంతరం సఫలతలు లభిస్తున్నపుడు మన సమర్పణ ప్రగాఢమయి హనుమంతుడి స్థాయికి ఎందుకు చేరడం లేదు? మనమందరం ఆత్మ విమర్శ చేసుకోవాలి. అంతేగాదు. సమర్పణ అనేది అనవతరంగా అంతిమ శ్వాస వరకు ఉండాలి. హనుమంతుడి గురించే ప్రస్తావన ఎందుకు ఇంకా ఎవరు లేరా? హనుమంతుడు శ్రీరాముని ఒకే శిష్యుడు.

**అజ్ఞానాన్ని అడుగంటాత్రుంచు - ఆత్మ జ్ఞానాన్ని అందరికీ పంచు.**

సాహసంతో, వివేకంతో ధర్మ మార్గాన పయనించాడనేది ఒక ఉదాహరణ. హనుమంతుడు శ్రీరామునిచే ప్రభావితుడయ్యాడు. కాలనేమితో కాలేదు. హనుమంతుడు అంటాడు "రామకార్యం చెయ్యకుండా విశ్రాంతి ఎక్కడ?" మనం ఎందుకు ఈ దైవీ కార్యంలో విశ్రమిస్తున్నాము? సెలవు తీసుకుంటున్నాము? ఇక చాలులే అని ఎందుకు అనుకుంటున్నాము? మన సమర్పణలో అంత తీవ్రత లేదా? మన స్వాధ్యాయం, ఆత్మచింతన ఆయన స్థాయిలో లేదా?

### పని మారుతుంది, జరుగుతుంది, పాడవుతుంది

గురుదేవులంటారు "ఏమి పని చెయ్యాలి? ఈ నిర్దేశం అప్పుడప్పుడు లభిస్తూనే ఉంటుంది." వారు ముందే చెప్పారు "వ్రాసే ఈ వేళ్ళు ఉంటాయో లేదో కాని పనులు మాత్రం ఆగవు" గురువుగారి భౌతిక శరీరం లేదు కాబట్టి ఆదేశాలు రావని భావించకండి. అదే మార్గదర్శనం వారి చేతనత్వం ఇస్తుంది. ఆ స్పందనలు గ్రహించడానికి ఎప్పుడు తయారుగా ఉండాలి. జీవన సాధన ఇంకా తీవ్రతరం చేసుకోవాలి. వారు వ్రాస్తారు "పనులు జరుగుతుంటాయి. పాడయిపోతుంటాయి, మారుతుంటాయి" దీని అర్థం ఏమిటంటే మన భూమిక మనకు ఇచ్చినటువంటి పని మారవచ్చు, అప్పుడు ప్రణాళికలో సమయానుకూలంగా మార్పుచేయబడింది అని అర్థం చేసుకోవాలి. బాధపడకూడదు. మనమందరం గురుదేవుల అంగఅవయవములం. ఈ సమన్వయ రూపం అందరికి అర్థం కావాలి. గాయత్రీ పరివార్ అంతా ఒక్కటే, కలిసే ఉంటుంది. ఈ స్వరూపం కనిపించాలి. ఎవరైన ట్రస్టీని వినమ్రతా పూర్వకముగా తప్పుకోమన్నప్పుడు లేదా ఈ బాధ్యత గాక వేరే పనిని అప్పగించినపుడు బాధపడకూడదు. మనము పనిని పనిగా చూడము. దానిని సేవగా భావిస్తాం. ఇది ప్రభుత్వ ప్రణాళిక కాదు, భగవంతుని ప్రణాళిక. పూజ్య గురుదేవులు అంటుండేవారు **''పని పాడయితే పాడయిపోనీండి కాని సంబంధాలు పాడవకూడదు"** ఇది ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి. ఏ కార్యక్రమమైన పరస్పర ఆత్మీయతతో నిర్వహించాలి. ఆధ్యాత్మిక సంస్థలు చాలా ఉన్నాయి. కాని గాయత్రీ పరివార్ ప్రగతి యాత్ర ఒక అద్భుతం.

### రోజు రోజుకి సమర్పణ పెరగాలి

పనులు చేసే సమయంలో (వ్యక్తిగత సాధన, ప్రాంతీయ కార్యక్రమం, ఆశ్రమ వ్యవస్థ, శక్తిపీఠ వ్యవస్థ, పత్రికకు చందాదారులను చేర్పించడం, జ్ఞానయజ్ఞం, వివిధ రకాల సమాజ సేవలు, జన సంపర్కం) మనం ఎటువంటి సమర్పణ భావంతో గురుసత్తాతో జోడింపబడి ఉన్నామో అది దినదినాభివృద్ధి చెందుతుందా లేదా చూచుకోవాలని గురుదేవులు చెప్తారు. కనీసం అది తక్కువ కాకుండా చూచుకోవాలి. సమర్పణా భావం పెరగాలని గురుదేవుల అపేక్ష. ఇది ఆయన నిర్దేశమేగాక మన కర్తవ్యం. సమర్పణ చేసుకున్న తరువాత ప్రతీక్షణం ఆ విధంగా జీవించాలి. మొదట్లో పనులు చేసేందుకు ఉత్సాహం పెల్లుబుకుతుంది. కాని ఇది అనేక కారణాల వల్ల తరిగిపోతుంది. కావలసిన వస్తువు లభించనపుడు ఇతరుల మాటలు విని లేదా ఎవరినో చూచి ప్రభావితం కావడం వల్ల ఇలా జరుగలేదా? శ్రద్ధా భావం తగ్గిందా? శ్రద్ధ పెంపొందించుకునే పని అంగఅవయవాలు నిరంతరం చేయాలి.

### గురి లక్ష్యం వరకు చేరాలి

గురుదేవులు ఇలా వ్రాశారు "కార్యం యొక్క విశాలత్వాన్ని అర్థం చేసుకోవాలి. లక్ష్యం వరకు గురి చేరకపోయినా, కనీసం అది లక్ష్యానికి దగ్గరగా అయినా తప్పని సరిగా చేరుతుంది. దీనిని అద్భుతం, అనుపమ, అసాధారణ, ఇతిహాసిక మనవచ్చు.'' ఎంత బాగా చెప్పారు! పని ఎంత పెద్దదయినప్పటికి ఎంత విశాలమైనప్పటికి దానిని మనం చెయ్యగలమనే ప్రోత్సాహం, ఉత్సాహం గురుదేవులు అందిస్తున్నారు. దీనితో పాటు మన ఫిట్‌నెస్ (ఆరోగ్యం, యోగ్యత, సమర్థత) చేయవలసిన పనికి అనుగుణంగా ఉంచుకోవాలి. ఈ విరాట్ ప్రణాళికలో ప్రతిభావంతులు, అనేక ఇతర సంస్థలు రాబోయే రోజులలో కలుస్తాయి. దీని కొరకు మనం సిద్ధం కావాలి.

**పురుషార్థం తెలిసిన వారు ఇతరులను దోషులుగా ఎంచరు.**

**సాధనముల గురించి కాక మీ వికాసం గురించి ఆలోచించాలి.**

గురుదేవులు మరల చెబుతున్నారు “ఈ పనికి చాల సాధనాలు కావలసి వస్తాయి. దానిని దివ్య గురుసత్తాపై వదిలేయాలి” గురుసత్తా వీటిని గురించి చింతించవద్దని చెబుతుంది. లక్ష్యాన్ని నిర్ధారించుకుని దానిని సాధించుకునేందుకు పూర్తిగా ప్రయత్నం చేయాలి. కావలసిన వస్తువులు అవే నడుచుకుంటూ వస్తాయి. ఎందుకంటే దైవీసత్తా ఈ ప్రణాళికను నడుపుతున్నది. అవసరమైనవి లభ్యమవుతూనే ఉంటాయి. దైవీ సత్తాకు అవసరం లేనివి లభించవు, ఎప్పుడు అవసరమో అప్పుడు లభిస్తాయి. కాలం వేగంగా వెళ్ళిపోతున్నది. మన ప్రయత్నాల్లో ఎటువంటి లోటు ఉండకూడదు. వ్యవస్థలో లోటుపాట్లు ఉండవచ్చు. లభ్యమైన సాధనములతో బాధపడకుండా కార్యక్రమం చేయాలి. మీ శ్రమ, సమయం, కర్మ, స్వభావంలో లోటు లేకుంటే చాలు అంటారు గురుదేవులు. విశ్రాంతి గురించి ఆలోచించకండి. మనం ఎంత వరకు చెయ్యగలము, ఎంత ముందుకు పోగలమో ఆలోచించాలి. **వినమ్రతతో కూడిన స్వయం సేవకులవ్వాలి.** దీనిలోనే మీ పురోభివృద్ధి ఉన్నది. ఈ సూత్రాలన్ని ఉపనిషద్‌ల కన్నా గొప్ప మార్గదర్శనం ఇస్తున్నాయి.

**స్వయం సేవకులుగా తయారవ్వటానికి సిద్ధంగా ఉన్నారా?**

ఎవరైనా కార్యకర్తగా కావాలనుకుంటే, సేవా కార్యాలలో ముందుకు వెళ్ళాలంటే “స్వయం సేవకుడు” అనే శబ్దానికి గల ప్రాముఖ్యత తెలుసుకోవాలి. ఆధ్యాత్మిక వికాసం ఈ ఆధారంపైనే జరుగుతుంది. అన్ని సిద్ధులు ఈ పునాదిపైనే లభ్యమవుతాయి. మన శ్రమశీలత గుణకర్మ స్వభావములను పెంపొందించుకునే సాధన నడుస్తూనే ఉండాలి. మనం చాల చేసేశాం. విశ్రాంతి తీసుకుందామని ఎన్నడు అనుకోకండి. మీ వినమ్రత ఎలా ఉన్నది? పెద్దలకి గౌరవం, చిన్నవారికి ప్రేమ ఎవరు ఎంత ఇచ్చారు? స్వయం సేవకులుగా తయారయినవారిని అందరు నెత్తిన పెట్టుకుంటారు. ఎవరైతే తమ అహంకారాన్ని పెంచుకుంటూ పోతారో, వారు ఆధ్యాత్మిక క్షేత్రంలో నేతృత్వం వహించలేరు, కార్యకర్తగా ప్రగతి చెందలేరు. ఎవరు ఎంత ఎక్కువ వినమ్రత చూపిస్తారో వారే గొప్పవారు.

మిగిలిన నాలుగు సూత్రముల వ్యాఖ్యవచ్చే సంచికలో

★★★

## మార్చకూడదు

*యువతగా ఎదుగుతున్న ఒక కిశోర బాలుడికి ఒక ధనవంతుడితో పరిచయం ఏర్పడింది. అతని హంగు, ఆర్భాటం చూసి తానూ ఒక గొప్ప ధనికుడు కాదలిచాడు. చాలా కాలం అతనిలాగా సంపాదించడానికి కష్టపడి కొంత ధనం సమకూర్చుకున్నాడు. ఈ లోపల ఒక విద్వాంసుడితో పరిచయం ఏర్పడింది. ఆ విద్వాంసుడి విద్వత్తుకీ, వాక్చాతుర్యానికి ముగ్ధుడై సంపాదించడం మానేసి అధ్యయనం మొదలుపెట్టాడు. కాస్త చదువు అబ్బీ అబ్బగానే ఒక సంగీత విద్వాంసుడితో పరిచయం ఏర్పడింది. సంగీతానికి ఆకర్షితుడయ్యాడు. ఆ రోజునుండీ చదువు ఆపేసి సంగీతం నేర్చుకోవడం మొదలుపెట్టారు. ఎంత వయసు వచ్చినా అతను ధనవంతుడూ కాలేదు. విద్వాంసుడూ కాలేదు. సంగీతకారుడు, సమాజ సేవకుడో, నేతో కాలేకపోయాడు. ఒక మహాత్ముడి దగ్గరకు వెళ్ళి తన బాధను చెప్పుకున్నాడు. ఆయన ఇలా సమాధానం చెప్పాడు. “పుత్రా! ప్రపంచం మొత్తం ఆకర్షణతో నిండి ఉన్నది. ఏదైనా ఒక విషయం మీద నిశ్చయమైన నిర్ణయం తీసుకో, దాన్ని అమలుపరచు, ఖచ్చితంగా ఉన్నతిని సాధిస్తావు.” యువకుడు వారి సందేశాన్ని అర్థం చేసుకుని అలవరుచుకున్నాడు, ఎన్నుకున్న మార్గంలో ఉన్నతిని సాధించాడు.*

**పాము కుబుసాన్ని విడిచిపెట్టినట్లు, ఏక్షణంలోనైనా ఈదేహాన్ని త్యజించడానికి సిద్ధంగా ఉండు.**

# యుగనిర్మాణ ప్రణాళిక - యుగఋషి దృష్టి కోణంలో

వేదమూర్తి తపోనిష్ఠ, యుగద్రష్ట పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులు పరమవందనీయ మాతా భగవతీ శర్మగార్లు వివిధ సమయములలో ప్రవచించిన యుగనిర్మాణ లేక యుగపరివర్తన ప్రణాళికను క్లుప్తముగా మీకు అందజేసే ప్రయత్నములోనిది ఈ భాగము

యుగనిర్మాణ లక్ష్యాలు ఈ క్రింద తెలుపడమైనది

1. మానవునిలో దైవత్వమును వికసింజేయుట తద్వారా భూమిపై స్వర్గావతరణ.
2. వ్యక్తిత్వ నిర్మాణముతో కుటుంబ నిర్మాణము గావించి తద్వారా సమాజ నిర్మాణము గావించుట.
3. సాత్విక ఆహారమును స్వీకరించుచూ తద్వారా శరీర ఆరోగ్యమును, మనస్సును అదుపులోనుంచుకొనుచూ, సభ్య సమాజములో గౌరవాదరాభిమానములను పొందుట.
4. అన్ని ప్రాణులలో దైవాన్ని దర్శించుచూ, "వసుదైక కుటుంబకం" భావనను పెంపొందించుట.
5. ఒకే దేశము, ఒకేభాష, ఒకే ధర్మము మరియు ఒకే శాసనము అనెడి భావనలతో సహజీవనము చేయుట.
6. జాతి, కుల, మత, లింగ, వర్గ, భేదముల కతీతముగా సర్వులు సహజీవనము చేయుట.

పై యుగనిర్మాణ లక్ష్యాల సాధనకై భగవంతుడిచ్చిన ప్రణాళికా, మరియు శక్తితో ఋషులందించిన అనుశాసనములు పాటించుచూ, వారి ద్వారా రక్షణ పొందుచూ, సత్పురుషుల సహకారముతో పురుష ప్రయత్నాలు చేయాలి.

యుగనిర్మాణ లక్ష్య సాధనకై నిరాడంబర జీవనమును గడుపుచూ, శ్రేష్ఠచింతనలతో కూడిన శ్రేష్ఠమైన ఆలోచనలతో, ఆదర్శముగా కర్తవ్యపాలన చేయాలి.

యుగపరివర్తనకు నైతిక విప్లవం, బౌద్ధిక విప్లవం తద్వారా సామాజిక విప్లవములసాధించుచూ, ధర్మ తంత్రులను ఆధారముగా గొని వివిధ మాధ్యమముల ద్వారా లోక శిక్షణగావించుచూ, సామూహిక వివేక శీలతలతో గాయత్రిని జపించుచూ, పరిజనుల సహకారముతో సత్కర్మనాచ రించవలయును.

గాయత్రి సాధన మరియు పూజ్య గురుదేవుల సాహిత్య స్వాధ్యాయములు చేయుచూ నాలుగు సంయమములైన ఇంద్రియ, అర్థ, సమయ మరియు వాక్ సమయములను పాటించుచూ సేవాకార్యక్రమముల కొనసాగించాలి.

అట్లే వ్యక్తిత్వ నిర్మాణమునకై వివేకము, నిజాయితి, బాధ్యత మరియు పరాక్రమములనాధారముగా గొని సమర్థవంతముగా జీవితాన్ని మలచుకోవాలి.

ఆత్మ ప్రగతికి కావలసిన నాల్గు చరణములైన ఆత్మ సమీక్ష, ఆత్మ సంస్కరణ, ఆత్మ నిర్మాణము మరియు ఆత్మ వికాసముల నిత్యము పెంపొందించుకోవాలి. తదుపరి చర్యగా పటిష్ఠ పరివార నిర్మాణమునకై శ్రమశీలత, సువ్యవస్థ, శాలీనత, సహకారము మరియు మిత వ్యయములతో కూడిన పంచశీల సూత్రములను ఆచరణలో పెట్టాలి.

ఆధ్యాత్మిక జీవన సాధనకు మూడింటిని తప్పని సరిగా పాటించవలసియున్నది. అవి ఉపాసన, సాధన మరియు ఆరాధనల సహాయముతో మనలోని స్థూల, సూక్ష్మ మరియు కారణ శరీరాలను సంస్కరించుకొనవలసి యున్నది.

తదుపరి కర్మయోగాన్ని, జ్ఞాన యోగాన్ని మరియు శక్తి యోగాలను సాధన ద్వారా పటిష్ఠ పరచుకొనుచూ, భావన, ఆలోచన మరియు క్రియా ప్రక్రియలను సమన్వయ పరచుకొనుచూ, చింతన, నడవడిక మరియు వ్యవహారములు చక్కదిద్దుకొనుచూ, గుణకర్మ, స్వభావముల అభివృద్ధి చేసికోవాలి.

ఓజస్సు, తేజస్సు మరియు వర్చస్సులనెడి మూడు అంతర్గత శక్తుల ధారణ చేయుచూ, లోభ, మోహ, అహంకార, వాసన తృష్ణ, పుత్రేషణ మరియు లోకేషణ యనెడి దుర్గుణముల విడిచిపుచ్చాలి.

సాధుజనులను, సంస్కర్తలను మరియు వీరులను గౌరవించుచూ సాధన, విద్య, ఆరోగ్యము, స్వావలంబన, నారీ జాగరణ, పర్యావరణము పెంపొందించుకొనుచూ వ్యసన విముక్తి మరియు చెడు సాంప్రదాయముల తొలగించుకొనుచూ యుగ పరివర్తన దిశగా సమాజములోని ప్రతిభావంతుల నిర్మాణాత్మక సహాయ సహకారముల బొందుచూ, దారిలో వచ్చెడి అడ్డంకులను నివారించుకొనుచూ ముందడుగు వేయాలి.

యుగపరివర్తనా ప్రణాళిక ఆచరణకై నడుంబిగించిన

**అశాంతితో ఉన్నవాడికి మనస్సు భారం అవుతుంది.**

పరివారానికి ఎర్ర కాగడాను చిహ్నముగా పూజ్య గురుదేవులందించారు. దీని ద్వారా సామూహిక శక్తి, స్ఫూర్తితో, యుగశక్తి వికాసానికై ఈ క్రింది సత్యాలను ఆలంబనగా గొని, నినదించుచూ ముందుకు సాగాలి.

**నమ్మిన సత్యాలు:**

1. మానవుడు తన అదృష్టానికి తానే నిర్మాత.
2. మన ఆలోచనలకనుగుణముగా మన పరిస్థితులు ఉంటాయి.
3. స్త్రీ, పురుషులిరువురూ పరస్పర విరోధులు కారు – పరస్పర సహకారులు.

**మన నినాదాలు:**

1. మనం మారుదాం – యుగం మారుతుంది.
2. మనం బాగుపడదాం – యుగం బాగుపడుతుంది.
3. 21వ శతాబ్ది – ఉజ్జ్వల భవిష్యత్తు.
4. అందరికీ సేవ – అందరితో స్నేహం.

## యుగనిర్మాణానికి 18 సంకల్పాలు

### పూజ, జపం ముగించిన తర్వాత వీటిని నిత్యమూ చదువుతూ ఉండాలి.

1. ఈశ్వరుని సర్వవ్యాపకునిగాను, న్యాయనిర్ణేతగానూ, మేము అంగీకరించి, ఆయన ఆజ్ఞలను మా జీవితంలో తీర్చిదిద్దుకుంటాము.
2. శరీరాన్ని దైవమందిరంగా భావించి, ఆత్మ సంయమనం, నియమపాలన ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకుంటాము.
3. మనస్సును దురాలోచనలు, దుర్వ్యసనాల నుండి రక్షించుకొనుటకై స్వాధ్యాయ సత్సంగాలను ఏర్పాటు చేసుకుంటాము.
4. ఇంద్రియ సంయమం, అర్థ సంయమం, సమయ సంయమం మరియు ఆలోచనా సంయమాలను నిరంతరమూ అభ్యసిస్తుంటాము.
5. మమ్ము మేము సమాజం యొక్క అభిన్నఅంగంగా గుర్తుంచుకొని, అందరి హితములోను మా హితాన్ని చూసుకుంటాము.
6. విధులను నిర్వర్తిస్తాము. చేయకూడని పనులు చేయము. పౌరబాధ్యతలను పాటిస్తాము.
7. వివేకము, నిజాయితీ, బాధ్యత, పరాక్రమం జీవితంలో అవిచ్ఛిన్నమైన ఒక అంగంగా గుర్తిస్తాము.
8. నలుదిక్కులా మధురమైన, స్వచ్ఛమైన, నిరాడంబరమైన, సహృదయ వాతావరణాన్ని నిర్మిస్తాము.
9. అవినీతితో పొందిన సాఫల్యం కంటే, నీతితో పొందిన ఓటమినే శిరసావహిస్తాము.
10. వ్యక్తి విలువకు గీటురాయి వ్యక్తి సాఫల్యము, యోగ్యత, అంతస్థులు గాక అతని సద్భావనలు, సత్కర్మలని గుర్తిస్తాము.
11. ఇతరులు మా యెడల ఏవిధంగా ప్రవర్తించాలని కోరుకుంటామో, మేము ఇతరుల యెడ ఆవిధంగానే ప్రవర్తిస్తాము.
12. స్త్రీ పురుషులం పరస్పరం పవిత్ర దృష్టిని కలిగి ఉంటాము.
13. ప్రపంచంలో సత్ప్రవృత్తుల పుణ్య ప్రచారానికై మా సమయం, పలుకుబడి, జ్ఞానం, పురుషార్థం, సంపత్తిలో కొంతభాగాన్ని నియమిత ప్రకారం వినియోగిస్తుంటాము.
14. సాంప్రదాయాల కంటే వివేకానికి ప్రాముఖ్యతనిస్తాము.
15. సజ్జనులను సంఘటితపరుచుటలో, అవినీతియెడల కాఠిన్యత కలిగి ఉండుటలో, సృజనాత్మక కార్యకలాపాలలో పూర్తి ఆసక్తిని కలిగి ఉంటాము.
16. దేశ ఐకమత్యము, సమానతల యెడల శ్రద్ధ చూపుతాము. జాతి, లింగ, భాష, ప్రాంత, సాంప్రదాయాల కారణంగా, పరస్పరం ఎలాంటి బేధభావాన్ని కలిగి ఉండము.
17. మానవుడు తన భాగ్యానికి తానే నిర్మాత. ఈ విశ్వాసం ఆధారంగా మేము ఉత్కృష్టులమై, ఇతరులను శ్రేష్ఠులుగా చేస్తే, యుగం తప్పక మారుతుంది.
18. మేము మారుతాం–యుగం మారుతుంది. మేము చక్కబడతాం–యుగం చక్కబడుతుంది. ఈ తథ్యముపై సంపూర్ణ విశ్వాసము ఉన్నది.

ప్రియ పరిజనులారా! పూజ్య గురుదేవులందించిన పై మార్గనిర్దేశనమును గీతోపదేశముగాగొని, కర్తవ్యతా పరాయణులమై మనమంతా ఒకసామూహిక శక్తిగా ఎదిగి మన ప్రయత్నాలను, కృషిని యుగనిర్మాణ దిశగా ద్విగుణీకృతము గావించి, పూజ్య గురుదేవుల రానున్న జన్మశతాబ్ధికి మన గురుదక్షిణగా చెల్లించవలసియున్నది.

★★★

**చెడుకు ప్రతిగా మంచిని పంచే ధర్మం కన్నా గొప్ప ధర్మం లేదు.**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## ఆదర్శ వివాహము

హైదరాబాద్ గాయత్రీ చేతనాకేంద్ర కార్యకర్తలు చిరంజీవి ఫూల్ సింగ్, సౌభాగ్యవతి సావిత్రిల వివాహం 13.06.2010న గాయత్రీ చేతనా కేంద్రంలో నిర్వహించబడింది. వరుడు ఫూల్ సింగ్ ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని బస్తర్ జిల్లా ఉలేరా గ్రామనివాసి (తండ్రి ఆస్మాన్, తల్లి సుకుడి). గురుదేవుల సేవా కార్యక్రమంలో నిమగ్నమైన ఫూల్ సింగ్ హైదరాబాద్ గాయత్రీ చేతనా కేంద్ర కార్యకర్తగా సుపరిచితుడే. వధువు మెదక్ జిల్లా గ్రామనివాసి (తండ్రి అంజయ్య, తల్లి లక్ష్మి). ఈమె కూడా గాయత్రీ చేతనా కేంద్రంలో కార్యకర్తగా సేవాభావంతో పనిచేస్తున్నది. వీరిరువురికి భాషా భేదాలున్నా, కులాలు ఒకటి కాకపోయినా గురుదేవుల సేవలో ఉన్నవారు. అందు కొరకే గురుసేవలో ఉన్నవారినే జీవిత భాగస్వామిగా ఎన్నుకున్నారు. పెద్దల ఆశీస్సులతో గాయత్రీ పరివార్ దక్షిణ భారత సంచాలకులైన శ్రీ అశ్విని సుబ్బారావు గారి సారధ్యంలో శాంతికుంజ్ ప్రతినిధులు శ్రీ తోషన్, శ్రీ ఉత్తమ్ గార్ల సమక్షంలో సాంప్రదాయ సిద్ధంగా చి॥ ఫూల్ సింగ్, సౌభాగ్యవతి సావిత్రిల వివాహం కన్నుల పండువగా జరుగగా, వధూవరుల తల్లి తండ్రులు, బంధుమిత్రులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

## శక్తికలశ ప్రచార యాత్ర

గురుదేవుల జన్మశతాబ్ది సమారోహం సందర్భంగా గాయత్రీ చేతన కేంద్రం నుండి 24.4.2010న గురుదేవుల, మాతాజీల సూక్ష్మ సంరక్షణలో పెద్దల దీవెనలతో 'శక్తి కలశం' తన ప్రచార కార్యక్రమాలను సాగించింది. ముందుగా 24వ తేది సాయంత్రం హైదరాబాద్‌లోని మియాపూర్‌లో జరిగిన దీపయజ్ఞంతో తన ప్రచార కార్యక్రమం ప్రారంభించింది. 25 నుంచి కొండమల్లేపల్లి, నాగార్జున సాగర్, మాచర్ల, ముత్తుపల్లి గ్రామం, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, ఇతర గ్రామాలలో గురుదేవుల సందేశాన్ని శతజయంతి ఉత్సవాల గురించి వివరిస్తూ ఉత్సాహంగా ఉల్లాసంగా గురుదేవుల జ్ఞానజ్యోతులను వెలిగిస్తూ జ్ఞానరథం ముందుకు సాగింది.

గ్రామాలలో జరిగిన సత్సంగ కార్యక్రమాలలో లాల్‌మషాల్ స్టిక్కర్సు, 18 సంకల్పముల పాంప్లెట్స్ పంచి దేవస్థాపనల గురించి, యుగశక్తిగాయత్రి మాసపత్రిక గురించి, గురుదేవుల సాహిత్యం గురించి, ప్రజ్ఞామండలులను వారానికి ఒకసారి ఎలా నిర్వహించుకోవాలో వివరిస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమములో శ్రీ మణికుమార్, శ్రీరఘు, హవిబాబు, అచ్చయ్యతాత, వెంకటేశ్వరరావు గార్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. (10.05.2010 వరకు)

## ఉండవల్లిలో

23.05.2010 గుంటూరు జిల్లా ఉండవల్లి సెంటర్ నందు 24 గాయత్రీ మహా యజ్ఞం శ్రీ గార్లపాటి చెన్నకేశవ రావు ఆధ్వర్యంలో శ్రీమతి గౌతమి, శ్రీ రామారావు నిర్వహించారు. 300 మంది పరిజనులు యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2000 రూపాయలు గురుదేవుల సాహిత్యం విక్రయమయింది.

## బొబ్బిలిలో

11.03.2010 విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణంలో 9 కుండముల గాయత్రీ మహాయజ్ఞం హైదరాబాద్ టోలివారు, విశాఖపట్నం టోలివారు నిర్వహించారు. సుమారు 400 మంది పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని శ్రీ అగ్నిహోత్ర సుదర్శన బ్రహ్మ, అప్పలనాయుడు దంపతులు ఇ. హరి నారాయణ, యన్. లక్ష్మణ రావు, పి. లక్ష్మణరావు మహేశ్, సీతంనాయుడు, పాపా రాధ గార్లు పర్యవేక్షించారు.

ముందు రోజున (10.03.2010) 108 కలశములకు కుంకుమపూజ అగ్నిహోత్ర సుదర్శన బ్రహ్మగారిచే నిర్వహించబడింది. సాయంత్రం కలశయాత్ర చక్కగా

**అహంకారంతో ఆధ్యాత్మిక పతనం ఆరంభం అవుతుంది.**

జరిగింది. అనంతరం 2400 దీపాలతో దీపయజ్ఞం కన్నుల పండువగా జరిగింది.

## నెల్లూరులో

24.03.2010 శ్రీరామనవమి సందర్భమున ఆత్మకూరు ఆంజనేయస్వామి దేవస్థానం నందు పంచకుండి గాయత్రీ మహా యజ్ఞం శ్రీ భాస్కరనాయుడు గారి ఆధ్వర్యంలో శ్రీమతి భువన, సావిత్రి గార్లు నిర్వహించారు. సుమారు 150 మంది పాల్గొన్న ఈ కార్యక్రమానికి శ్రీ సుధాకర్ రెడ్డి సహకరించారు.

## విజయనగరంలో

**విజయనగరం జిల్లాలో గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలు :**

12.02.2010 మహ శివరాత్రి సందర్భమున పిప్పలబద్ర గ్రామంలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం శ్రీ జి.వెంకట నారాయణ, శ్రీ ఫూల్‌సింగ్, శంకర్ గారి ఆధ్వర్యంలో జరిగింది.

28.02.2010 నిచుకవలస గ్రామంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం, దీపయజ్ఞం.

07.03.2010 కుందర తిరువాడ గ్రామంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం, దీపయజ్ఞం.

16.03.2010 శ్రీరామనవమి సందర్భమున పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం, దీపయజ్ఞం.

శ్రీ సి.హెచ్ ఆదినారాయణ శ్రీ యస్. శంకరరావు, శ్రీ బత్తుల గురుమూర్తి, గోవింద, నీలయ్య, రామరాజు, మహేష్, నారాయణరావు గార్లు పైన ఇచ్చిన మూడు పంచకుండీ గాయత్రీ యజ్ఞ కార్యక్రమములను నిర్వహించారు.

## బోనకల్ గ్రామంలో

15.04.2010 ఖమ్మం జిల్లా బోనకల్ గ్రామంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరం నందు 9 కుండముల గాయత్రీ మహా యజ్ఞం శ్రీ షిరిడి సాయి బాబా మందిర కమిటి ఆధ్వర్యంలో డా॥ వెంకటేశ్వర్లు, శ్రీరామమూర్తి నిర్వహించారు. ఖమ్మం కార్యకర్తలు యజ్ఞనిర్వహణకు సహాయ సహకారాలందించారు. సుమారు 150 మంది యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విశాఖపట్నంలో

10.02.2010 విశాఖపట్నం నౌసేనాభాగ్ ఆవరణలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం శాంతికుంజ్ ప్రతినిధులు శ్రీ ఆచార్య భట్నాగర్, శ్రీ ఫూల్‌సింగ్ గార్లచే నిర్వహించబడింది. 2000 మంది పరిజనులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ భట్నాగర్ గారు తమ ప్రవచనం మరియు సామాన్య కర్మకాండలతో, శ్రీ ఫూల్‌సింగ్ తమ యుగసంగీతంతో పాల్గొన్నవారిని అలరించారు.

16.02.2010 నుండి 24.02.2010 వరకు గాయత్రీ చేతనా కేంద్రంలో శాంతికుంజ్ నుండి విచ్చేసిన శ్రీ పరమానంద ద్వివేది, శ్రీ ఫూల్‌సింగ్ కార్యకర్తలకు ప్రవచనం, కర్మకాండ, సవ్యంగా మంత్రోచ్చారణ, సమయ నియంత్రణ, ఉపన్యాసం ఎలా ఇవ్వాలి, తీసుకోవలసిన ముఖ్యమైన మెళకువలు, పాటలు పాడటం, డప్లీ వాయించడంలో శిక్షణ ఇచ్చారు. 70 మంది కార్యకర్తలు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అమలాపురంలో

16.04.2010 కాట్రేని కోనమండలం చెయ్యేరు గ్రామంలో శివాలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు రామంగారు, రైస్ మర్చంట్ శ్రీ కె. సూరిబాబు గారి సహాయ సహకారాలలో, పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం శ్రీ రామనంద స్వామి ఆధ్వర్యంలో కె. నాగమణి, గాయత్రీ, సుభద్ర, దుర్గ గార్లు నిర్వహించారు. 150 పరిజనులు పాల్గొనడమేగాక మంత్రదీక్ష తీసుకున్నారు. దీపయజ్ఞములు చేయ సంకల్పించారు.

19.04.2010 అయినవిల్లి మండలం జగన్నాధపురం గ్రామంలో శ్రీ ధనుంజయ్ గారి గృహమునందు పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం శ్రీరామనంద స్వామి ఆధ్వర్యంలో శ్రీమతి కె. నాగమణి, సుభద్ర, గాయత్రి, కుమారి, దుర్గ గార్లు నిర్వహించారు. సుమారు 50 మంది పాల్గొన్న

**ఆత్మజ్ఞానం లేనివారికి దేహం భారం అవుతుంది.**

పరిజనులు గాయత్రి మంత్ర జపము చేయుటకు, దీపయజ్ఞములు నిర్వహించుటకు సంకల్పించారు.

26.04.2010 ఉప్పలగుప్తం మండలం కొత్తపల్లి గ్రామంలో శ్రీరామాలయ ప్రాంగణంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం శ్రీరామానంద స్వామి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీపతిరాజు, లక్ష్మీగార్ల సహకారంతో కె. నాగమణి, సుభద్ర, గాయత్రి, దుర్గ గార్లు నిర్వహించారు. శ్రీ యన్.ఆర్.కె. రాజు, శ్రీ కె. సత్యన్నారాయణ గార్లు సహకారాన్ని అందించారు.

27.04.2010, 28.04.2010, 29.04.2010 తేదీలలో పోలవరం మండలం మురమళ్ళ గ్రామంలో శ్రీ వీరేశ్వరస్వామి ఆలయంలో సత్రయాగం నిర్వహించబడింది. మూడు రోజులు వివిధ సంస్థల వారి ఉపన్యాసములు మొదటి రోజు భగవద్గీతపై మల్లార విజయలక్ష్మిగారు; పిరమిడ్ సొసైటి రమణగారు గాయత్రీ పరివార్ కె. నాగమణి గారు, రెండవరోజు శ్రీ ఆకెళ్ళ సుబ్రమణ్య శర్మగారు, సహజయోగా సుబ్రమణ్యంగారు, గాయత్రి పరివార్ నాగమణిగారు, మూడవరోజు శివరామ దీక్షిత్ అచలానందాశ్రమ మాతాజి నిర్మలాంబరాము, బ్రహ్మ కుమారీస్ ఉమ అక్కయ్యగారు ప్రవచించారు. ఈ కార్యక్రమానికి శ్రీ జంధ్యాల రవి, విజయలక్ష్మి గార్లు సహాయ సహకారాలందించారు.

## ఆరేపల్లిలో

మెదక్ జిల్లా దుబ్బాక మండలంలోని ఆరేపల్లి గ్రామంలో గాయత్రీ మాత ఆలయం నిర్మించబడింది. 28.05.2010 నుండి 30.05.2010 మూడు రోజులు ధ్వజ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం శ్రీ శ్రీరామశర్మ, అమరవాది రంగనాధాచారి గార్ల పర్యవేక్షణలో నిర్వహించబడింది. ఈ మూడు రోజుల కార్యక్రమానికి కామారెడ్డి గాయత్రి పరివార్ సహకరించి విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి సుమారు 500 మంది హాజరైనారు.

## మధిరలో

16.05.2010 మధిరలో షిర్డి సాయి దేవాలయమందు 24 కుండముల గాయత్రీ మహా యజ్ఞం చీరాల డి.వి.ఆర్. మూర్తి, వరంగల్ డా॥ వెంకటేశ్వర్లు, ఇల్లెందు సత్యనారాయణ గారు, దాచేపల్లి వెంకయ్య గార్లచే నిర్వహించబడింది. సుమారు 300 మంది పాల్గొన్న ఈ యజ్ఞ కార్యక్రమానికి దాచేపల్లి జగన్నాధం, వెంకటేశ్వర్లు, యన్.బి.కె. చౌదరి, సిహెచ్. కోటేశ్వరరావు మొదలైన కార్యకర్తలు సహాయ సహకారాలు అందించారు. మధిర ఎరువులు పురుగు మందుల డీలర్స్ అసోషియేషన్ వారి ఆధ్వర్యంలో ఈ యజ్ఞ కార్యక్రమం జరిగింది.

### శ్రీ జిల్లా వెంకట నారాయణ గారు నిర్వహించిన యజ్ఞములు

| | | |
|---|---|---|
| 07.3.2010 | విజయవాడ | 24కుండముల విశ్వ శాంతియజ్ఞం |
| 25.3.2010 | రావాడ, పార్వతీపురం అగ్నిహోత్ర పీఠంలో | 24 కుండముల గాయత్రీమహాయజ్ఞం |
| 21.4.2010 | మొగడు పల్లి జహీరాబాద్ | 24 కుండముల గాయత్రీమహాయజ్ఞం |
| 16.4.2010 | టెలికం కాలని భూదేవి నగర్ హైదరాబాద్ | పంచకుండీ గాయత్రీ మహా యజ్ఞం |
| 25.4.2010 | గద్వాల్‌లో విశ్వ హిందూపరిషత్ వారిచే | పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం |
| 26.4.2010 | బీరెల్లి గద్వాల్ బి యస్.మూర్తి గారిచే | నాలుగు కుండముల గాయత్రీ మహాయజ్ఞం |
| 27.4.2010 | కాకులవరం గ్రామం గద్వాల్ | నాలుగు కుండముల గాయత్రీ మహాయజ్ఞం |
| 28.4.2010 | మల్లందొడ్డి గ్రామం గద్వాల్ | నాలుగు కుండముల గాయత్రీ మహాయజ్ఞం |

**జ్ఞాని నమ్రత కలిగి ఉంటాడు.**

# గుంటూరు నగరములో 8,9 మరియు 10 జూన్, 2010 తేదీలలో జరిగిన 108 కుండముల గాయత్రీ మహా యజ్ఞముపై ఒక సమీక్ష

పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య జన్మశతాబ్ది సమారోహ ప్రారంభ సూచికగా మొదలైన గాయత్రీ మహా యజ్ఞశృంఖలలో భాగముగా గుంటూరు నగరములో జూన్ 8,9 మరియు 10 తేదీలలో 108 కుండముల గాయత్రీ మహా యజ్ఞము నిర్వహించబడింది.

తొలుత యజ్ఞ కమిటీ ఏర్పాటు చేసి, లక్షల సంఖ్యలో గాయత్రీ మంత్రజపానికి గుంటూరు జిల్లాలోని వివిధ గ్రామాలలో గాయత్రీ పరిజనులను సిద్ధము చేశారు. అటుపిమ్మట ఇంటింటా దేవస్థాపనలు జరిపి సంకల్పము చేయించి గాయత్రీ మహా యజ్ఞ నిర్వహణకు కావలసిన యజ్ఞీయ వాతావరణాన్ని ప్రవేశపెట్టెడి ప్రయాజను ప్రారంభించారు. దీనిలో భాగముగా యజ్ఞములో పాలుపంచుకొనెడి వారి పేర్లను నమోదు చేసి అనేక మందిని ప్రభావితము గావించారు.

తదుపరి యజ్ఞకమిటిలోని కొందరు సభ్యుల బృందము శాంతికుంజ్ వెళ్ళి, యజ్ఞ నిర్వహణకు కావలసిన శక్తికలశాన్ని అందిపుచ్చుకొని దానిని గుంటూరు పట్టణమునకు చేర్చి, ప్రచారరథ సహాయముతో జిల్లా అంతటా విస్తృత ప్రచారము చేపట్టారు. ఈ విధముగా పూజ్య గురుదేవుల గురించి, యుగనిర్మాణ మిషన్ పనుల గురించి ఊరూరా ప్రచారము చేశారు. యజ్ఞ ప్రక్రియలోని "ప్రయాజ" ముగిసింది.

జూన్ 8వ తేది సాయంత్రము 4 గంటలకు యజ్ఞములోని ద్వితీయ అధ్యాయము "యాజ" కలశయాత్రతో ప్రారంభమై, గుంటూరు పట్టణములోని ప్రధాన వీధుల గుండా తిరుగుచూ యజ్ఞస్థలికి చేరింది.

జూన్ 9వ తేది ఉదయం 9.30 గంటలకు గాయత్రీ మహా యజ్ఞ కార్యక్రమం డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ గారి సారథ్యంలో అఖండ గురుసత్తా దివ్యాశిస్సులు సూక్ష్మ సంరక్షణలో దక్షిణ భారత గాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులు శ్రీ అశ్విని సుబ్బారావుగారి పర్యవేక్షణలో ప్రారంభమైనది. ఆకాశము మేఘావృతమై చిరు జల్లులు ప్రారంభమైనవి. అందరి మనస్సులలో యజ్ఞ నిర్విఘ్నంగా కొనసాగుతుందా? లేదా? అనే భయమావరించింది. ఇట్టి స్థితిలో రామకృష్ణ మాష్టారు మైకుపట్టుకుని, యజ్ఞములో పాల్గొన్నవారి మనస్సులలో పాతుకున్న భయాన్ని తొలగించెడి ప్రక్రియ చేపట్టి ఇలా అన్నారు. "అలనాడు శ్రీ కృష్ణుడు సర్వదేవతారాధనకు గోపబాలురను పురి కొల్పగా దేవతల అధిపతి ఇంద్రుడు కోపించి రాళ్ళ వర్షము కురిపించాడు. దీని నుండి గోపాలురను రక్షించుటకై శ్రీ కృష్ణుడు గోవర్ధన పర్వతము నెత్తి ఆ బాలగోపాలాన్ని, గోవులను సంరక్షించి పూజాక్రతువుని నిర్విఘ్నంగా చేయించాడు. అదే రీతిలో విశ్వశాంతికై, విశ్వ సౌభాతృత్వమునకై మనము చేపట్టిన ఈ యజ్ఞ క్రతువును పూజ్య గురుదేవులు సంరక్షించెదరు. మీరు నిశ్చితంగా యజ్ఞాన్ని నిర్వహించండి."

శ్రీ అశ్విని సుబ్బారావు గారు వేదికపై నుండి యజ్ఞ క్రతువు నిర్వహణలో ప్రముఖ పాత్రను పోషించారు. తన ప్రవచనములతో అందరిని ప్రభావితులుగావించిరి. శాంతికుంజ్ ప్రతినిధులు శ్రీ తోషన్, శ్రీ ఉత్తం యజ్ఞ కార్యక్రమం నిర్వర్తించారు.

సాయత్రం 6.30 గం॥లకు దీపయజ్ఞ సందర్భమున శ్రీ అశ్విని సుబ్బారావు గారు ప్రజ్ఞా పురాణ కథా ప్రవచనములను నిర్వహించి సభను ఆకట్టుకొన్నారు. భార్య భర్తల మధ్య సంబంధ బాంధవ్యముల గురించి, మహా కవిభారవి గురించి సత్యన్నారాయణ వ్రత కథలోని సత్య నిష్ఠల ప్రాధాన్యతల గురించి, వివరించి తదుపరి దీపయజ్ఞము నిర్వహించారు. శ్రీడి.బి.యన్. విశ్వనాథ్ గారిచే అనువాదము చేయబడిన "అమృతవాణి 10 సంస్కృతి సీతను తిరిగి తీసుకురావటానికి సరైన సమయం " పుస్తక ఆవిష్కరణను మాష్టారు గారు చేశారు.

మూడవరోజు గాయత్రి యజ్ఞము, పూర్ణాహుతి జరిగినది. శ్రీయుతులు డా॥ శ్రీరామ్, శ్రీ రవీంద్రరెడ్డి, శ్రీరంగానాయకులు, శ్రీ ప్రసాద్, శ్రీరామారావు, శ్రీ శ్రీనివాసరావు, శ్రీ ప్రకాశరెడ్డి, శ్రీమతి శ్రీ మోహన్ గాంధీ దంపతులు, గోరంట్ల రమ్య, దాక్షాయిణమ్మ, మామిళ్ళపల్లి శివ, శ్రీనివాసరెడ్డి, శ్యామల గార్లు గాయత్రీ మహయజ్ఞ క్రతువు నిర్వహణలో ప్రముఖ పాత్రను పోషించారు. పుస్తకాల స్టాల్‌ను నారాకోడూరు శక్తిపీఠం నుంచి శ్రీ కోట సుబ్బారావు బృందం నిర్వహించారు.

ఈ మహత్తర యజ్ఞ కార్యక్రమంలో ఉపనయన సంస్కారాలు (6), జన్మదిన సంస్కారాలు (2), పుంసవనం సంస్కారాలు (2) విద్యాభ్యాసం సంస్కారం (1), అన్న ప్రాసన సంస్కారం (డా॥ శ్రీరామ్‌గారి మనుమరాలు మోక్షశ్రీ) నిర్వహించబడ్డాయి.

**అణకువ, సూటిదనం, మంచిదనం, సహనం ఇవన్నీ ఆత్మానుభవానికి సోపానాలు.**